

'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12 వెల: ₹ 5.00

సంపుటి: 13 సంచిక: 12

శనివారం 4-4-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL






**జీడీపీకి షాక్!**
30 ఏళ్ల కనిష్టానికి పడిపోనున్న భారత్ వృద్ధి రేటు. - బిజినెస్‌లో





**మై సిస్టర్..**
ఆస్పత్రుల్లో నిరంతరాయంగా పనిచేస్తున్న నర్సులపై కథనం.-ఫ్యామిలీలో

# ఒక్క రోజే 75 కేసులు

## రాష్ట్రంలో కరోనాతో మరో ఇద్దరు మృతి

- మృతుల్లో ఒకరు మహిళ
- మరణానంతరం ఆమెకు పాజిటివ్ అని నిర్ధారణ
- 229కి చేరిన కేసులు, 11కి చేరిన మరణాలు
- 15 మంది డిశ్చార్జి..
- 161 కేసులు 'మర్కజ్'నుంచి వచ్చిన వారివే..
- మరో 600 మందికి పరీక్షలు
- నేడు ఫలితాలు వచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్/రంగారెడ్డి జిల్లా

కరోనా వైరస్ రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. కేసుల సంఖ్య భారీగా పెరుగుతోంది. శుక్రవారం ఏకంగా 75 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇద్దరు మరణించారు. వీరిలో ఒకరు రంగారెడ్డి జిల్లాకు చెందిన మహిళ కాగా, మరొకరు సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి అని మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించారు. కాగా, సదరు మహిళ ఈనెల 1వ తేదీన మరణించగా.. ఆమెకు కరోనా పాజిటివ్ అనే విషయం శుక్రవారం నిర్ధారణ అయింది. మొత్త మ్మీద రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన పాజిటివ్ కేసుల సంఖ్య 229కి చేరగా.. 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒకరిద్దరు మినహా అందరూ మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారే కావడం గమనార్హం. కాగా, శుక్రవారం 15 మంది డిశ్చార్జి కాగా, మొత్తం 32 మంది కోలుకున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. శుక్రవారం 400 మంది మర్కజ్‌కు వెళ్లొచ్చినవారు, వారి బంధువులకు పరీక్షలు నిర్వహించగా, 75 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇంకా 600 మంది మర్కజ్‌కు వెళ్లొచ్చినవారు, వారి బంధువుల నమూనాలను వైద్యాధికారులు కరోనా వైద్య పరీక్షలకు పంపించారు. వారి వివరాలు శనివారం వెల్లడయ్యే అవకాశముంది.

### 161 కేసులు మర్కజ్‌కు సంబంధించినవే

రాష్ట్రంలో ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారు 1,030 మంది ఉన్నారని వైద్య ఆరోగ్యశాఖ ఇంతకుముందే ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిలో దాదాపు 900 మందిని ఇప్పటివరకు గుర్తించి తమ అధీనంలోకి తీసుకున్నారు. వారి కుటుంబసభ్యులను, వారితో కాంటాక్ట్ అయినవారిని కూడా కొందరిని గుర్తించారు. బుధవారం 300 మందికి పరీక్షలు నిర్వహించగా, 30 మందికి పాజిటివ్‌గా తేలింది. గురువారం దాదాపు 350 మందిని పరీక్షించగా, 27 మందికి పాజిటివ్‌గా నిర్ధారించారు. శుక్రవారం 400 మందిని పరీక్షించగా, ఏకంగా 75 మందికి పాజిటివ్‌గా తేలింది. మొత్తం ఇప్పటివరకు నమోదైన కేసుల్లో మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారు, వారి ద్వారా కుటుంబసభ్యులకు, సమీప బంధువులకు ఏకంగా 161 మందికి కరోనా సోకినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

### అన్ని జిల్లాలకూ పాకిన వైరస్..

దాదాపు అన్ని జిల్లాలకూ కరోనా వైరస్ సోకింది. కొన్ని జిల్లాల్లో పాజిటివ్ కేసులు నమోదు కాకపోయినా,అక్కడి నుంచి శాంపిళ్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. ఖమ్మం జిల్లా నుంచి 116 శాంపిళ్లను పంపించగా, 111 మందికి నెగెటివ్ వచ్చాయి. ములుగులో నమోదైన రెండు కేసులకు చెందిన వ్యక్తులకు లక్షణాలు లేకపోయినా మర్కజ్‌కు వెళ్లారన్న కారణంతో వారిని పరీక్షించగా ఇద్దరికీ పాజిటివ్ రావడం ఆందోళన కలిగిస్తోంది. భూపాలపల్లి జిల్లాకు మిగతా 2వ పేజీలో ▶

**ఎక్కువ 'పాజిటివ్' నమోదైన జిల్లాలు (జిల్లా అధికారులు ఇచ్చిన సమాచారం)**

| జిల్లా | కేసులు |
|---|---|
| హైదరాబాద్ | 75 |
| వరంగల్ అర్బన్ | 20 |
| కరీంనగర్ | 17 |
| మేడ్చల్ | 15 |
| రంగారెడ్డి | 16 |
| నిజామాబాద్ | 18 |
| నల్లగొండ | 09 |
| కామారెడ్డి | 08 |
| మహబూబ్‌నగర్ | 07 |
| గద్వాల | 06 |
| సంగారెడ్డి | 06 |
| మెదక్ | 04 |
| భద్రాద్రి కొత్తగూడెం | 04 |



ఆదివారం రాత్రి 9 గంటలకు.. 9 నిమిషాలు

# దీపాలు వెలిగిద్దాం

**కరోనా చీకట్లను తరిమికొడదాం: ప్రధాని పిలుపు**

"కరోనా కారు చీకట్ల నుంచి కాంతి రేఖ కనపడుతుందన్న ఆశాభావంతో మనమంతా నిరంతరం ముందుకు సాగాలి. నిరాశా నిస్పృహలతో ఉన్న కరోనా వ్యాధిగ్రస్తుల్ని బయటకు తీసుకురావాలి. ఈ సంక్షోభ సమయంలో ఒకరికి ఒకరం ఉన్నామనే భావన వెయ్యి ఏనుగుల బలం కలిగిస్తుంది. మనలో ఉండే ఉత్సాహానికి మించిన శక్తి ఏదీ ఈ విశ్వంలో లేదు."

- ప్రధాని మోదీ

8లో

## విజయవంతం చేయండి

**రాష్ట్ర ప్రజలకు సీఎం కేసీఆర్ పిలుపు**



సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ నెల 5న రాత్రి 9 గంటలకు తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా దీపాలు వెలిగించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కోరారు. కరోనా వైరస్‌పై పోరుకు సంఘీభావ సంకేతంగా, ప్రజల ఐక్యతను చాటేలా దీపాలు వెలిగించి, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మానవజాతి తనకు పట్టిన పీడపై చేస్తున్న గొప్ప పోరాటం స్ఫూర్తివంతంగా సాగాలని ముఖ్యమంత్రి అభిలషించారు.

**శుక్రవారం అర్ధరాత్రి భారత కాలమానం ప్రకారం**

- **10,79,961** ప్రపంచవ్యాప్తంగా నమోదైన కరోనా కేసులు
- **58,110** ప్రపంచవ్యాప్తంగా నమోదైన మరణాలు
- **534** ఒక్కరోజే దేశవ్యాప్తంగా నమోదైన కేసులు
- **20,629** అమెరికాలో శుక్రవారం కేసులు
- **716** మరణాలు
- **90** మరణాలు
- **3,041** దేశంలో మొత్తం కేసులు
- **490** మహారాష్ట్రలో నమోదైన మొత్తం కేసులు
- **647** తబ్లిగి జమాత్‌కు హాజరైన వారిలో పాజిటివ్ కేసులు
- **211** దేశవ్యాప్తంగా కోలుకున్న వారి సంఖ్య

**ఏపీలో పాజిటివ్ కేసులు 164**

- శుక్రవారం నమోదైన కేసులు 15
- నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 32 కేసులు
- ఏపీలో తొలి కరోనా మరణం



## వైద్యులు, పోలీసులకు పూర్తి వేతనం..

**ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ**

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య, పోలీసు శాఖలకు సంబంధించిన ఉద్యోగులకు పూర్తి వేతనాలు అందనున్నాయి. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీవో నంబర్ 27కు సవరణలు చేస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ రెండు శాఖలకు సంబంధించిన సిబ్బందికి ప్రస్తుతం చెల్లిస్తున్న పూర్తి వేతనం ఇవ్వాలని, ఈ మేరకు ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ విభాగం చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## సరుకులు లేవు.. సరఫరా చాలదు

- కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లలో నిత్యావసర సరుకుల కొరత
- ఇడ్లీ, ఉప్మా రవ్వ, గోధుమపిండి, నూనెలు దొరకని పరిస్థితి
- లాక్‌డౌన్ నేపథ్యంలో అవసరానికి మించి కొనుగోళ్లే కారణం

సాక్షి, హైదరాబాద్: దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న లాక్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచే కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్‌లకు సరుకు రవాణా క్లిష్టతరంగా మారింది. డిమాండ్ మేరకు నిత్యావసరాలు సరఫరా లేకపోవడం, గోదాముల్లో సరుకుల రవాణాకు, ప్యాకేజింగ్‌కు సిబ్బంది కొరత ఉండటంతో నిల్వలు క్రమంగా ఖాళీ అవుతున్నాయి. ఇప్పటికే నగరంలోని చాలా సూపర్‌మార్కెట్‌లలో ఖాళీ ర్యాంకులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా రోజువారీ అవసరాల్లో ప్రధానంగా వాడే ఉప్మా,

మిగతా 2వ పేజీలో ▶



# 'పరీక్ష' సమయం

**వేలల్లో కరోనా నిర్ధారణ పరీక్షలకు ఆరోగ్యశాఖ సన్నద్ధం**

- వైరస్ వ్యాప్తి దృష్ట్యా విరివిగా పరీక్షలు తప్పవని నిర్ణయం
- 2.20 లక్షల మందికి నిర్వహించేలా అత్యాధునిక కిట్లకు ఆర్డర్
- రెండు గంటల్లోనే నిర్ధారణ ఫలితాలను తెలిపే పరికరాలు
- ప్రతి ఒక్కరికీ 2 రకాల పరీక్షలు: ఐసీఎంఆర్

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో కరోనా కోరలు చాస్తోంది. కేసుల సంఖ్య పెరుగుతుండటంతో పరిస్థితి అదుపు తప్పిందన్న భావన నెలకొంది. మర్కజ్ ప్రార్థనలకు వెళ్లొచ్చిన వారితోనే వైరస్ వ్యాపిస్తుండటంతో ప్రభుత్వ యంత్రాంగానికి కంటిమీద కునుకులేకుండా పోయింది. ఇంకా కేసులు పెరగొచ్చని వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలే అంటున్నాయి. దీనిని బట్టి రాష్ట్రం మొత్తం రెడ్‌జోన్‌లో ఉన్నట్టని ఒక అధికారి వ్యాఖ్యానించారు. పరిస్థితి నియంత్రణలోకి రావాలంటే విరివిగా కరోనా వైద్య పరీక్షలు చేయడమే మార్గమన్న అభిప్రాయానికి వైద్య, ఆరోగ్యశాఖ వచ్చింది. వేలాదిమందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయాలని యోచిస్తోంది. ప్రస్తుతం విదేశీ ప్రయాణ చరిత్ర, ఢిల్లీ ప్రార్థనలతో నేరుగా సంబంధం ఉన్న వారు, వారితో కాంటాక్ట్ అయినవారిలో లక్షణాలున్న వారికే పరీక్షలు చేస్తున్నారు. ఇప్పుడు అలాకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా వైరస్ సోకిందన్న భావనతో జలుబు, దగ్గు, జ్వరం తదితర లక్షణాలున్న వారిని గుర్తించి, వారికి పరీక్షలు చేసేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం 2.20 లక్షల మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా కిట్లకు ఆర్డర్లు ఇచ్చినట్లు ఉన్నతస్థాయి కమిటీ సభ్యుడొకరు తెలిపారు. ఈ కిట్లు విడతల వారీగా రాష్ట్రానికి చేరుకోనున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ ఆధ్వర్యంలో సీసీఎంబీ సహా ఐదుచోట్ల కరోనా పరీక్షలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆరు ప్రైవేటు ల్యాబ్‌ల్లోనూ పరీక్షలు చేయించుకునేందుకు అనుమతిచ్చింది. వేలాదిమందికి ఒకేసారి చేయాల్సి వస్తే ప్రైవేటు ల్యాబ్‌లనూ ఉపయోగించుకునే అవకాశముందని ఆ అధికారి వెల్లడించారు. ఇంకా, ముున్ముందు జాతీయ స్థాయి పరిశోధన సంస్థల్లోనూ పరీక్షలు చేసే అవకాశం ఉన్నట్లు ఐసీఎంఆర్ తెలిపింది. అంటే కరోనా పరీక్షలుచేసే సామర్థ్యాన్ని పెంచుతారు.

### 2 గంటల్లోనే నిర్ధారణ

ప్రస్తుతం కరోనా నిర్ధారణ పరీక్షలు ప్రహసనంగా మారాయి. శాంపిళ్లు సేకరించడం, వాటిని పరీక్షలకు పంపించడం, ఫలితాలకు ఆరు నుంచి ఎనిమిది గంటలు పడుతుండటంతో ఎక్కువ మందికి పరీక్షలు నిర్వహించలేని పరిస్థితి.. దీంతో భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అత్యాధునిక కరోనా కిట్లను అందుబాటులోకి తెచ్చింది. వీటితో రెండు గంటల్లోనే నిర్ధారణ పరీక్ష ఫలితాలు వస్తాయని ఐసీఎంఆర్ చెబుతోంది. వీటి కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిందని వైద్యాధికారులు చెబుతున్నారు. పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా అన్ని జిల్లాల్లో వైరస్‌కు గురైన వారిని గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వైద్యాధికారి ఒకరు

మిగతా 2వ పేజీలో ▶








అసలే కరోనా మృతులతో అతలాకుతలం అవుతున్నారు. మన మృతుల సంఖ్య చెబితే తట్టుకోలేర్సార్!

# పోర్టబుల్ వెంటిలేటర్

**'జీవన్‌లైట్' రూపొందించిన ఐఐటీ హైదరాబాద్**

- ఒక్కో వెంటిలేటర్ ధర రూ. లక్షే
- రోజుకు 50–70 యూనిట్లు తయారీ
- లిథియం అయాన్ బ్యాటరీతో 5 గంటలపాటు పనిచేసేలా డిజైన్
- ఐవోటీ సాంకేతికత ఆధారంగా ఫోన్ యాప్‌తోనూ పని చేసేలా రూపకల్పన



సాక్షి, హైదరాబాద్/సంగారెడ్డి టౌన్

కరోనా వైరస్ సోకిన వారికి చికిత్స అందించేందుకు అవసరమైన మాస్కులు, వెంటిలేటర్ల తయారీకి సంబంధించిన నమూనాలపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. ఇటీవల తక్కువ ఖర్చుతో తయారయ్యే 'బ్యాగ్ వాల్వ్ మాస్క్'ను డిజైన్ చేసిన ఐఐటీ హైదరాబాద్.. తాజాగా అత్యవసర సమయాల్లో ఉపయోగించే వెంటిలేటర్‌ను తయారు చేసింది. ఐఐటీ అనుబంధ సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (సీఎఫ్‌హెచ్‌ఈ)కి చెందిన ఏరోబయోసిస్ ఇన్నోవేషన్స్ అనే స్టార్టప్ కంపెనీ ఈ వెంటిలేటర్‌ను రూపొందించింది. తక్కువ ఖర్చుతో తయారయ్యే ఈ ఎమర్జెన్సీ వెంటిలేటర్‌లో అనేక అత్యాధునిక ఫీచర్లు ఉన్నట్లు ఏరోబయోసిస్ చెబుతోంది. 'జీవన్ లైట్'గా పిలిచే ఈ వెంటిలేటర్.. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) ఆధారంగా పనిచేస్తుంది. దీంతో విద్యుత్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లోనూ బ్యాటరీ ద్వారా వాడొచ్చు.

### వైద్యులు, కుటుంబ సభ్యులకు రక్షణ

కరోనా వైరస్‌కు శరవేగంగా వ్యాపించే లక్షణం ఉండటంతో ఈ జీవన్‌లైట్ ఎమర్జెన్సీ వెంటిలేటర్

మిగతా 2వ పేజీలో ▶

**ఏకబిగిన 5 గంటలపాటు**

హృద్రోగులు, టైప్–2 మధుమేహం ఉన్న వారు కరోనా వైరస్ బారిన పడితే శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇలాంటి వారికి అత్యవసర సమయాల్లో ఈ జీవన్ లైట్ రక్షణ కవచంలా పనిచేస్తుంది. కరోనా సోకిన వారికే కాకుండా ఇతర సందర్భాల్లో చిన్న పిల్లలు, వృద్ధులకు తలెత్తే శ్వాస సంబంధ సమస్యలకు కూడా ఈ ఎమర్జెన్సీ వెంటిలేటర్‌ను వాడొచ్చు. జీవన్‌లైట్‌లో ఉండే లిథియం అయాన్ బ్యాటరీని సెల్‌ఫోన్ తరహాలో రీచార్జి చేసుకోవచ్చు. ఇందులో ఉండే బ్యాటరీని ఒకసారి చార్జ్ చేస్తే 5 గంటలపాటు ఏకబిగిన పనిచేస్తుందని దీన్ని డిజైన్ చేసిన ఏరోబయోసిస్ ఇన్నోవేషన్ చెబుతోంది. ఈ పరికరానికి వైర్‌లెస్ కనెక్టివిటీ ఫీచర్ ఉండటంతో రిమోట్ మానిటరింగ్ విధానంలో రోగులను తాకకుండానే వాడే వీలుంది.

# కరోనా నియంత్రణకు డీఆర్‌డీవో టెక్నాలజీలు

**తక్షణ అవసరాలకు రూపొందిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.సతీశ్‌రెడ్డి వెల్లడి**



**సాక్షి, హైదరాబాద్:** కరోనా మహమ్మారి దేశంలో కల్లోలం సృష్టిస్తున్న నేపథ్యంలో తక్షణ అవసరాల కోసం డీఆర్‌డీవో అనేక టెక్నాలజీలను రూపొందిస్తోందని ఆ సంస్థ డైరెక్టర్ జి.సతీశ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే డీఆర్‌డీవో పరిశోధన సంస్థలు శానిటైజర్లు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే వెంటిలేటర్లను ప్రైవేట్ సంస్థల సహకారంతో తయారు చేస్తున్నట్లు ఆయన 'సాక్షి'తో చెప్పారు. కరోనా వైరస్ ప్రభావం ఊపిరితిత్తులపైనే ఎక్కువ కాబట్టి డీఆర్‌డీవోకి చెందిన సొసైటీ ఫర్ బయో మెడికల్ టెక్నాలజీ (ఎస్‌బీఎంటీ) కార్యక్రమం కింద డెబెల్ అనే పరిశోధనశాలలో వినూత్న వెంటిలేటర్‌ను అభివృద్ధి చేశామన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రెషర్ ఫ్లో సెన్సార్లు, బ్రీత్ రెగ్యులేటర్ల సాయంతో ఈ వెంటిలేటర్లను అభివృద్ధి చేశామని చెప్పారు. ఒకే వెంటిలేటర్ ద్వారా పలువురు రోగులకు సేవలందించే మల్టీ పేషెంట్ వెంటిలేటర్ తయారీకి కూడా పరిశోధనలు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించారు. మరో వారంలో ఈ వెంటిలేటర్ కూడా అందుబాటులోకి వచ్చే అవకాశముందని చెప్పారు. దీంతో పాటు ఎన్–95, ఎన్–99 మాస్కుల ఉత్పత్తి ఇప్పటికే మొదలు కాగా.. తాజాగా చికిత్స చేసే వైద్యులకు వైరస్ నుంచి రక్షణ కల్పించేందుకు వినూత్నమైన బయో సూట్‌లను అభివృద్ధి చేశామని చెప్పారు. దేశంలో కరోనా వైరస్ బాధితుల సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ కొత్త బయో సూట్ల అవసరం చాలా ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి తాము రోజుకు 15 వేల నుంచి 20 వేల బయో సూట్లను తయారు చేయగలమని ఆయన ఒక ప్రశ్నకు బదులుగా చెప్పారు. డీఆర్‌డీవో గతంలోనే రేడియో ధార్మికత నుంచి రక్షణ కల్పించేందుకు ఒక బయో సూట్‌ను అభివృద్ధి చేసిందని, వీటిని మాత్రం రోజుకు లక్ష వరకు తయారు చేయగలమని చెప్పారు. పాత బయో సూట్‌ను కరోనా వైరస్‌ను కూడా తట్టుకునేలా మార్చడం ద్వారా కొత్త సూట్ సిద్ధమైందని తెలిపారు. భవిష్యత్‌లో కరోనా తరహా వైరస్‌ల ముప్పును ఎదుర్కొనేందుకు డీఆర్‌డీవో కూడా పరిశోధనలు చేపడుతోందని తెలిపారు.



కేటీఆర్‌కు చెక్ అందజేస్తున్న వీఎస్టీ ఎండీ లహరి. చిత్రంలో నాయిని

# సీఎం సహాయనిధికి భారీగా విరాళాలు

**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి సహాయనిధికి శుక్రవారం పలువురు విరాళాలు అందజేశారు. పలు సంస్థలు, పారిశ్రామికవేత్తలతో పాటు పలువురు విరాళాలకు సంబంధించిన చెక్కులను ప్రగతిభవన్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుకు అందజేశారు. సీఎం సహాయనిధికి విరాళాలు అందజేసిన వారికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ పరిశ్రమల సమాఖ్య తరఫున అధ్యక్షుడు సుధీర్ రెడ్డి రూ. 1.22 కోట్లు, సాయి లైఫ్ సైన్సెస్, హువావే ఇండియా లిమిటెడ్, వీఎస్టీ ఇండస్ట్రీస్, జీఎస్‌జీ బిల్డర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, ఆవ్రా ల్యాబొరేటరీ కోటి రూపాయల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం అందజేశారు. బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ తరఫున రూ. 50 లక్షల రూపాయల చెక్కును సినీనటుడు, ఏపీ ఎమ్మెల్యే బాలకృష్ణ అందజేశారు. టీఎస్టీసీ స్పోర్ట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సహృదయ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, వెన్సా ఫౌండేషన్, రవి ఫుడ్స్, గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ రూ.25 లక్షల చొప్పున చెక్కులను విరాళంగా అందజేశారు. వేసెళ్ళ మీడోస్, సికింద్రాబాద్ క్లబ్ రూ.20 లక్షల చొప్పున, జలవిహార్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌వీఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ రూ.15 లక్షల చొప్పున చెక్కులను కేటీఆర్‌కు అందించారు. సామ్రాట్ ఐరన్స్, పుష్పభూమి ఎస్టేట్ డెవలపర్స్, మహేశ్వరి భవన్ ట్రస్ట్, గ్రీన్‌రిచ్ ఎస్టేట్స్, ఫెయిర్ మౌంట్ బిల్డర్స్ 11 లక్షలు అందజేశాయి. అభిరుచి స్వగృహ ఫుడ్స్, వంశీరామ్ హోమ్స్, త్రివేణి ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎన్.సాయిబాబా అండ్ కంపెనీ, శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్, జెమ్ అవెన్యూస్, పట్నం మహేందర్‌రెడ్డి హాస్పిటల్, టీఎస్‌ఐసీ ఎంప్లాయీస్, కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.10 లక్షల చొప్పున విరాళాలకు సంబంధించిన చెక్కులను అందించాయి.

# దివీస్ దాతృత్వం

**28 వేల మందికి నిత్యావసరాల పంపిణీ**

**సాక్షి, హైదరాబాద్:** కరోనా నియంత్రణకు పాటుపడుతున్న ప్రభుత్వానికి దివీస్ ల్యాబొరేటరీస్ తనవంతు చేయూతనందిస్తోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు చెరో రూ.5 కోట్లు విరాళం ఇచ్చిన ఆ సంస్థ.. 28 వేల మందికి నిత్యావసర సరుకులను సైతం పంపిణీ చేసింది. కరోనా మహమ్మారికి అడ్డుకట్ట వేయడంలో అహర్నిశలు కృషి చేస్తున్న వైద్యులు, పోలీసు, అగ్నిమాపక, పారిశుద్ధ్య సిబ్బందికి మాస్కులు, శానిటైజర్లు, గ్లౌజులు, బాడీకవర్ సూట్లను అందజేసింది. రసాయన, ఆల్కహాల్ ఆధారిత శానిటైజర్లను ప్రభుత్వ ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాలు, గ్రామ పంచాయతీలకు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ మురళి కె.దివి ఒక ప్రకటనలో తెలిపారు. 47 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణకు తోడ్పాటునందించడమేగాకుండా.. క్వారంటైన్‌లో ఉన్నవారికి, ఆస్పత్రుల్లో ఉన్న రోగులు, సిబ్బందికి ఆహారాన్ని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. సామాజిక బాధ్యతగా కరోనా వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యమవుతున్నామని తెలిపారు.

# ఏపీలో పాజిటివ్ కేసులు 164

- శుక్రవారం నమోదైన కేసులు 15
- నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 32 కేసులు
- రాష్ట్రంలో తొలి కరోనా మరణం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 164కి చేరింది. గురువారం రాత్రికి 149గా ఉన్న ఈ సంఖ్య శుక్రవారం మరో 15 కేసులతో 164కి పెరిగింది. ఇందులో 140 కేసులు ఢిల్లీ నుంచి వచ్చిన వారు, వారితో కాంటాక్ట్ అయినవారివే. కరోనా పాజిటివ్ కేసుల్లో అత్యధికంగా పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 32 ఉన్నాయి. రాష్ట్రంలో తొలి కరోనా పాజిటివ్ కేసు నమోదైంది కూడా నెల్లూరులోనే కావడం గమనార్హం. శుక్రవారం నమోదైన 15 పాజిటివ్ కేసులు ఢిల్లీ నుంచి వచ్చిన వారివేనని అధికారులు తెలిపారు. పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతాలను రెడ్‌జోన్‌లుగా ప్రకటించి ముమ్మరంగా పారిశుధ్య పనులు చేస్తున్నారు. విదేశీ ప్రయాణికులు, ఢిల్లీ నుంచి వచ్చిన ప్రయాణికులు, వారితో కాంటాక్ట్ అయిన వారిని హోం ఐసొలేషన్‌లో ఉంచి, వారిని బయటకు రాకుండా పహారా కాస్తున్నారు. కాగా, కృష్ణా జిల్లా విజయవాడలో తొలి కరోనా మరణం చోటు చేసుకుంది. ఢిల్లీ మత ప్రార్థనకు వెళ్లొచ్చిన యువకుడి నుంచి అతడి తండ్రికి కరోనా సోకడంతో ఆయన మృతి చెందారు. కరోనా సోకేనాటికే యువకుడి తండ్రి హైపర్ టెన్షన్, డయాబెటిస్‌తో బాధపడుతున్నట్టు అధికారులు తెలిపారు.







నేను సైతం అన్నట్లు కరోనాపై అవగాహన కల్పించడానికి ఎవరికి తోచినట్లు వారు ప్రచారం చేస్తున్నారు.. కొందరు టిక్‌టాక్‌లు చేస్తే.. మరికొందరు వీడియో మెసేజ్‌లు పెడుతున్నారు.. ఇంగ్లండ్, స్కాట్లాండ్‌లో అయితే కొందరు కళాకారులు ఇలా తమ చిత్రాలతో కోవిడ్-19పై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

# ఒక్క రోజే 75 కేసులు

▶ మొదటి పేజీ తరువాయి

చెందిన వ్యక్తి మర్కజ్‌కు వెళ్లొచ్చారు. అతనికి లక్షణాలు లేకపోయినా పరీక్షించడంతో పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణైంది. మర్కజ్‌కు వెళ్లొచ్చి న వారు వారి కుటుంబసభ్యులకు, స్నేహితులకు అంటించారు. గొలుసుకట్టుగా ఇంకెంతమందికి వైరస్ వ్యాపిస్తుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. వెయ్యి మంది ఒక్కొక్కరు సరాసరి పదిమంది చొప్పున 10 వేల మందిని కలిశారని, వారు ఇంకెందరిని కలిశారన్నదే ఇప్పుడు ఆందోళన కలి గించే విషయమని వైద్యాధికారులు అంటున్నారు.

**అత్యధికంగా హైదరాబాద్ నుంచే 75 కేసులు**

హైదరాబాద్ నగరం ఇప్పుడు కరోనాకు కేంద్రంగా మారింది. నగరంలో ఏకంగా 75 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని స్థానిక వైద్యాధికారులు ప్రకటించారు. వివిధ జిల్లాల అధికారులు ప్రకటించిన వివరాల ప్రకారం వరంగల్ అర్బన్ జిల్లాలో 20 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. వారంతా మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారే. ఆ తర్వాత కరీంనగర్ జిల్లాలో 17 కేసులు నమోదు కాగా, వారిలో ఇండోనేషియా నుంచి వచ్చినవారు, వారితో ఉన్నవారితో కలిపి 14 మందికి సోకగా, మరో ముగ్గురు మర్కజ్‌కు వెళ్లొచ్చినవారు కావడం గమనార్హం. రంగారెడ్డి జిల్లాలో 16, నిజామాబాద్ జిల్లాలో 18 మందికి పాజిటివ్ నమోదైంది. మేడ్చల్ జిల్లాలో 15 మందికి పాజిటివ్ వచ్చింది. మృతుల్లో అత్యధికంగా హైదరాబాద్‌లో ఏడుగురు ఉన్నారు. రంగారెడ్డి, గద్వాల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన వారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. కాగా, అత్యధిక కేసులు నమోదవుతున్న జిల్లాల్లో అత్యంత అప్రమత్తత ప్రకటిస్తున్నారు. ఇళ్ల నుంచి ఎవరూ బయటికి రావద్దని, అవసరమైన నిత్యావసరాలు తామే ఇంటికి నేరుగా సరఫరా చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లో కాలు బయటపెట్టరాదని ఆయా జిల్లాల కలెక్టర్లు హెచ్చరిస్తున్నారు.



మృతురాలి కుటుంబసభ్యులను అంబులెన్స్‌లో క్వారంటైన్ సెంటర్‌కు తరలిస్తున్న అధికారులు

**మహిళ మరణంతో కలకలం...**

రంగారెడ్డి జిల్లాలో కరోనా మరణం సంభవించడంతో స్థానికంగా కలకలం రేగింది. నందిగామ మండలం చేగూరు గ్రామానికి చెందిన మహిళ (55) కొన్నిరోజులుగా గొంతునొప్పి, శ్వాసకోస సమస్యతో బాధపడుతూ గత నెల 30న ఆర్‌ఎంపీకి చూపించుకున్నారు. మర్నాడు షాద్‌నగర్‌లో మరో ఆర్‌ఎంపీ వద్ద చికిత్స పొందారు. నయం కాకపోవడంతో 31న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఎండోస్కోపీ చేయించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అక్కడి డాక్టర్ల సూచన మేరకు ఈనెల 1న సాయంత్రం 5 గంటల సమయంలో ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సాయంత్రం 6.48 సమయంలో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనుమానంతో ఈమె నుంచి గొంతులోని స్వాబ్ నమూనాలను సేకరించి పరీక్షలకు పంపగా, శుక్రవారం వచ్చిన ఫలితాల్లో కరోనా పాజిటివ్ అని తేలింది. ఆమె అంత్యక్రియలు గురువారం స్వగ్రామంలో జరిగాయి. ఆమెకు భర్త, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అంతిమ కార్యక్రమంలో దగ్గరి నుంచి పాల్గొన్న 15 మంది ఇరుగుపొరుగు వారు, బంధువులను అధికారులు గుర్తించారు. వీరిలో 55 ఏళ్లు పైబడిన వారిని గాంధీ ఆస్పత్రికి, మిగతా వారిని రాజేంద్రనగర్‌లోని క్వారంటైన్ కేంద్రానికి తరలించారు. మృతురాలు చేగూరులో కిరాణా షాపు నిర్వహిస్తున్నారు. నెల నుంచి అస్వస్థతగా ఉండటంతో అప్పుడప్పుడు షాపు తెరుస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆమెకు థైరాయిడ్‌తోపాటు బీపీ, షుగర్ ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. కాగా, ఇక్కడి కన్హా శాంతి వనంలో కూలి పనులు చేస్తున్న బిహార్‌కు చెందిన నలుగురు వ్యక్తులు ఈమె ఇంట్లోనే అద్దెకు ఉంటున్నారు. వీరు కొద్దిరోజుల క్రితం మర్కజ్ ప్రార్థనల్లో పాల్గొన్న వారు ప్రయాణించిన రైల్లోనే ఇక్కడికి వచ్చినట్టుగా చెప్పుకుంటున్నారు.

**ఎలా వ్యాప్తి చెందింది...**

మహిళకు కరోనా ఎలా సోకిందనే కోణంలో అధికారులు ఆరాతీస్తున్నారు. ఆమె ఇంట్లో అద్దెకున్న వారితోపాటు ఆమె కుమారుడు పొరుగున ఉన్న కన్హా శాంతివనంలో పనిచేస్తున్నారు. లాక్‌డౌన్ కారణంగా శాంతివనంలో అడపాదడపా తప్ప రోజువారీ కార్యక్రమాలు పెద్దగా జరగడం లేదు. దీంతో వీళ్లు అక్కడకు వెళ్లారా?, వీరిలో ఎవరికైనా కరోనా లక్షణాలు ఉన్నాయా? వీరు ఎవరెవరితో స న్నిహితంగా ఉన్నారు? శాంతివనంలో ఎంతమంది ఉన్నారు? ఎక్కడి నుంచి వచ్చారు? అనే దిశగా దృష్టిపెట్టడంతో పాటు ప్రైమరీ, సెకండరీ కాంటాక్ట్‌లపై అధికారులు ఆరా తీస్తున్నారు. కలెక్టర్ అమయ్‌కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ చేగూరు గ్రామాన్ని సందర్శించారు. మృతురాలి నివాసానికి కిలోమీటర్ రేడియస్ పరిధిలో సర్వే నిర్వహించాలని రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

# మందుబాబుల దాహం తీరదు!

**డాక్టర్ చీటీ ఉంటే లిక్కర్ ఇస్తారన్నది అపోహ మాత్రమే**

**సాక్షి, హైదరాబాద్:** మద్యపాన వ్యసనపరుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని డాక్టర్ చీటీ ఉంటే లిక్కర్ ఇస్తారన్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల 14 వరకు కచ్చితంగా మందు విక్రయాలు ఉండవని, అప్పటివరకు మద్యంపై ఎలాంటి ఆశలు పెట్టుకోవద్దని స్పష్టం చేస్తున్నాయి. కేరళ తరహాలో డాక్టర్ల సూచన మేరకు మద్యం ఇవ్వాలన్న ప్రతిపాదన అసలు మన రాష్ట్రంలో లేనేలేదని ఎక్సైజ్ ఉన్నతాధికారులు కొట్టిపారేస్తున్నారు. గత నెల 29న రోజుకు రెండు గంటలపాటు రాష్ట్రంలో మద్యం దుకాణాలు తెరుస్తారనే ఊహాగానాలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ ప్రచారాన్ని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కొట్టిపారేసింది. మద్యం దుకాణాల మూసివేతపై గత నెల 31 వరకు ప్రకటించిన గడువు ముగిసిన రోజే, ఈనెల 14 వరకు మళ్లీ మూసివేత ఉత్తర్వులు జారీ చేశాయి. అయితే, వ్యసనపరుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కేరళ రాష్ట్రం తరహాలో డాక్టర్లు సూచిస్తే లిక్కర్ ఇచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయనే ప్రచారం ఇంకా జరుగుతోంది. దీంతో మందుబాబులు మళ్లీ లిక్కర్‌పై ఆశలు పెట్టుకుంటున్నారు. దీన్ని ఎక్సైజ్ యంత్రాంగం కొట్టిపారేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈనెల 14 వరకు రాష్ట్రంలోని మద్యం దుకాణాలు తెరచుకునే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నాయి. ఈనెల 14 తర్వాతే అప్పటి పరిస్థితిని బట్టి రాష్ట్రంలో మద్యం దుకాణాలు తెరవాలా వద్దా అనే నిర్ణయాన్ని సీఎం కేసీఆర్ తీసుకుంటారని తెలుస్తోంది. దీంతో ఇక మందుబాబులు ఈ నెల 14 వరకు నోరు కట్టేసుకోవాల్సిందే.

# సరుకులు లేవు.. సరఫరా చాలదు

▶ మొదటి పేజీ తరువాయి

ఇడ్లీ రవ్వలతో పాటు, టీ, కాఫీ పొడి, కారం, చక్కెర, పసుపు, నూనెలు, గోధుమపిండి వంటి సరుకులతో పాటు డిటర్జెంట్లు, హ్యాండ్‌వాష్‌లు, న్యాప్కిన్లు, డైపర్ల సరఫరా తగ్గడంతో వీటికి కొరత ఏర్పడుతోంది.

**డిమాండ్‌కు తగ్గట్లు లేని సరఫరా..**

లాక్‌డౌన్ నేపథ్యంలో వినియోగదారులు పెద్ద ఎత్తున అవసరాలకు మించి కొనుగోళ్లు చేశారు. సాధారణంగా వారానికి సరిపడా సరుకులను కొనుగోలు చేసే అలవాటుకు భిన్నంగా కొందరు ముందుగానే పెద్దమొత్తంలో సరుకులను కొనుగోళ్లు చేశారు. దీంతో అవి నిండుకున్నాయని కిరాణా వర్తకులు తెలిపారు. 'రాష్ట్రానికి మహారాష్ట్ర, కర్ణాటక నుంచి చక్కెర, గుజరాత్ నుంచి ఉప్పు, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుంచి శనగపప్పు, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి కందిపప్పు, రాజస్తాన్ నుంచి పెసరపప్పు, కృష్ణపట్నం, కాకినాడ, చెన్నై ఓడరేవుల నుంచి ముడి వంట నూనెలు వస్తుంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సరుకులు తెచ్చే వాహనాలకు అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్దే ఇబ్బందులు ఎదురౌతున్నాయి. దానికి తోడు ఆయా రాష్ట్రాల్లో కరోనా వైరస్ ఉధృతి తీవ్రంగా ఉండటంతో లారీ డ్రైవర్లు, క్లీనర్లు రవాణాకు ముందుకు రావడం లేదు. కొన్ని సరుకు రవాణా వాహనాలు వస్తున్నా, అవి అనేక చోట్ల చెక్‌పోస్టులు దాటాల్సి రావడంతో ఒక్క రోజులో వచ్చే వాటికి రెండున్నర రోజుల గడువుపడుతోంది'అని బేగంబజార్‌కు చెందిన వర్తకులు తెలిపారు. అదీగాక రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కిరణా దుకాణాలు, సూపర్ మార్కెట్లకు సరుకులు సరఫరా చేసే బేగంబజార్ మార్కెట్‌లో రద్దీని నివారించేందుకు విడతల వారీగా దుకాణాలు తెరుస్తున్నారు. పప్పులు సరఫరా చేసే దుకాణం ఒక రోజు తెరిస్తే, మళ్లీ అది తెరిచే వంతు నాలుగు రోజులకు గానీ రావట్లేదు. దీంతోనూ తగినంత సరుకుల సరఫరా అనుకున్నంత జరగడం లేదని తెలుస్తోంది. ఇక సూపర్‌మార్కెట్ల గోదాముల్లో కొంత నిల్వలు ఉంటున్నా, వాటిని ప్యాకేజింగ్ చేసేందుకు సిబ్బంది రావడం లేదని మరికొందరు వ్యాపారులు చెబుతున్నారు.ప్యాకేజీ పనులకు గతంలో 30, 35 మంది కార్మికులతో చేపట్టే చోట ప్రస్తుతం ఐదుగురికి మించి లేకపోవడంతో స్టాక్‌ను మార్కెట్లకు తీసుకురావడం సైతం ఇబ్బందిగా మారిందని బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ఓ సూపర్ మార్కెట్ మేనేజర్ ఒకరు వెల్లడించారు. దీంతో తమ మార్కెట్‌కు వచ్చే వారు సగం సరుకులే కొనుగోలు చేసి వెళుతున్నారని వెల్లడించారు.

# పోర్టబుల్ వెంటిలేటర్

▶ మొదటి పేజీ తరువాయి

వైద్యులు, రోగుల కుటుంబ సభ్యులకు రక్షణ కల్పిస్తుంది. ఇది లక్ష రూపాయలకే అందుబాటులోకి వస్తుందని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ మూర్తి వెల్లడించారు. ప్రస్తుతం ఏరోబయోసిస్‌కు రోజుకు 50 నుంచి 70 యూనిట్లు తయారు చేసే సామర్థ్యం ఉందన్నారు. వెంటిలేటర్లను పెద్ద ఎత్తున తయారు చేసేందుకు పారిశ్రామిక సంస్థలు, ప్రభుత్వం ముందుకు రావాలని బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ రేణు జాన్ కోరారు. కాగా, రోగి శ్వాస తీసుకునే తీరును రికార్డు చేసి, వైద్యుడికి యాప్ ద్వారా సమాచారం అందజేసే ఫీచర్‌తో పాటు, ఆక్సిజన్ సిలిండర్‌ను కూడా జత చేసి జీవన్‌లైట్‌ను రూపొందించారు. కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, డీఆర్‌డీవో, ఐసీఎంఆర్ తదితర సంస్థల ప్రామాణికాలకు అనుగుణంగా దీన్ని తయారుచేసినట్లు ఏరో బయోసిస్ వెల్లడించింది.

# రైల్వే బుకింగ్‌లు షురూ!

- 16 నుంచి ప్రయాణాల కోసం అడ్వాన్స్ బుకింగ్‌లు
- ఆన్‌లైన్ బుకింగ్‌లకే పరిమితమైన దక్షిణ మధ్య రైల్వే
- దేశీయ విమానాలు నడిపేందుకు సిద్ధమవుతున్న ఎయిర్‌లైన్స్



**సాక్షి, సిటీబ్యూరో:** రైల్వే అడ్వాన్స్ బుకింగ్‌లు తిరిగి మొదలయ్యాయి. లాక్‌డౌన్ కారణంగా గత 10 రోజులుగా నిలిచిపోయిన రిజర్వేషన్ బుకింగ్‌ల కోసం ప్రయాణికులు క్రమంగా ముందుకొస్తున్నారు. ప్రస్తుతం రిజర్వేషన్ కేంద్రాలు మూసి ఉంచడంతో ఐఆర్‌సీటీసీ నుంచి ఆన్‌లైన్ ద్వారా మాత్రమే ప్రయాణికులు తమ రిజర్వేషన్లను బుక్ చేసుకొనే సదుపాయం ఉంది. లాక్‌డౌన్ పొడిగింపు ప్రతిపాదనలు లేవని కేంద్రం ఇటీవల ప్రకటించడంతో పాటు, లాక్‌డౌన్ తర్వాత రాకపోకలు సాగించే వారు తమ టికెట్లను బుక్ చేసుకోవచ్చునని పేర్కొనడంతో గత రెండ్రోజులుగా ప్రయాణికులు రిజర్వేషన్లు బుక్ చేసుకుంటున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వం లాక్‌డౌన్ ఎత్తేస్తే ఏప్రిల్ 16 తర్వాత హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు రైళ్లు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు రైల్వే అన్ని రకాల చర్యలు చేపట్టిందని, రైళ్లను కెమికల్ వాష్ చేయడంతో పాటు, ఎప్పటికప్పుడు శానిటేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. లాక్‌డౌన్ అనంతరం కూడా రైళ్ల నిర్వహణలో పూర్తి జాగ్రత్తలు తీసుకోనున్నట్లు తెలిపారు. కరోనాను అడ్డుకునేందుకు ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌తో గత 10 రోజులుగా ఎక్కడికక్కడ ప్రయాణికుల రాకపోకలు స్తంభించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రయాణికులు అప్పటికప్పుడు తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. అత్యవసర రాకపోకలు సైతం నిలిచిపోయాయి. ఈ నెల 15 నుంచి రైళ్లు పట్టాలెక్కితే ప్రయాణికుల రాకపోకలు తిరిగి మొదలు కావొచ్చు.

**ప్రతిరోజూ 2.5 లక్షల మంది రాకపోకలు**


సాధారణ రోజుల్లో హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, తదితర రైల్వేస్టేషన్ల నుంచి ప్రతిరోజూ 2.5 లక్షల మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. ఒక్క సికింద్రాబాద్ నుంచే ప్రతిరోజూ 1.8 లక్షల మంది ప్రయాణిస్తారు. రోజుకు కనీసం 200 రైళ్లు హైదరాబాద్ నుంచి నడుస్తాయి. లాక్‌డౌన్‌తో ఈ రాకపోకలన్నీ నిలిచిపోయాయి. ఈ నెల 15 నుంచి లాక్‌డౌన్ తొలగించినప్పటికీ రద్దీ అంతగా ఉండకపోవచ్చునని, కరోనా భయం దృష్ట్యా తప్పనిసరిగా వెళ్లాల్సిన వారు. అత్యవసర ప్రయాణికులు మాత్రమే బయలుదేరొచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. 'ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం లాక్‌డౌన్ తొలగించిన వెంటనే రైళ్లు అందుబాటులోకి వస్తాయి. కానీ ఈ లోపు ఏవైనా అనుకోని సంఘటనలు చోటుచేసుకొని లాక్‌డౌన్ కొనసాగించే పరిస్థితులు తిరిగి ఉత్పన్నమైతే ఇప్పటివరకు రిజర్వేషన్లు బుక్ చేసుకున్న వారు మరోసారి రద్దు చేసుకునేందుకు కూడా సిద్ధంగా ఉండాల్సిరావచ్చు'అని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు.

## ఎయిర్‌లైన్స్ బుకింగ్‌లు ఓపెన్..

**లా**క్‌డౌన్ తొలగించిన అనంతరం దేశీయ విమానాల రాకపోకలు కూడా మొదలుకానున్నాయి. ఈ మేరకు ఇప్పటికే పలు ఎయిర్‌లైన్స్ సంస్థలు బుకింగ్‌లను ఓపెన్ చేశాయి. మరోవైపు దేశీయ విమానాల రాకపోకల కోసం శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా సిద్ధమవుతోంది. ఎయిర్‌పోర్టును పూర్తిగా కెమికల్ వాష్ చేస్తున్నారు. అన్ని విభాగాల్లోనూ శానిటేషన్ ప్రక్రియ చేపట్టారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రతిరోజూ 60 వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుండగా వీరిలో సుమారు 50 వేల మంది దేశీయ ప్రయాణికులే ఉంటాయి. పలు ఎయిర్‌లైన్స్ సంస్థలు బుకింగ్‌లు ప్రారంభించినప్పటికీ ప్రయాణికుల రద్దీ వెంటనే కనిపించకపోవచ్చునని, అందుకు కొంత సమయం పట్టవచ్చునని ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి.

# 'పరీక్ష' సమయం

▶ మొదటి పేజీ తరువాయి



తెలిపారు. 'నా దృష్టిలో నిర్ధారణైన కేసుల కంటే ఎక్కువగానే జన సమూహంలో ఉన్నాయి. అయితే వనరులు లేక తగినంత మందిని పరీక్షించడం లేద'ని ఓ అధికారి చెప్పారు. కాగా, రాష్ట్రంలో వైద్య సిబ్బందికి అవసరమైన 2 లక్షల మాస్కులను దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ నిర్ణయించింది.

**పరీక్షలకు ముందుకురాని బాధితులు**

ఢిల్లీ వెళ్లొచ్చిన వారు, వారి బంధువులకు పెద్దఎత్తున వైరస్ వ్యాపిస్తున్న సంగతి తెలిసిందే. వారిలో ఇప్పటికే కొందరిని గుర్తించారు. కొన్నిచోట్ల ఢిల్లీ నుంచి వచ్చిన వారితో కాంటాక్ట్ అయినవారిని గుర్తించి వారిని పరీక్షలకు తీసుకురావడానికి వెళ్తున్న వైద్య సిబ్బందిని చాలాచోట్ల వారి కుటుంబసభ్యులు అడ్డుకుంటున్నారు. తమకేమీ సోకలేదని, అటువంటి లక్షణాలు లేవంటూ గొడవకు దిగుతున్నారు. దీంతో హైదరాబాద్ సహా కొన్ని జిల్లాల్లో వైద్య సిబ్బంది, బాధితుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. వీరిని తీసుకురాకపోతే పరిస్థితి చేయిదాటిపోతుందని వైద్యాధికారులు అంటున్నారు. ఢిల్లీ వెళ్లిన వారిలో అన్ని జిల్లాలకు చెందిన వారుండటం, వివిధ జిల్లాల్లో కేసుల సంఖ్య పెరుగుతుండటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం నమోదవుతున్న పాజిటివ్ కేసులన్నీ ఢిల్లీ లింక్ ఉన్నవే కావటం గమనార్హం.

## రెండు దశల్లో పరీక్షలు

- వేలాది మందికి కరోనా పరీక్షలు నిర్వహించడం కష్టమైన వ్యవహారం. కాబట్టి రెండు స్థాయిల్లో పరీక్షలు నిర్వహిస్తారు.
- మొదట అనుమానం ఉన్న వారి రక్త నమూనాలను సేకరించి సెరోలాజికల్ పరీక్ష చేస్తారు. ఆ వ్యక్తి కరోనా వైరస్‌కు ప్రభావితమయ్యాడా లేదా అనేది నిర్ధారిస్తారు. అంటే, ఆ వ్యక్తి రోగనిరోధక శక్తి వైరస్‌కు ప్రభావితమైందో, లేదో ఈ పరీక్ష తెలియజేస్తుంది. ఇది మొదటి దశ పరీక్ష. ఇందులో నెగెటివ్ వస్తే సదరు వ్యక్తికి రోగ లక్షణాలు లేనట్టేనని గుర్తిస్తారు.
- ఒకవేళ పై పరీక్షలో పాజిటివ్ వస్తే, అప్పుడు గొంతులోంచి స్వాబ్ నమూనాలను తీసుకొని రియల్ టైం పాలిమరేస్ చైన్ రియాక్షన్ (ఆర్‌టీ–పీసీఆర్) పరీక్ష నిర్వహిస్తారు. పాజిటివ్ వస్తే, ఆ వ్యక్తికి కరోనా వచ్చినట్లు నిర్ధారించి చికిత్సకు తరలిస్తారు. వాస్తవంగా గొంతులో నుంచి తీసిన స్వాబ్ నమూనాల ద్వారానే కరోనా నిర్ధారణ పరీక్ష చేస్తారు.
- ఇలా పై రెండు విధాలుగా పరీక్షలు నిర్వహించాలని ఐసీఎంఆర్ సూచించింది. ఈ పరీక్షలకు సంబంధించిన ఐసీఎంఆర్ నేడో రేపో మార్గదర్శకాలు జారీ చేయనుంది. మొదటి దశ పరీక్ష అరగంటలోనే ఫలితాలను వెల్లడిస్తుంది. వేగవంతమైన ఈ పరీక్ష కేవలం వ్యక్తి యొక్క రోగనిరోధక వ్యవస్థ వైరస్‌కు గురైందో లేదో చూపిస్తుంది.

# గతేడాది మార్చి బిల్లునే చెల్లించండి

**సాక్షి, హైదరాబాద్:** కరోనా నేపథ్యంలో ఇంటింటికీ వెళ్లి మీటర్ రీడింగ్ తీసి విద్యుత్ బిల్లుల డిమాండ్ నోటీసులు జారీ చేయడానికి బదులు ప్రత్యామ్నాయ విధానాన్ని అనుసరించాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు నిర్ణయం తీసుకున్నాయి. 2019 మార్చిలో జరిపిన వినియోగానికి సంబంధించి చెల్లించిన విద్యుత్ బిల్లులనే 2020 మార్చిలో జరిపి న వినియోగానికి సైతం చెల్లించాలని వినియోగదారులను కోరనున్నాయి. కొత్త వినియోగదారులైతే ఫిబ్రవరి 2020 నెలకు సంబంధించి చెల్లించిన బిల్లు మొత్తాన్నే మార్చి నెల వినియోగానికి సైతం చెల్లించాలని కోరనున్నాయి. దీనికి సంబంధించిన అనుమతుల కోసం శుక్రవారం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి ప్రతిపాదనలు సమర్పించాయి. లాక్‌డౌన్ ఎత్తివేసిన తర్వాత మీటర్ రీడింగ్ తీసి వినియోగదారులు చెల్లించిన బిల్లులను సర్దుబాటు చేస్తామని ఈఆర్సీకి తెలిపాయి. వినియోగంతో పోల్చితే ఎవరైనా అధికంగా బిల్లులు చెల్లిస్తే.. తర్వాత మీటర్ రీడింగ్ తీసినప్పుడు వారికి సంబంధించిన తదుపరి నెల బిల్లును ఆ మేరకు తగ్గించి సర్దుబాటు చేస్తారు. ఇదే తరహాలో అధిక వినియోగం ఉండి తక్కువ బిల్లులు చెల్లించిన వారి నుంచి తదుపరి నెల బిల్లులో ఆ మేరకు మిగిలిన మొత్తాన్ని అదనంగా వసూలు చేస్తామని ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదనలను పరిశీలించి శనివారం ఈఆర్సీ ఉత్తర్వులు జారీ చేసే అవకాశముంది.

- కరోనా నేపథ్యంలో ఈ నెలలో మీటర్ రీడింగ్ ఉండదు
- ఈఆర్సీకి డిస్కంల ప్రతిపాదనలు.. నేడు రానున్న నిర్ణయం

## 'న్యాయవాదులు విరాళాలివ్వాలి'

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ కట్టడి కోసం న్యాయవాదులంతా సహకరించాలని రాష్ట్ర బార్‌కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి కోరారు. హైకోర్టు, జిల్లా బార్ అసోసియేషన్లు విరివిగా విరాళాలు ఇవ్వాలన్నారు. ఈ విరాళాల కోసం బార్ కౌన్సిల్ ప్రత్యేక ఖాతాను ప్రారంభిస్తుందన్నారు. విరాళాల రూపంలో వచ్చిన సొమ్మును ప్రధాన మంత్రి సహాయ నిధికి పంపుతామన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న జూనియర్ న్యాయవాదులకు సాయం అందించాలని కూడా బార్ కౌన్సిల్ తీర్మానించినట్లు తెలిపారు. ఈ విధంగా సాయం అందించేందుకు అడ్డంకిగా ఉన్న బార్ కౌన్సిల్ చట్టంలోని 92వ నిబంధనను సవరించాలని తాము చేసిన విజ్ఞప్తిని బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా అంగీకరించిందన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు సగం జీతమే..

### లాక్‌డౌన్‌తో కష్టంగా మారిన జీతాల చెల్లింపు

**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్ నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు మార్చి నెల జీతం సగమే అందనుంది. రెండు వారాలుగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ఆదాయం ఆగిపోయింది. ఫలితంగా జీతాల చెల్లింపు కష్టతరమైంది. వైద్య సిబ్బంది, పోలీసు శాఖలు మినహా మిగతా అన్ని శాఖల ఉద్యోగుల జీతాల్లో కోత విధించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు కూడా ఈ నెల సగం జీతమే చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించింది. మిగతా సగం చెల్లించేందుకు కూడా నిధులు లేకపోవడంతో వాటిని సమకూర్చేందుకు అధికారులు నానా పాట్లు పడుతున్నారు. మార్చి నెల తొలి రెండు వారాలకు సంబంధించిన టికెట్ వసూళ్లలో కొంత మొత్తం అందుబాటులో ఉంది. అధికారులు ఏదో ఒక రూపంగా జీతాలు సర్దుబాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, ఉద్యోగులకు మొత్తం జీతం చెల్లించాలని కార్మిక సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

## డీఈఈసెట్ దరఖాస్తుల గడువు పెంపు

**సాక్షి, హైదరాబాద్:** డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్), డిప్లొమా ఇన్ ప్రీ–స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న డీఈఈసెట్–2020 దరఖాస్తుల గడువును 27 వరకు పొడిగించినట్లు డీఈఈసెట్ కన్వీనర్ కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలను www.deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

## దండోరాతో అవగాహన: మంద కృష్ణ

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు మాదిగల ఆయుధమైన దండోరాను వాయించి అవగాహన కల్పించాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 5న రాత్రి 9 గంటలకు ప్రజలంతా కొవ్వొత్తులు వెలిగించి తమ సంకల్ప బలాన్ని చాటాలని శుక్రవారం మంద కృష్ణ ఓ ప్రకటన విడుదల చేశారు.

## ఖైదీల విడుదలపై 'హైపవర్' భేటీ

**సాక్షి, హైదరాబాద్:** అధిక ఒత్తిడి ఉన్న జైళ్లలో ఖైదీలను విడుదల చేసే అంశాన్ని పరిశీలించాలన్న సుప్రీం ఆదేశాల మేరకు రాష్ట్రంలో హైపవర్ కమిటీ భేటీ అయింది. జస్టిస్ ఎం.రామచంద్రరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జైళ్లశాఖ డీజీ, న్యాయశాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. శుక్రవారం సమావేశమైన కమిటీ రాష్ట్రంలోని వివిధ జైళ్లలో ఉన్న ఖైదీల విడుదల అంశంపై సమీక్షించింది.

## జీహెచ్‌ఎంసీ ద్వారా విరాళాలివ్వండి

### దాతలకు పురపాలక శాఖ సూచన

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా లాక్ డౌన్ ప్రకటించిన నేపథ్యంలో దాతలు పేద ప్రజలకు విరాళాలు, ఆహారం ఇవ్వదలుచుకుంటే జీహెచ్‌ఎంసీని సంప్రదించాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లా మణికొండలో ఒక ప్రైవేటు వ్యక్తి చేపట్టిన వితరణ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో గుమికూడటంతో భౌతిక దూరం నిబంధనను ఉల్లంఘించినట్టు అయిందన్నారు. దాతలు తమ విరాళాలను నగదు/వస్తు రూపంలో ఇస్తే వాటిని అవసరమైన వారికి, నిరాశ్రయులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలను జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు నోడల్ అధికారిని నియమించుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లను ఆదేశించారు.

## మహానేతల జయంతి వేడుకలు రద్దు

**సాక్షి, హైదరాబాద్:** ఇద్దరు మహా నేతల జయంతి వేడుకలకు బ్రేక్ పడింది. ఈనెల 5న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి, 14న డాక్ట ర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉన్నాయి. ఏటా వీరి జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది. కానీ ఈ ఏడాది ఇరువురి జయంతి వేడుకలను ప్రభుత్వం రద్దు చేసింది. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్ ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈనేపథ్యంలో రెండు వేడుకలను రద్దు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.




# డీఆర్‌డీవో శానిటైజర్లు

## స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్‌పై యుద్ధంలో డీఆర్‌డీవో మరో ముందడుగు వేసింది. వేర్వేరు ఉపరితలాల నుంచి వైరస్‌లను తొలగించేందుకు పూర్తి స్వదేశీ టెక్నాలజీతో శానిటైజింగ్ యంత్రాలను అభివృద్ధి చేసింది. ఢిల్లీలోని డీఆర్‌డీవో సంస్థ 'ద సెంటర్ ఫర్ ఫైర్ ఎక్స్‌ప్లోజివ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సేఫ్టీ (సీఎఫ్‌ఈఈఎస్)'అభివృద్ధి చేసిన ఈ యంత్రాల్లో ఒకటి అవసరమైన చోటుకు మోసుకెళ్లేది కాగా, రెండోది చక్రాలపై ఉంచి తరలించగలిగేది. మంటలు ఆర్పేందుకు పనికొచ్చే యంత్రాలను రీడిజైనింగ్ చేయడం ద్వారా తాము ఈ శానిటైజింగ్ యంత్రాలను అభివృద్ధి చేసినట్లు డీఆర్‌డీవో ఒక ప్రకటనలో తెలిపింది. పోర్టబుల్ యంత్రం ద్వారా ఒక శాతం హైపోక్లోరైట్ ద్రావణాన్ని చల్లవచ్చని, బ్యాక్‌ప్యాక్ ద్వారా తీసుకెళ్లగలమని వివరించింది. గాలితోపాటు ద్రావణాన్ని కూడా చేర్చి స్ప్రే చేయడం దీని ప్రత్యేకతని తెలిపింది. ఒక యంత్రం ద్వారా దాదాపు 300 చదరపు మీటర్ల విస్తీర్ణంలో శానిటైజేషన్ చేపట్టవచ్చని పేర్కొంది. చక్రాలపై ఉంచి తరలించగల రెండో యంత్రంలో హైపోక్లోరైట్ ద్రావణాన్ని మాత్రమే పొగమంచు మాదిరిగా మార్చి పిచికారీ చేసేందుకు ఏర్పాట్లు ఉంటాయని తెలిపింది. ఒక్కోటి 3,000 చదరపు మీటర్ల విస్తీర్ణాన్నిశుభ్రం చేయగలదని వివరించింది. 50 లీటర్ల ద్రావణాన్ని నింపుకోగల ట్యాంకు ఇందులో ఉంటుందని.. 12నుంచి 15 మీటర్ల దూరం వరకూ పిచికారీ చేయవచ్చని తెలిపింది. ఢిల్లీ పోలీసులకు ఇప్పటికే ఈ యంత్రాలను అందుబాటులోకి తెచ్చామని పేర్కొంది.

# 92 శాతం మందిని గుర్తించాం

## ఉపరాష్ట్రపతితో గవర్నర్ తమిళిసై



**సాక్షి, హైదరాబాద్:** మర్కజ్‌కు వెళ్లి రాష్ట్రానికి తిరిగివచ్చిన 1,000 మందిలో 925 మంది (92శాతం)ని గుర్తించామని, వీరిలో 79 మందికి కరోనా పాజిటివ్ తేలిందని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 9 మంది ఈ వైరస్ కారణంగా చనిపోయారన్నారు. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లతో ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఢిల్లీ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె రాష్ట్రంలోని పరిస్థితులను వివరించారు. ఢిల్లీ నుంచి వచ్చిన వారిలో 435 మందిని హోం క్వారంటైన్ చేయగా, 365 మంది ప్రభుత్వ క్వారంటైన్ కేంద్రాల్లో ఉన్నారన్నారని తెలిపారు. ఇక రాష్ట్రంలో కరోనాకు వ్యతిరేకంగా ముందుండి పోరాడుతున్న వైద్యులను వ్యక్తిగతంగా అభినందిస్తూ గవర్నర్ లేఖలు పంపించారు. తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కరోనాతో యుద్ధం చేస్తున్నారని వారి సేవలను కొనియాడారు.

# ఒక చుక్క టీకాతో కరోనాకు చెక్!

## 'కోరోఫ్లూ' అభివృద్ధికి భారత్ బయోటెక్ ప్రయత్నాలు



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్‌ను నివారించేందుకు భారత్ బయోటెక్ కంపెనీ ఓ వినూత్నమైన టీకాను అభివృద్ధి చేస్తోంది. ముక్కు ద్వారా ఒక చుక్క మందు వేసుకోవడం ద్వారా పనిచేసే ఈ టీకాపై మొదటి, రెండో దశ మానవ ప్రయోగాలు కూడా పూర్తయినట్లు భారత్ బయోటెక్ ఓ ప్రకటనలో తెలిపింది. కోరోఫ్లూ అని పిలుస్తున్న ఈ టీకాను తాము విస్కాన్సిన్ మాడిసన్ యూనివర్సిటీ, ఫ్లూజెన్ అనే వ్యాక్సిన్ కంపెనీలతో కలసి అభివృద్ధి చేస్తున్నామంది. ఫ్లూజెన్ కంపెనీ ఎం2ఎస్ఆర్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఆధారంగా కోరోఫ్లూ తయారైందని వెల్లడించారు. ఈ టీకా రోగ నిరోధక వ్యవస్థలో స్పందన కలుగచేస్తుందని చెప్పారు. కరోనా వ్యాధి కారక వైరస్ జన్యు పదార్థాన్ని ఎం2ఎస్ఆర్‌లోకి జొప్పించి కొత్త వ్యాక్సిన్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. భారత్ బయోటెక్ ఈ టీకాను అభివృద్ధి చేయడం, క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం వంటి అన్ని బాధ్యతలు చేపడుతుందని, దాంతోపాటు ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేసేందుకు వీలుగా 30 కోట్ల టీకాలను సిద్ధం చేస్తామని డాక్టర్ రాచెస్ ఎల్లా తెలిపారు. ఫ్లూజెన్ తయారీ పద్ధతులతో భారత్ బయోటెక్‌లో టీకాలు సిద్ధం చేస్తామన్నారు.

**ఆరు నెలలు పరీక్షలు..**

కోరోఫ్లూ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడంతో పాటు జంతువులపై పరీక్షలు జరిపేందుకు యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ మాడిసన్‌లో మూడు నుంచి ఆరు నెలల సమయం పడుతుందని, ఆ తర్వాత భారత్ బయోటెక్ హైదరాబాద్ కేంద్రం మనుషుల్లో టీకా సామర్థ్యం, భద్రతలపై పరీక్షలు మొదలుపెడుతుందని డాక్టర్ రాచెస్ ఎల్లా తెలిపారు. ఈ ఏడాది చివరి వరకు కోరోఫ్లూ క్లినికల్ ట్రయల్స్ జరగనున్నాయి. ఎం2ఎస్ఆర్‌పై ఇప్పటికే నాలుగు ఫేస్–1, ఫేస్–2 క్లినికల్ ట్రయల్స్ పూర్తయ్యాయని, వందలాది మందిపై జరిగిన ఈ ప్రయోగాల ద్వారా టీకా సురక్షితమేనని స్పష్టమైందని చెప్పారు. కోరోఫ్లూ జలుబు కారక వైరస్ యాంటీజెన్‌లను కూడా ఉత్పత్తి చేస్తుందని ఫలితంగా ఈ టీకా ద్వారా అటు కరోనా వైరస్‌కు, ఇటు ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌కు ప్రతిగా రోగ నిరోధక వ్యవస్థ పనిచేస్తుందని ఫ్లూజెన్ సహ వ్యవస్థాపకుడైన గాబ్రియెల్ న్యూమన్ తెలిపారు. ముక్కు ద్వారా కోరోఫ్లూను అందించడం వల్ల కరోనా, ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లు సహజసిద్ధంగా శరీరంలోకి ప్రవేశించే దారిలోనే మందు అందుబాటులోకి వస్తుందని ఫలితంగా రోగ నిరోధక వ్యవస్థ పలు రకాలుగా స్పందిస్తుందని వివరించారు.

## పశుసంవర్ధక శాఖ సెక్షన్ అధికారిపై సస్పెన్షన్ వేటు?

### మర్కజ్‌కు వెళ్లిన విషయాన్ని దాచి సచివాలయంలో విధులు

**సాక్షి, హైదరాబాద్:** ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లిన విషయాన్ని దాచి సచివాలయంలో విధులకు హాజరయ్యారన్న ఆరోపణలపై పశుసంవర్ధక శాఖ సెక్షన్ అధికారి ఆయూబ్‌ఖాన్‌ను సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ఆ శాఖ ప్రతిపాదనలు పంపించినట్టు సమాచారం. త్వరలో ఉత్తర్వులు జారీ చేసే అవకాశముంది. ఆయూబ్‌ఖాన్‌ను ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించగా, కరోనా లేదని తేలింది. ప్రస్తుతం ఆయన నిబంధనల ప్రకారం 14 రోజుల క్వారంటైన్‌లో ఉన్నారు.

# కరోనా అలర్ట్ @ 'ఆరోగ్యసేతు'

- ప్రజల్లో అవగాహనకు కేంద్రం కొత్త యాప్
- కరోనాపై రోజూ అప్‌డేట్స్, సలహా సూచనలు
- ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు అందుబాటులోకి

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్‌పై ఇప్పటికే లాక్‌డౌన్ యుద్ధం ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా డిజిటల్ వార్‌కు దిగింది. వైరస్ వ్యాప్తి కట్టడికి తీసుకోవల్సిన జాగ్రత్తలు, దేశవ్యాప్తంగా బాధితుల సంఖ్య, అప్‌డేట్స్‌ను ప్రజలకు అందించేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ 'ఆరోగ్యసేతు'యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. రెండ్రోజుల క్రితం నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ద్వారా ఈ యాప్ వినియోగంలోకి వచ్చింది.

**ఇలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి..**

రోజురోజుకూ విస్తరిస్తున్న కరోనా వైరస్ విరుగుడుకు ఇంకా మందు రాలేదు. అవగాహనతోనే దీనిని ఎదుర్కోగలమని చెబుతోన్న ప్రభుత్వం.. ఆ దిశగా ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రత్యేకంగా ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.




- ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ప్లేస్టోర్‌లోకి వెళ్లి 'ఆరోగ్య సేతు 'పేరు నమోదు చేసిన వెంటనే యాప్ కనిపిస్తుంది. సూచనల ఆధారంగా ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత ఓపెన్ చేయాలి.
- జీపీఎస్ ఆధారంగా లొకేషన్ ఎంపిక చేసుకున్నాక మొబైల్ నంబర్ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- ప్రస్తుతం 11 భాషల్లో యాప్ అందుబాటులో ఉంది. జీపీఎస్, బ్లూటూత్ నిరంతరం ఆన్‌లో ఉండాలి. అప్పుడే ఈ యాప్ కరోనా సమాచారం, స్థానిక వివరాలు అందిస్తుంది.

**అప్రమత్తం చేస్తుందిలా..**

- యాప్‌ను ఇప్పటివరకు 10లక్షల మందికిపైగా ఇన్‌స్టాల్ చేసుకున్నారు. యూజర్లు 4.6 పాయింట్ల రేటింగ్ ఇచ్చారు. 13,330 మంది సానుకూలమైన రివ్యూలు రాశారు.
- ఈ యాప్ కరోనా బారిన పడ్డవారెవరైనా మీ సమీపంలోకి వస్తే వెంటనే అప్రమత్తం చేస్తుంది.
- కరోనా వైరస్ దుష్ప్రభావాలను ఎలా గుర్తించాలో అవగాహన కల్పిస్తూనే సెల్ఫ్ ఐసోలేషన్ ఎలా పాటించాలో సూచిస్తుంది.

# అత్యవసరాల తరలింపునకు రైల్వే పార్సిల్ వ్యాన్లు

## సికింద్రాబాద్ నుంచి 92 టన్నులతో తొలి రైలు హౌరాకు పయనం



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్నందున అత్యవసర మందులు, పండ్లు, ఇతర వస్తువులకు పలు ప్రాంతాల్లో కొరత ఏర్పడింది. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతుండటంతో రైల్వే శాఖను కేంద్రం అప్రమత్తం చేసింది. ప్రత్యేకంగా పార్సిల్ వ్యాన్లను వెంటనే పట్టాలెక్కించాలని ఆదేశించింది. ఈమేరకు సికింద్రాబాద్ నుంచి హౌరాకు తొలి పార్సిల్ రైలు బయలుదేరింది. ఇందులో 92 టన్నుల సామగ్రిని తీసుకెళ్లారు. పుచ్చకాయలు, మామిడిపండ్లు, నిమ్మకాయలు, మందులు, వైద్య పరికరాలు, ఇతర యంత్రాల విడిభాగాలు, కోడిగుడ్లు, చాక్లెట్లు, బిస్కెట్లు, చేపలు, నెయ్యి తదితరాలున్నాయి. మొత్తం 3,005 డబ్బాల్లో వీటిని తరలించారు. సాధారణంగా పార్సిల్ వ్యాన్ గంటకు 30 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయి. ప్రస్తుతం సరుకు తొందరగా డెలివరీ కావాల్సిన పరిస్థితి ఉండటం, ట్రాక్‌పై ఇతర రైళ్లు నడవటం లేనందున ఈ రైలును గంటకు 55 కి.మీ. వేగంతో నడపటం విశేషం. దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లో చాలా వస్తువులకు కొరత ఉన్న నేపథ్యం లో మరిన్ని పార్సిల్ వ్యాన్లను నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ రాకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు వ్యాపారులతో మాట్లాడి ఏర్పా ట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. సరుకును తరలించే ముందు వ్యాన్లను శుభ్రం చేశారు. ఈ పనుల్లో నిమగ్నమైన సిబ్బం ది భౌతిక దూరాన్ని పాటించటమే కాకుం డా, వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకునేలా చూశామని రాకేశ్ పేర్కొన్నారు.

**శానిటైజర్, మాస్కుల తయారీ**

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో తన సిబ్బందికి శానిటైజర్లు, మాస్కులను రైల్వేశాఖ అందుబాటులో ఉంచుతోంది. ప్రస్తుతం లాక్‌డౌన్ నేపథ్యంలో ఎక్కడి రైళ్లు అక్కడే ఆగిపోయినా, అత్యవసర పనుల కోసం కొంతమంది సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. వారందరికీ శానిటైజర్లు, మాస్కులను అందిస్తున్నారు. వాటిని ఎక్కడి నుంచో కొనుగోలు చేయకుండా సొంతంగానే తయారు చేసుకోవటంపై రైల్వే దృష్టి సారించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 17,800 మాస్కులు, 2,672 లీటర్ల శానిటైజర్‌ను సిబ్బంది తయారు చేశారు. వాటిని అన్ని డివిజన్లలో అత్యవసర విధుల్లో ఉన్న సిబ్బందికి అందజేశారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్, నాందెడ్ డివిజన్లతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న రైల్వే వర్క్‌షాపుల్లో తయారు చేశారు. వీటితో పాటు అన్ని ప్రాంతాల్లో సిబ్బంది ఎప్పటికప్పుడు చేతులు కడుక్కునేందుకు సబ్బులు, కావాల్సినన్ని నీళ్లు అందుబాటులో ఉంచారు. వారు విధిగా భౌతిక దూరాన్ని పాటించాలని అధికారులు ఆదేశించారు.

## 'గ్రిడ్'కు ఢోకా లేదు!

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్‌పై పోరులో భాగంగా ఆదివారం రాత్రి 9 గంటలకు 9 నిమిషాల పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ లైట్లను బంద్ చేసి టార్చ్‌లైట్లు, మొబైల్ లైట్లు, కొవ్వొత్తులు, దివ్వెలను వెలిగించి దేశ ప్రజలు ఐక్యత చాటాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో.. విద్యుత్ సరఫరాపరంగా ఏర్పడనున్న ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కోవడానికి రాష్ట్ర విద్యుత్ సంస్థలు సిద్ధమవుతున్నాయి. ప్రధాని పిలుపు మేరకు అందరూ లైట్లు బంద్‌చేస్తే.. ఒక్కసారిగా విద్యుత్ డిమాండ్ తగ్గిపోయి 9 నిమిషాల తర్వాత మళ్లీ పుంజుకునే అవకాశాలుండడంతో గ్రిడ్ భద్రతపై దేశవ్యాప్తంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే రాష్ట్రంలో ఒక్కసారిగా లైట్లన్నీ బంద్ చేస్తే గ్రిడ్ భద్రతకు ఎలాంటి ముప్పు ఉండబోదని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు 'సాక్షి'కి తెలిపారు.

# 3 నెలలు.. రూ.9 వేల కోట్లు

- ఆరు దఫాలుగా 3 నెలల పాటు బాండ్లు, సెక్యూరిటీల వేలం
- రూ.9 వేల కోట్లు సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

**సాక్షి, హైదరాబాద్:** ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బాండ్లు, సెక్యూరిటీల వేలం ద్వారా రూ.9వేల కోట్లు సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు మన రాష్ట్రం వేలంలో పాల్గొనే షెడ్యూల్‌ను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఈనెల 13 నుంచి జూన్ 30 వరకు 6 దఫాల్లో ప్రభుత్వం ఈ నిధులను సమకూర్చుకోనుంది. కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ అమల్లో ఉన్నందున రాష్ట్ర సొంత రాబడులు తగ్గిపోయిన పరిస్థితుల్లో ఆర్‌బీఐ నిర్వహించే వేలం ద్వారా సమకూరనున్న ఈ నిధులతోనే నెట్టుకురావాల్సి ఉంటుందని ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి.

**రాష్ట్రాల వారీ షెడ్యూల్**

ఆర్‌బీఐ నిర్వహించే బాండ్లు, సెక్యూరిటీల వేలం ద్వారా దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలు నిధులు సమకూర్చుకోనున్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కలిపి రూ.1,27,205 కోట్ల మేర మార్కెట్ అప్పులు సమకూర్చుకుంటాయని ఆర్‌బీఐ అంచనా వేసింది. ఈనెల ఏడో తేదీ నుంచి వేలం షెడ్యూల్ ప్రారంభంకానుంది. ఈ షెడ్యూల్‌లో రాష్ట్రాలకు దఫాల వారీగా ఆర్‌బీఐ అవకాశం కల్పించింది.

**మన రాష్ట్రం వేలం షెడ్యూల్.. సమకూర్చుకునే నిధులు**

| | |
|---|---|
| ఏప్రిల్ 13 | రూ.2,000 కోట్లు |
| ఏప్రిల్ 28 | రూ.1,000 కోట్లు |
| మే 12 | రూ.2,000 కోట్లు |
| మే 26 | రూ.1,000 కోట్లు |
| జూన్ 9 | రూ.2,000 కోట్లు |
| జూన్ 30 | రూ.1,000 కోట్లు |

**వేజ్ అండ్ మీన్స్‌కూ అవకాశం**

ద్రవ్య జవాబుదారీ, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) చట్టం ప్రకారం ఓవర్‌డ్రాఫ్ట్, వేజ్ అండ్ మీన్స్‌కు వెళ్లి అప్పులు తెచ్చుకోవడం అంత సులువు కాదు. ఆర్థిక సంవత్సరంలో పరిమిత శాతంలో పరిమిత సంఖ్యలో మాత్రమే ఇలా నిధులు సమకూర్చుకునే వీలుంటుంది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకుని అన్ని రాష్ట్రాలు వేజ్ అండ్ మీన్స్ కింద తీసుకునే అడ్వాన్సులను 30 శాతానికి పెంచుతూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ఈ వెసులుబాటు ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు వర్తించనుంది. వాస్తవానికి, దీనిపై ఆర్‌బీఐ చైర్మన్ సుధీర్ శ్రీవాస్తవ నేతృత్వంలో ఏర్పాటుచేసిన నిపుణుల కమిటీ ఇంతవరకు ఎలాంటి సిఫారసులు చేయకపోయినా, ప్రస్తుతం కరోనా తదనంతర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆర్‌బీఐ తన అధికారిక వెబ్‌సైట్‌లో వెల్లడించింది.

# గల్ఫ్ ప్రవాసీలకు 'కరోనా' హెల్ప్‌లైన్ల ఏర్పాటు

## ఏపీ, తెలంగాణకు చెందిన 13 లక్షల మందికి ఉపాధి

**సాక్షి, హైదరాబాద్ :** ఉపాధి కోసం దుబాయ్, ఖతార్, సౌదీ అరేబియా తదితర గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన లక్షలాదిమంది భారతీయులు లాక్‌డౌన్ కారణంగా అక్కడే చిక్కుకుపోయారు. అలాంటి వారి బంధువులకు ఏమైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఫిర్యాదు చేసేందుకు విదేశీ వ్యవహారాల శాఖ ఢిల్లీలో హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేసింది. టోల్‌ఫ్రీ నంబరును కూడా అందుబాటులో ఉంచింది.



**కంట్రోల్‌రూమ్ టోల్‌ఫ్రీ నం:** 1800 11 8797, **టెలిఫోన్ నంబర్లు:** 91 11 2301 2113/ 4104/ 7905. **ఈమెయిల్:** covid19@ mea.gov.in ప్రత్యేక సహాయం కావాల్సిన వారు విదేశాంగశాఖ సంయుక్త కార్యదర్శి (గల్ఫ్ వ్యవహారాలు) డా.టి.వీ నాగేంద్రప్రసాద్ నేతృత్వంలోని అధికారుల బృందం నిరంతరం అందుబాటులో పనిచేస్తోంది. వీరిని సంప్రదించాలనుకున్నవారు. +91 11 4901 8480, +91 92050 66104కు కాల్ చేయవచ్చు.

**మొత్తం 85 లక్షల మంది భారతీయులు..**

గల్ఫ్ దేశాల్లో భారతదేశానికి చెందిన దాదాపు 85 లక్షలమందికిపైగా వివిధ ఉద్యోగాలు చేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే సుమారుగా 13 లక్షలమంది ఉపాధి పొందుతున్నారు. వీరికోసం సౌదీ అరేబియాకు చెందిన భారత రాయబార కార్యాలయంలో +9714 3971 222 / 333 సంప్రదించవచ్చు.

**అబుధాబీలోని భారత రాయబార కార్యాలయం నంబరు:** +971 2 4492700 ఫోన్ చేయవచ్చు, అలాగే యూఏఈ ప్రభుత్వ హెల్ప్‌లైన్ నెంబర్లు 9712 4965228, +97192083344ను ఆశ్రయించవచ్చు.

**వదంతులు నమ్మవద్దు..**

కరోనా సందర్భంగా గల్ఫ్‌లో ఏర్పడ్డ అనిశ్చితి కారణంగా దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానాలు నడుపుతామని కొందరు విమాన టికెట్ల కోసం డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు పరికిపండ్ల స్వదేశ్ వెల్లడించారు. అంతర్జాతీయ సర్వీసుల పునరుద్ధరణ జరిగి, అధికారికంగా విమాన సర్వీసుల పునరుద్ధరణ జరిగే వరకు ఎవరికీ ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని సూచించారు.




శంషాబాద్ కార్గో టెర్మినల్ రన్‌వే వద్ద ఖతార్ ఎయిర్‌లైన్స్ విమానం

# ప్యాసింజర్ విమానంలో అత్యవసరాల తరలింపు

**శంషాబాద్:** డీజీసీఏ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యవసర సమయాల్లో ప్యాసింజర్ విమానాలను కార్గో సేవలకు వినియోగిస్తున్నారు. ఖతార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన క్యూఆర్–8311 విమానం గురువారం రాత్రి 1.30 గంటలకు వైద్య పరికరాలతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కాగా.. తిరుగు ప్రయాణంలో 28 టన్నుల నిత్యావసరాల సరుకులతో శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు బయల్దేరి వెళ్లింది. విపత్కర పరిస్థితుల్లో ప్యాసింజర్ విమానాలను కార్గో సేవలకు ఉపయోగించుకునేలా డీజీసీఏ అనుమతించడం మంచి పరిణామమని విమానాశ్రయ సీఈవో ఎస్‌జీకే కిశోర్ ఓ ప్రకటనలో తెలిపారు.

సాక్షి
శనివారం, ఏప్రిల్, 4

# సేవ చేసేవారిపై దాడులా?

కరోనా మహమ్మారి కాటేయాలని చూస్తున్న వర్తమానంలో వైద్య సిబ్బంది ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లో పనిచేయాల్సివస్తున్నదో తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో వైద్యులపై రెండురోజుల్లో జరిగిన దాడులు వెల్లడించాయి. గడిచిన మూడు రోజులుగా దేశవ్యాప్తంగా కరోనా రోగుల సంఖ్య రెట్టింపయింది. అంతక్రితం రెండురోజుల పరిస్థితితో బేరీజు వేస్తే ఒక్కసారిగా ఇలా పెరగడం ఆందోళన కలిగిస్తుంది. కొత్తగా వెల్లడైన రోగుల్లో ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌కు వెళ్లొచ్చినవారే అధికం. వారిలో అనేకమంది ఇంకా వైద్య పర్యవేక్షణలో వున్నారు. అమెరికా తదితర దేశాలతో పోలిస్తే అదృష్టవశాత్తూ మన దేశంలో బాధితుల సంఖ్య, మృతుల సంఖ్య ఇంకా తక్కువే. లాక్‌డౌన్ పటిష్టంగా అమలు కావడం వల్లే ఇది సాధ్యమైంది. ఇన్నాళ్లుగా విదేశాలనుంచి వచ్చిన వారిపైనే ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాయి. వారి కుటుంబసభ్యులను, వారిని కలిసిన ఇతరులను పరీక్షించడంవంటివి చేశాయి. కొత్తగా బయటపడిన నిజాముద్దీన్ మర్కజ్ ఉదంతంతో ఆ సదస్సుకు వెళ్లినవారిని గుర్తించి, తరలించడం మొదలైంది. సింగపూర్, దక్షిణ కొరియాలతో పోలిస్తే కొన్ని అంశాల్లో మనమింకా వెనకబడి వుండటం వల్ల పూర్తి స్థాయిలో నియంత్రించడం సాధ్యపడటంలేదు. పకడ్బందీ నిఘా వుంచడం, గరిష్టంగా పరీక్షలు జరపడం, వైద్యులకు అవసరమైన రక్షణ ఉపకరణాలు అందించడం వగైరాల్లో లోటు కనిపిస్తోంది. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో సేవలందిస్తున్న అయిదారుగురు వైద్యులు ఈ వ్యాధిబారిన పడటం ఇందువల్లే. ఈ నేపథ్యంలోనే వైద్యులకు, ఇతర సిబ్బందికి అవసరమైన ఉపకరణాలు అందించాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే రాగల వారాల్లో పరీక్షలు, రోగుల గుర్తింపు, తరలింపు వంటి అంశాలపై దృష్టిపెట్టాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం పిలుపునిచ్చారు.

ఉన్నకొద్దీ రోగుల సంఖ్య పెరిగే అవకాశం వుండటం వల్ల వైద్యులపై ఒత్తిళ్లు పెరుగుతాయని ఇప్పుడు జరిగిన ఘటనలు తెలియజేస్తున్నాయి. ఇతర రంగాల్లో పనిచేస్తున్నవారితో పోలిస్తే వైద్యులు తమ పని గంటల్ని మించి వుండవలసి వస్తుంది. డ్యూటీ ముగుస్తున్న సమయంలో అనుకోకుండా ప్రాణాపాయ స్థితిలో ఎవరైనా రోగి వస్తే చికిత్స మొదలెట్టక తప్పదు. మన దేశంలో వైద్యుల సంఖ్య చాలా దేశాలతో పోలిస్తే తక్కువ. ప్రస్తుతం సగటున 1,404 మంది పౌరులకు ఒక డాక్టర్ వున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వేయిమందికి ఒక డాక్టర్ వుండాలని సూచించింది. వాస్తవానికి దేశంలో ఇప్పుడున్న 9.61 లక్షలమంది వైద్యుల్లో 52 శాతంమంది మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో వున్నారు. మిగిలిన రాష్ట్రాలన్నిటిలో మిగిలిన 48శాతంమంది వున్నారని గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. గత నెలలో రాజ్యసభలో ఒక ప్రశ్నకు జవాబిస్తూ నమోదైన వైద్యుల్లో రాష్ట్రాల వారీగా మహారాష్ట్ర–15 శాతం, తమిళనాడు–12 శాతం, కర్ణాటక–10శాతం, ఆంధ్రప్రదేశ్–8 శాతం, ఉత్తరప్రదేశ్–7 శాతంమంది వున్నారని మంత్రి వివరించారు. ఢిల్లీ, అస్సాం, ఒడిశాల్లో 2 శాతం, తెలంగాణ, హరియాణా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్‌లలో ఒక శాతం చొప్పున వైద్యులు వున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య కళాశాలలు పెంచకపోవడం వల్ల, ఉన్నతశ్రేణి ఆస్పత్రుల్ని నెలకొల్పకపోవడం వల్ల ఈ పరిస్థితి వుంది. అందువల్లే రోగుల సంఖ్య పెరగకుండా చూడటం ఇప్పుడు ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యంగా మారింది. ఇందులో భాగంగానే దేశంలో చాలాచోట్ల అనుమానితుల్ని గుర్తించి, తరలించడానికి వైద్యులు, ఇతర సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. హైదరాబాద్‌లో కరోనా రోగి చనిపోయినందుకు ఆగ్రహించి అతని బంధువులు దాడి చేశారు. ఇతరత్రా వ్యాధులుండి, ఈ కరోనా బారినపడే వృద్ధులకు మిగిలినవారితో పోలిస్తే ప్రమాదం ఎక్కువని వివిధ మాధ్యమాల ద్వారా వైద్య నిపుణులు హెచ్చరిస్తూనే వున్నారు. కానీ కొందరిలో మూర్ఖత్వం ఇంకా పోలేదని ఈ ఉదంతం చాటుతోంది. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో అదే రోజు కరోనా రోగితో సన్నిహితంగా మెలిగిన వ్యక్తిని గుర్తించి అతనికి పరీక్షలు నిర్వహించేందుకు వెళ్లిన వారిపై దుండగులు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు మహిళా డాక్టర్లు గాయపడ్డారు. తెలంగాణలోని నిజామాబాద్‌లో, కర్ణాటకలోని బెంగళూరులో, మహారాష్ట్రలోని ముంబైలో కూడా ఈమాదిరి దాడులు జరిగాయి.

కరోనా వ్యాధికి సంబంధించినంతవరకూ మన దేశంలో ఇప్పుడున్న పరిస్థితులు ఎంతో సంక్లిష్టమైనవి. సకాలంలో రోగుల్ని గుర్తించడంలో, వారికి వైద్య చికిత్స అందించడంలో జాప్యం జరిగితే ప్రాణనష్టం తప్పదు. పైగా తమకు రోగం వచ్చిన సంగతి గుర్తించకుండా ఇష్టానుసారం ఎటుపడితే అటు వెళ్లేవారివల్ల చుట్టూవున్న సమాజానికి కూడా చేటు. ఈ పరిస్థితుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది తమ ప్రాణాలొడ్డి పనిచేస్తున్నారు. సాధారణ సమయాల్లోకన్నా ఎక్కువగా వారు ఆసుపత్రుల్లో గడపవలసి వస్తోంది. వారందిస్తున్న సేవల్ని సమాజం గుర్తించాలని, వారికి కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలపాలని ప్రధాని పిలుపునిస్తే గత నెల 22న జనమంతా పాటించారు. కానీ కొందరు ఆ పిలుపు వెనకున్న స్ఫూర్తిని మరిచి ఇలాంటి దాడులకు దిగుతున్నారు. కరోనా వ్యాధిని గుర్తించి, సకాలంలో చర్యలు తీసుకోవడంలో జాప్యం చేసిన అమెరికా అందుకు మూల్యం చెల్లిస్తోంది. భారీ సంఖ్యలో ఆసుపత్రులు, వైద్యులు అందుబాటులో వుండి, అత్యంతాధునిక వైద్య సదుపాయాలున్నా క్షణక్షణానికీ పెరుగుతున్న రోగుల సంఖ్యతో ఏం చేయాలో తెలియక ఆ దేశం తలపట్టుకుంది. వైద్య సిబ్బంది కృషికి అడ్డుతగిలితే ఇక్కడ కూడా ఆ పరిస్థితులే ఏర్పడతాయి. ఇలాంటి దుండగులతో కఠినంగా వ్యవహరించాలని ఇప్పటికే కేంద్రం మార్గదర్శకాలిచ్చింది. వైద్యుల కృషికి సహకరిస్తేనే సమాజం సురక్షితంగా వుండగలుగుతుందని అందరూ గుర్తించాలి.

### గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి శు.ఏకాదశి సా.5.56 వరకు తదుపరి ద్వాదశి, నక్షత్రం ఆశ్లేష ప.12.49 వరకు తదుపరి మఖ, వర్జ్యం రా.12.12 నుంచి 1.45 వరకు దుర్ముహూర్తం ఉ.5.56 నుంచి 7.35 వరకు అమృతఘడియలు... ప.11.18 నుంచి 12.47 వరకు.

**సూర్యోదయం :** 5.58
**సూర్యాస్తమయం:** 6.09
**రాహుకాలం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు
**యమగండం :** ప.1.30 నుంచి 3.00 వరకు

# ప్రాణాలకన్నా లాభార్జనే మిన్న!

విశ్లేషణ




దేవీందర్ శర్మ

**కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య రానురానూ పెరిగిపోతూ అమెరికాలోనే కరోనా రోగుల సంఖ్య లక్షకుపైగా చేరుకున్నప్పుడు, వైరస్ బారినపడి మరణిస్తున్న వారి జాబితా పెరిగిపోతున్నప్పుడు ఆ దేశంలో బిలియనీర్లు మాత్రం ప్రజలకు కలుగుతున్న నష్టాలను ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం.. పైగా తరిగిపోతున్న తమ లాభాల గురించే తెగ ఫీలయిపోతూ వాణిజ్య కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించాలని ఒత్తిడి చేస్తున్నారు. రెండు లక్షలమంది మరణించినా సరే.. కరోనా రోగుల ఆ బలిదానం వ్యవస్థ మనుగడకు అవసరం అంటున్నారంటే కార్పొరేట్లకు మానవ ప్రాణం కంటే లాభార్జన ముఖ్యమన్నమాట.**

ఒక విషయంలో మనం చాలా స్పష్టంగా ఉండాలి. బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఆర్థికశాస్త్రంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రాబర్ట్ రీచ్ ప్రస్తుత ప్రపంచ సమస్య గురించి ఒక్కమాటలో చెప్పేశారు. 'అసలు సమస్య వైరస్సే... ఆర్థికం కాదు..'. మానవ ప్రాణాలను ముందుపీఠిన ఉంచి ఆర్థిక లక్ష్యాలకేసి తర్వాత దృష్టి సారించాలంటూ జీ–20 దేశాధినేతలకు హితవు చెప్పనప్పుడు ప్రధాని నరేంద్రమోదీ సరిగ్గా రాబర్ట్ రీచ్ మాటలనే ప్రతిధ్వనించారు. కానీ ప్రాణాంతక కరోనా వైరస్ సాంక్రమిక వ్యాధిని నిరోధించే విషయమై ప్రపంచం అతలాకుతలమవుతున్న నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ పరిరక్షణ కోసం మనుషులను ప్రత్యేకించి వృద్ధులను బలిదానం చేయాల్సిందేననే స్వరాలు పెరుగుతున్నాయి.

టెక్సాస్ లెఫ్టినెంట్ గవర్నర్ డేన్ పాట్రిక్ దీన్ని మరింత మొరటుగా వ్యక్తీకరించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ క్షేమం కోసం, యువత క్షేమంకోసం దేశంలోని వృద్ధులు తమ ప్రాణాలు వదులుకోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పేశారు. ప్రజలు కరోనా బారినుంచి తప్పించుకోవడానికి తెలివిగా ఉండాలని, అదే సమయంలో వారు తమ తన పనులకు తిరిగి వెళ్లాలని కోరారు. కానీ స్వయంగా ఆరుమంది పిల్లలకు తాత అయిన పాట్రిక్ వారికోసం తన ప్రాణాలు వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు మాటవరుసకైనా ఆయన చెప్పకపోవడం వింత గొల్పుతుంది. తాను కూడా స్మార్ట్‌గానే ఉన్నట్లు తాను భావిస్తున్నట్లుంది. పైగా తక్కిన సమాజం నుంచి భౌతిక దూరం పాటించడం పట్ల సంపన్నవర్గం ఎప్పటినుంచో స్మార్ట్‌గా ఉంటోందని మనందరికీ తెలుసు కదా. ప్రత్యేక ఎయిర్ ఫిల్టరేషన్ వ్యవస్థలను కలిగిన బంకర్లను కొనుగోలు చేస్తున్నదీ, సంవత్సరం పాటు ఆహార సరఫరాకు హామీ నిచ్చే ఎస్కేప్ టన్నెల్స్‌ను ఏర్పాటు చేసుకుంటున్నది కూడా ఈ స్మార్ట్ సంపన్నవర్గమే మరి. కానీ, డేన్ పాట్రిక్ ఒక్కరే ఇలాంటి క్రూరమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారని అనుకుంటే మనం పప్పులో కాలేసినట్లే. కొద్దిమంది వ్యక్తులను పోగొట్టుకోవడం కంటే ఇప్పుడు ఆర్థిక వ్యవస్థను మూసివేస్తే ఎదుర్కోనాల్సిన నష్టాలు చాలా ఘోరంగా ఉంటాయని అమెరికా బిలియనీర్ టామ్ గొలిసెనో మీడియా ముందే చెప్పేశారు. కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య రానురానూ పెరిగిపోతూ అమెరికాలోనే కరోనా రోగుల సంఖ్య లక్షకుపైగా చేరుకుంటున్నప్పుడు, కరోనాబారిన పడి మరణిస్తున్న వారి జాబితా పెరిగిపోతున్నప్పుడు ఆ దేశంలో బిలియనీర్లు మాత్రం జాతికి కలుగుతున్న నష్టాలను ఏమాత్రం పట్టించుకోకుండా.. తరిగిపోతున్న తమ లాభాల గురించి తెగ ఫీలయిపోతూ అర్జెంటుగా వాణిజ్య కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించాలని ఒత్తిడి చేస్తున్నారు.

ఇప్పటికే ప్రపంచ జనాభాలో సగం వాస్తవంగానే గృహనిర్బంధంలో ఉంటూ, పరిశ్రమలు షట్టర్లు మూసివేస్తున్నప్పుడు, జాతీయ, అంతర్జాతీయ పర్యటనలు పూర్తిగా స్తంభించిపోయి ఉన్నప్పుడు పేరు మోసిన పెట్టుబడిదారీ పత్రిక వాల్ స్ట్రీట్ జర్నల్ తన సంపాదకీయంలో ఏమి రాసిందో చూస్తే పెట్టుబడిదారుల ఆలోచనలు ఎలా ఉంటున్నాయో అర్థమవుతుంది. కరోనా వైరస్ షట్‌డౌన్ పట్ల తిరిగి ఆలోచించడం ఎలా అనే పేరుతో వచ్చిన ఆ సంపాదకీయం.. 'ఆర్థిక



ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఏ సమాజం కూడా ప్రజారోగ్యాన్ని దీర్ఘకాలంపాటు కాపాడలేదు' అని కార్పొరేట్ రంగానికే సాధ్యమైన హితవు చెప్పింది. అయినా మీకు ఇంకా షాక్ తగలకుంటే, న్యూయార్క్ టైమ్స్‌లో కాలమిస్టు థామస్ ఫ్రీడ్‌మన్ రాసింది ఒకసారి చూడండి. 'కరోనా వ్యాధి బారినపడి అత్యంత విషమ పరిస్థితుల్లో ఉన్నవారు కరోనా వైరస్‌కు బలవడాన్ని కొనసాగిస్తూనే మనలో ఆ వైరస్ బారిన పడినవారు కోలుకుని తిరిగి పనికి వెళ్లేలా చూద్దాం'. మానవ ప్రాణాలకు ఏమాత్రం ప్రాధాన్యం లేనప్పుడు కరోనా వైరస్ సోకి సంభవిస్తున్న మరణాల రేటు అనేది గణాంకాల కూర్పుగానే మారిపోతుంది. భారత్‌లో రైతుల ఆత్మహత్యలపై విధాన నిర్ణేతలు వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా ఇలాగే ఉంటోంది కదా.

అమెరికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ట్వీట్ చేశారు. 'సమస్యకంటే నివారణను ఘోరమైనదిగా చూడలేం. ఈ సంక్షోభ పరిస్థితుల్లో మనం ఏవైపు పయనించాలన్న విషయమై 15 రోజుల తర్వాత ఒక నిర్ణయానికి వద్దాం'. అమెరికాలో కరోనా వైరస్ వ్యాప్తి రేటు పెరిగిపోతున్న సమయంలో ట్రంప్ ఇలా పేర్కొన్నారు. మరోవైపు అమెరికాకు ఎంతో దూరంలో ఉన్న బ్రెజిల్ దేశాధ్యక్షుడు జెయిర్ బొల్సొనరో అయితే కరోనా వైరస్‌ని పెద్దగా పట్టించుకోనవసరం లేని చిన్న ఫ్లూ అని చెప్పేశారు. తన ప్రభుత్వాన్ని కూలదోసే ఉద్దేశంతోనే సంక్షోభాన్ని మరింత పెద్దది చేసి చూపుతూ ప్రజలను ఏమార్చడానికి మీడియా కంకణం కట్టుకుందని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడానికి తాను అనుకూలం కాదని కూడా తేల్చేశారు.

సంపన్నులు, శక్తిమంతుల నుంచి ఇలాంటి మొరటు స్పందనలు గమనించాక మనం ఎలాంటి సమాజంలో ఉంటున్నామని ఆశ్చర్యపోక తప్పదు. మానవ చరిత్రలో విషాదాల్లో కెల్లా అత్యంత విషాదకర ఘటనగా ఆర్థికవేత్తలు కరోనా వైరస్‌ను చూస్తున్నప్పుడు ఇలాంటి మొరటి స్పందనలు ఎలాంటి ఫలితాలను చూపిస్తాయో అర్థం కావడం లేదు. పైగా చరిత్ర నిర్ణాయక దశల్లో సంపన్నుల, ప్రభువుల అభిప్రాయాలు ఇంతకు మించి భిన్నంగా ఉండేవి కాదు. 1943లో బెంగాల్ దుర్భిక్షం సందర్భంగా లక్షలాది మంది (40 లక్షల మంది) మరణించినందుకు కారణాలు ఏమిటని బ్రిటిష్ ప్రభుత్వం ప్రశ్నించినప్పుడు నాటి భారత వైస్రాయ్ లార్డ్ వేవెల్ సమాధానమిస్తూ దారిద్ర్యంతో మగ్గుతున్న వీళ్లు ఎలాగైనా చనిపోక తప్పదు అనేశారు. అయితే నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్ చేసిన పరిశోధన ప్రకారం 1943లో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఏమాత్రం తగ్గలేదని తెలిసింది. కానీ ఆహార ధాన్యాలను బ్రిటిష్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా దారి మళ్లించినందు వల్లే బెంగాల్లో దుర్భిక్షం చెలరేగిందని సేన్ చెప్పారు. అయితే పేదప్రజలకు ఆహారం అందకుండా చేసినవారిని తప్పు పట్టడానికి బదులుగా విన్‌స్టన్ చర్చిల్ మరీ ఘోరమైన వ్యాఖ్య చేసినట్లు తెలుస్తోంది. భారతీయ నిరుపేదలు ఎలుకల్లాగా ఆహారాన్ని మేసేస్తున్నారని అందుకే దుర్భిక్షం సంభవించిందని చెబుతూ చర్చిల్ భారత పేదలపైనే ఆరోపణ చేశారు. అంతకంటే ముందు 1845–49 మధ్య కాలంలో ఐరిష్ దుర్భిక్షం సమయంలో పది లక్షలమంది ఆకలిదప్పులతో మరణించగా, మరొక పది లక్షల మంది వలసపోయారు. ఆకలిదప్పులతో జరిగిన మరణాలకు దుర్భిక్షం మాత్రమే కారణం కాకపోవచ్చు.

ఐర్లండ్‌లోని కోర్క్ ప్రాంతంలో ఐరిష్ దుర్భిక్షం 150 వార్షికోత్సవం నిర్వహించిన సందర్భంగా ఆ నగర మేయర్ తన ప్రారంభ ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. ఆనాడు బంగాళాదుంపలకు తెగులు సోకి పంట మొత్తంగా దెబ్బతినిపోయి ఆకలితో ప్రజలు చస్తున్నప్పుడు ఆనాటి బ్రిటిష్ వలసాధిపతులు బ్రిటన్‌కు ఓడలకొద్దీ మొక్కజొన్నలను పంపించే పనిలో మునిగిపోయారు, నాటి ఐర్లండులో ఎలాంటి సమాజం ఉనికిలో ఉండేదో దీన్ని బట్టే తెలుస్తుందని కోర్క్ మేయర్ చెప్పారు. దాదాపు 2 కోట్ల 50 లక్షలమందిని బలితీసుకున్న 1918లో చెలరేగిన స్పానిష్ ఫ్లూతో సహా ఆకలి చావులనుంచి సాంక్రమిక వ్యాధుల దాగా సమాజంలోని కొందరు కులీనవర్గాలు కోట్లాదిమంది సామాన్యులను పీడించిన దాని ఫలితమేనని పలువురు రాజకీయ ఆర్థశాస్త్రజ్ఞులు చెబుతున్నారు.

సమాజం అతలాకుతలమవుతున్న సమయాల్లో కార్పొరేట్లు సంక్షోభాన్ని ఎలా తమకు అనువుగా మల్చుకుంటాయో రాబర్ట్ రీచ్ స్పష్టంగా చెప్పారు. ఇప్పుడు మన ప్రజలకు ఆరోగ్య సంరక్షణను అందించాలని మేం చెప్పినప్పుడు మనకంత శక్తిలేదని సమాధానం వచ్చినట్లు అమెరికన్ సెనేటర్ బెర్నీ శాండర్స్ చెప్పారు. కానీ, స్టాక్ మార్కెట్లు కూలిపోతున్నప్పుడు కూడా దేశంలో డబ్బుకు మాత్రం కొదవలేకుండా చేశారు. పైగా మదుపుదారుల భయాందోళనలను ఉపశమింపచేసేందుకు అమెరికా ప్రభుత్వం 1.5 ట్రిలియన్ డాలర్లను మార్కెట్లో కుమ్మరించింది. ప్రపంచమంతటా ఇదే జరుగుతోంది. ప్రతి ఒక్కరూ స్తంభించిపోయి ఉన్నప్పుడు ఆర్థిక చింతనలో నాటకీయ మార్పును ఎదుర్కోవలసి వస్తున్న ప్రపంచంలో తప్పకుండా ప్రవర్తనా పూర్వకమైన మార్పును మనం చూడగలమని ఆశిద్దాం. కరోనా వైరస్ సాంక్రమిక వ్యాధి పట్ల ప్రపంచ స్పందన ఇప్పుడు సరైన దారిలోనే సాగుతోంది. వైరస్ వ్యాప్తిని అరికట్టడంపైనే ప్రపంచం మొత్తంగా దృష్టి పెట్టింది. అంతర్జాతీయ సమాజం స్పందించకముందే మూడు వారాలపాటు లాక్ డౌన్ ప్రకటించిన భారత ప్రభుత్వం సకాలంలో సరైన చర్యను తీసుకున్నట్లే చెప్పాలి. ఈ సంక్షోభం నుంచి మీరు బతికి బయటపడితే అప్పుడు ఆర్థికవ్యవస్థను పునర్నిర్మించవచ్చు మరి.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### దీపం



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 5వ తేదీన దీపాలు వెలిగించమని చెప్పడాన్ని కొందరు వెటకారం చేస్తున్నారు. మరికొందరేమో దాన్ని ఒక మాస్టర్ స్ట్రోక్‌గా అభివర్ణిస్తున్నారు. కానీ, నేనేమంటానంటే..మనందరం ఒంటరితనంతో, భయంతో ఉన్నప్పుడు అందరూ కలిసికట్టుగా ఒక్కటి కావడానికి ఇదొక చక్కని మార్గం. ఇందులో తప్పేముంది? లాక్ డౌన్ నేపథ్యంలో ఒంటరిగా ఉండే వాళ్ల గురించి, వారి బాధలు, వ్యథల గురించి ఇప్పుడు ఒక్కసారి ఆలోచించండి. అలాంటి వారిని ఇష్టపడేవారంతా తప్పనిసరిగా దీపాలు వెలిగించండి.

– సోనీ రజ్దాన్, నటి


### మరొకరు



కరోనా కారణంగా ఢిల్లీలో మరొకరు మరణించారు. వీరితో మృతుల సంఖ్య 5కు చేరింది. ఇతడికి కూడా నిజాముద్దీన్ మర్కజ్‌తో సంబంధాలు ఉన్నాయి. ఢిల్లీలో మరణించిన ఐదుగురిలో ముగ్గురు జమాత్‌కు చెందినవారే.

– జెబా వర్సి, జర్నలిస్ట్

### మహమ్మారి



వైద్యుల కోసం పళ్లాలు, గిన్నెలు మోగించమంటారే గాని, వారికి వ్యక్తిగత రక్షణ పరికరాలు మాత్రం కొనరు. పేదల కోసం కొవ్వొత్తులు వెలిగించమంటారు. కానీ, వారికి కనీస వేతనం చెల్లించరు. ప్రధాని నిధి పేరుతో పౌరుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేస్తారు. కానీ, వాటిని ఎలా వినియోగించారో చెప్పరు. మహమ్మారిలాంటి తీవ్రమైన వ్యాధిని సైతం ప్రధాని తక్కువగా అంచనా వేస్తున్నారు.

– శ్రీవత్స, కాంగ్రెస్ నేత

### దాడి



ఉత్తరప్రదేశ్‌లో కన్నౌజ్ జిల్లాలోని ఒక మసీదులో శుక్రవారం సందర్భంగా సామూహికంగా ప్రార్థనల్లో పాల్గొనవద్దని సూచించినందుకు పోలీసు బృందంపై కొంతమంది రాళ్లు రువ్వారు. ఈ దాడిలో ఒక పోలీసు తలకు తీవ్రమైన గాయం అయ్యింది.

– సౌరభ్ త్రివేది, జర్నలిస్ట్

### పేదలు



తన కుటుంబాన్ని కలుసుకోవడానికి ఒక సొసైటీ సెక్యూరిటీ గార్డు బిహార్ నుంచి నోయిడాకు నడుచుకుంటూ వచ్చాడు. అతడికి నాలుగు రోజులు పట్టింది. దేశంలోని పేదల పరిస్థితి ఇది.

– సమన్వయ, జర్నలిస్ట్

### సంఖ్య 9



తొమ్మిదిగంటలకు ఉపన్యాసం. రేపు ఏప్రిల్ 5 (5+4=9) రాత్రి 9 గంటలకు 9 నిమిషాలపాటు. 14వ తేదీకి తొమ్మిది రోజుల దూరం. 9 గ్రహాలు. సంఖ్య 9 అంటే మార్స్ (మంగళ్ – వెలుగునీ, కాంతినీ ఇచ్చే గ్రహం). భారత దేశ క్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఆ గ్రహాన్ని రగిలిస్తున్నారు. అత్యద్భుతం.

– ప్రియా గుప్తా, సినీ నిర్మాత

### ఓటమి



కరోనా కారణంగా తలెత్తిన పరిస్థితిపై పలువురు ఆటగాళ్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడా. స్వీయ క్రమశిక్షణ, పట్టుదల, సమష్టి కృషి, పోరాట పటిమ వంటివన్నీ ఆటలకు అవసరం. కరోనా వైరస్‌ను ఓడించడానికి కూడా ఇవన్నీ కావాలి.

– నరేంద్ర మోదీ, ప్రధాని

# నిర్లక్ష్యానికి ఇరాన్ చెల్లిస్తున్న మూల్యం




ఒకటిన్నర నెల క్రితం వారు తమను ఏ వైరస్ కూడా ఏమీ చేయలేదనుకున్నారు. తర్వాత వచ్చిపడిన కరోనా మృత్యు భయంతో వణికిపోయారు. ఇప్పుడు అరాజకత్వం, గందరగోళాలతో బెంబేలెత్తిపోతున్నారు. చైనాలో పుట్టిన వైరస్ చైనానే ముంచేస్తుంది తప్ప తమనేమీ చేయలేదులే అని భావించిన ఇరాన్ పరిస్థితి ఇదీ మరి. నెలరోజుల్లోపే గర్వాతిశయం నుంచి చిగురుటాకులా వణికిపోయే దశలో బిక్కుబిక్కుమంటోంది. తమకేమీ కాదన్న ధీమాతో ఉన్న ఇరాన్ తమ వాణిజ్య భాగస్వాములకు పెద్ద ఎత్తున మాస్కులను ఎగుమతి చేసింది కూడా. కానీ ఇప్పుడు అదే ఇరాన్.. కరోనా ధాటికి హడలిపోతోంది. దాదాపు డజనకు పైగా ప్రభుత్వ అధికారులు, ఎంపీలు వైరస్ బారినపడ్డారు. ఇరాన్ సుప్రీం నేత సీనియర్ సలహాదారు చనిపోయారు. ఇప్పుడు 3 లక్షలమంది మిలీషియా సభ్యులను ఇల్లిల్లూ తిప్పుతూ దేశంలోని ఇళ్లన్నింటినీ క్లీన్ చేయడానికి ఇరాన్ ఆరోగ్య శాఖ ప్రయత్నాలు చేస్తోంది. పైగా ముఖానికి మాస్క్ తొడగనివారికి, ఇతర ప్రజారోగ్య సాధన సామగ్రిని ఉపయోగించని వారికి మరణ శిక్ష తప్పదని దేశ ప్రధాన ప్రాసిక్యూటర్ హెచ్చరించారు కూడా.

తాజా గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 10,39,922 లక్షలమందికి పైగా కరోనా వైరస్ బారిన పడ్డారు. మృతుల సంఖ్య 55,170కి చేరుకుంది. ప్రస్తుతం ఇరాన్‌లో 47,500 మంది కరోనా వైరస్ ప్రభావితులు కాగా 3,160 మందికి పైగా జనం మరణించారు. కానీ వైరస్ వ్యాప్తికి ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందకపోగా, కోవిడ్–19 బారిన పడిన రోగులు, మృతుల వివరాలపై నోరెత్తవద్దని ఇరాన్ భద్రతా బలగాలు డాక్టర్లను, నర్సులను హెచ్చరించాయి. అంతుబట్టని వ్యాధి కారణంగా వందలాదిమంది రోగులు రోజూ ఆసుపత్రులకు వస్తున్నారని నర్సులు, డాక్టర్లు చెబుతున్నా, మందులిచ్చి పంపేయమని అధికారులు చెప్పడంతో అప్పటికే వైరస్ సోకిన వారు సమాజంలో కలిసిపోవడం ప్రమాదాన్ని రెట్టింపు చేసింది. చివరకు ఫిబ్రవరి 19న ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే సమయానికి దేశంలో వైరస్ అదుపు తప్పిపోయింది.

వైరస్‌ను తాము అదుపు చేయబోతున్నట్లుగా మీడియాలో గుప్పిస్తున్న నియంత్రిత సమాచారం ఇప్పుడు అధికారులకే భీతి కలిగి స్తున్నట్లు కనిపిస్తోందని ఇరాన్ వైద్యులు టెలిఫోనిక్ ఇంటర్వ్యూలలో చెబుతున్నారు. ఇప్పటికి కూడా సెక్యూరిటీ ఏజెంట్లు ప్రతి ఆసుపత్రి వద్ద నిఘా పెట్టి వైరస్ నివారణకు కావలసిన సామగ్రి కొరత, రోగుల సంఖ్య, వైరస్‌కు బలైన మృతుల సంఖ్యను వెల్లడించవద్దని ఆసుపత్రి సిబ్బందిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇరాన్ వాయవ్య ప్రాంతంలోని ఒక నగరం నుంచి ఒక నర్సు తన కుటుంబ సభ్యులకు పంపిన మెసేజ్‌ను తర్వాత న్యూయార్క్ టైమ్స్ ప్రచురించింది. కరోనా వ్యాధి సోకిన రోగుల వివరాలను బయటపెడితే అది జాతీయ భద్రతకు ప్రమాదకారి మాత్రమే కాకుండా ప్రజలను భీతావహులను చేస్తుందని భద్రతాబలగాలు తమను హెచ్చరించాయని, ఈ నేరానికి పాల్పడితే క్రమశిక్షణా కమిటీ కఠినచర్యలు తీసుకుంటుందని చెప్పినట్లు ఆ నర్సు తన మెసేజ్‌లో పేర్కొంది.

అయితే ఇలా వైరస్ ప్రభావిత రోగుల విషయంలో గోప్యత పాటించడం, ఏమీ జరగలేదని భ్రమించడం, మభ్యపెట్టడం వల్ల ఇరాన్ ప్రభుత్వ పరువు ప్రతిష్టలు మసకబారతాయని, ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం నశిస్తుందని, వైరస్ నివారణకు తీసుకోవలసిన అత్యంత ఆచరణాత్మక వాస్తవిక చర్యలు వెనకపట్టు పడతాయని ఇరాన్ వైద్యులు, నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వైరస్ వ్యాప్తిని జాతీయ భద్రతా సమస్యగా మార్చడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య బృందాలపై మరింత ఒత్తిడి పెట్టడమే కాకుండా పుకార్లు వ్యాపించి ప్రజలు భయాందోళనలకు గురికాక తప్పదని ఇరాన్‌కు చెందిన వైద్యుడు టెలిఫోనిక్ ఇంటర్వ్యూలో తెలిపారు. అయితే ఇలా వాస్తవాలు మాట్లాడుతున్న వారు తమ పేర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని అభ్యర్థించారు.

వాయవ్య ఇరాన్‌లోని గోలెస్తాన్ ప్రావిన్స్‌లో వందల మందికి వైరస్ సోకినట్లు సమాచారం. కానీ వ్యాధిసోకిన వారి గురించి ప్రకటించడానికి నిరాకరిస్తున్న టెహ్రాన్ ప్రభుత్వ వైఖరిపై ఆ దేశ ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి మీడియా సమావేశంలోనే తీవ్ర నిస్పృహను ప్రదర్శించారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే వెయ్యిమందికి పైగా రోగులకు కరోనా సోకిందని కానీ ఎంతమందికి పరీక్షల్లో పాజిటివ్ అని తేలిందో తాము బయటకు చెప్పలేనందున, ఆరోగ్య మంత్రిత్వ శాఖ తమకు అవసరమైన వైద్య సామగ్రిని పంపబోమని చెబుతున్నట్లు ఆ అధికారి తెలిపారు. వేచి ఉండమని చివరివరకూ చెబుతూ ఉన్నట్లుండి ఇప్పుడు మాత్రం తమను కరోనా కీలక కేంద్ర ప్రాంతంలో ఉన్నారంటూ హెచ్చరిస్తున్నారని ఆ అధికారి వాపోయారు.

కరోనా వైరస్ కలిగించే రాజకీయ ప్రభావం గురించి ఇరాన్ ప్రభుత్వం చాలా తక్కువగా అంచనా వేసుకుంటోందని లండన్ కేంద్రంగా పనిచేస్తున్న పరిశోధక విద్యార్థి సనమ్ వకీల్ ఆరోపించారు. మొదట్లో తమ ప్రజారోగ్య వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని చెప్పారు. క్వారంటైన్ ఎందుకు అని హేళన చేశారు. ఇరాన్ ప్రపంచానికే నమూనా అని గొప్పలు చెప్పుకున్నారు. వారంరోజుల్లోపే ఇరాన్‌లో ప్రజాజీవితం సాధారణ స్థితికి చేరుకుంటుందని దేశాధ్యక్షుడు హసన్ రౌహానీయే ప్రకటించారు. కానీ రాజకీయ నాయకత్వం ఊహించలేనంత ప్రమాద స్థితికి ఇరాన్ ప్రస్తుతం చేరుకుందని సనమ్ వకీల్ విమర్శించారు.

పైగా ఇస్లామిక్ రిపబ్లిక్ అయిన ఇరాన్ మసీదుల్లో భారీ ఎత్తున ప్రజలు గుమికూడటంపై నిషేధం విధించకపోవడం వల్లే వైరస్ విస్తరించిందని, ఇది ప్రభుత్వం స్వయంగా చేసిన నేరపూరితమైన చర్య అని ఇరాన్‌పై అధ్యయనం చేస్తున్న జార్జి వాషింగ్టన్ యూనివర్సిటీ డాక్టర్, చరిత్రకారుడు అమీర్ అఫ్కామీ పేర్కొన్నారు. ప్రజాభద్రత కంటే ప్రభుత్వ, మత ప్రతిష్టను ముందుపీఠిన పెట్టడానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇరాన్‌లో ప్రస్తుత అస్తవ్యస్తతకు రాజకీయ నాయకత్వమే పూర్తి బాధ్యత వహించాలని అమీర్ విమర్శించారు. ఇస్లామిక్ రిపబ్లిక్ చరిత్రలోనే ఇదొక అసమర్థ నాయకత్వమని నిందించారు. వూహాన్‌లో వైరస్ విస్తరించినప్పుడు ఇతర దేశాలు మాస్కులతో సహా వైద్య సామగ్రిని పెద్ద ఎత్తున నిల్వ చేసుకుంటూండగా ఇరాన్ మాత్రం తనకేమీ కాదనే భ్రమల్లో ఉండిపోయి చైనాకు భారీస్థాయిలో మాస్కులను పంపిం చిందని, ఇప్పుడు ఇరాన్‌లోనే మాస్కులకు కరువొచ్చిందని డాక్టర్ అఫ్కామి విమర్శించారు. కరోనా వైరస్ గురించి భ్రమల్లో ఉండటం, వాస్తవాలను తొక్కిపెట్టడం వల్ల జరిగే ప్రమాదం ఏ స్థాయిలో ఉంటుందో చెప్పడానికి ఇరాన్ ఒక ప్రత్యక్ష సాక్ష్యం.

ఫర్నాజ్ ఫాషిహి, డేవిడ్ డి కర్క్ పాట్రిక్
న్యూయార్క్ టైమ్స్ కరస్పాండెంట్లు

# మానసిక ప్రశాంతత

'వెతకండి, తప్పక తెలుసుకుంటారు' అంటారు కొందరు. కానీ ఎక్కడో ఉందనుకుని ప్రశాంతత కోసం అక్కడా ఇక్కడా అంటూ వెతికితే అదేమీ దక్కదని ఇంకొందరంటారు. నిజానికి అది ఎక్కడో లేదు. మనలోనే మనసుని కేంద్రంగా చేసుకుని ఉందన్నదే వాస్తవం. కానీ అది తెలిసినా తెలియకున్నా ఎక్కడో ఉందని వెతుకుతూ పరుగులు తీసే వారే ఎక్కువ. పాండవులు వనవాసం చేశారు. రాముడూ అడవికి వెళ్లాడు. కొందరు దేవుళ్ళు ఎక్కడెక్కడో దాక్కోవలసి వచ్చింది. అడిగిన వారందరికీ వరాలు ఇస్తూ వచ్చిన శంకరుడు కూడా ప్రశాంతత లేకుండా గడిపిన కాలమంటూ లేకపోలేదు. ప్రశాంతత లేక ఒత్తిడికి లోనవడం అనేది ప్రతి ఒక్కరూ ఎప్పుడో అప్పుడు అనుభవించకతప్పదు. దీని నుంచి ఎవరూ తప్పించుకోలేరు.




జీవితం మన గుప్పెట్లో ఉండాలి కానీ దాని గుప్పెట్లోకి మనం వెళ్ళిపోకూడదు. అది మన గుప్పెట్లో ఉండటం వల్ల మనసు కూడా మన నియంత్రణలోనే ఉంటుంది. ఎందులోనైనా పరిమితులు తెలుసుకుని ఉండటం అవశ్యం. చీకటి–వెలుగు, సుఖము–దుఃఖము, నవ్వు–ఏడుపు ఎందులోనైనా సరే పరిపక్వత సాధిస్తే ఏ గొడవా ఉండదు. అనుకోనిదేదో జరిగిపోయిందని ఒంటి మీద స్పృహ లేకుండా ప్రవర్తించడం, ఏదైనా కష్టమో నష్టమో జరిగినప్పుడు కృంగిపోవడం రెండూ మానసిక ప్రశాంతతకు విఘాతమే. చీకట్లోనూ ఎవరికైతే కళ్ళు కనిపిస్తాయో అతనే జ్ఞాని. దేహానికి ఆరోగ్యం కొరవడితే వైద్యుడు ఉన్నాడు. కానీ మనసుకి ప్రశాంతత లేకుంటే దానికి మనమే వైద్యులం.

ఆత్మ స్వరూపాన్ని గుర్తించి అది నడచుకోవడానికి సహకరించేదే దేహం అని తెలుసుకుని దానికి తగినట్టు ప్రవర్తిస్తే ప్రశాంతతకు లోటుండదు. ప్రశాంతత అనేది ఎక్కడో బజారులో అమ్మేది కాదు డబ్బుంది కదాని కొనుక్కోవడానికి. అన్నింటికీ మనసే కారణం. మానసిక ప్రశాంతత కోసం ఎక్కడికో పరుగులు తీసే కన్నా మనలోనే ఉందన్నది తెలుసుకుంటే చాలు. మురికి చొక్కా వేసుకుని ఆనందంగా ఉన్న వాడూ ఉన్నాడు. బాగా ఉతికి ఇస్త్రీ చేసుకున్న చొక్కాను ధరించి ఏమిటీ చొక్కా అని అసంతృప్తితో ఉండే వాడూ ఉన్నాడు. కనుక అన్నింటికీ మనసే కారణం అని తెలుసుకోవాలి.

– యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899



నర్స్ నీతూ

దీపం

# మై సిస్టర్

**‘ఉద్యోగం’ అనుకుంటేనే ‘అదనపు పని గంటలు’ అనే మాట వస్తుంది. ‘బాధ్యత’ అనుకుంటే ఆపత్కాలంలో గంటల్ని లెక్క చూసుకోవడం ఏంటి అనే భావన కలుగుతుంది. నిస్వార్థంగా, నిరంతరాయంగా కోవిడ్ 19 వార్డులలో పని చేస్తున్న నర్సులు, చేయడానికి వస్తున్న యువతులు తమ పనిని తాము ‘సేవ’ అనుకోవడం లేదు. ‘బాధ్యత’ అనుకుంటున్నారు. ఎంతటి అలసటలోనూ చెరగని ఆ సిస్టర్‌ల చిరునవ్వులను ఈ ఆదివారం రాత్రి మన ఇంటి ముందు దీపంగా పెట్టుకుందాం. థ్యాంక్యూ.. మై సిస్టర్.**

**నీతు :** నర్స్. మమా కీ లడికీ.. హాహా.

నా చెల్లెలు చూడండి. కొమ్ముల కరోనాతో యుద్ధం చేస్తూ కూడా ఎలా చిరునవ్వులు చిందిస్తోందో! వియ్ ఆల్ ప్రౌడ్ ఆఫ్ యు మై సిస్టర్. వజ్రం రా నువ్వు. – ఇన్‌స్టాగ్రామ్‌లో కేరళ ర్యాప్ సింగర్ రఫ్తార్ బుధవారం పెట్టిన పోస్ట్ ఇది. ఈ చిరునవ్వుల సిస్టర్‌ని కొన్ని గంటల్లోనే రెండు లక్షల మంది ‘లైక్’ చేశారు. ‘గుడ్ జాబ్. ప్రౌడ్ ఆఫ్ యు సిస్టర్’.. నెట్టంతా బుట్టలకొద్దీ ప్రశంసల పూల ఎమోజీలు నీతూకు.

‘మీకేం కాదు’ అనే ఇలాంటి ఒక నవ్వు చాలు. కరోనా రోగి మానసికంగా కోలుకుని మందులకు త్వరగా తేరుకోడానికి.

• • •

నీతూలాగే శిఖా మల్హోత్రా మరొక చిరునవ్వుల ‘సిస్టర్’. ముంబైలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈమధ్యే నర్స్–కమ్ జూనియర్ డాక్టర్‌గా చేరారు.

ఇంటి చుట్టుపక్కల కార్పొరేట్ ఆసుపత్రుల ఉన్నప్పటికీ, ప్రభుత్వాసుపత్రిలో అవకాశం వచ్చేవరకు కొద్ది రోజులు వేచి చూశారు శిఖ. అక్కడికి ‘ఉద్యోగం’ కోసం వెళ్లినప్పుడు.. ‘మీరు ఫలానా కదా!’ అన్నారు.. ‘ఫ్యాన్’, ‘కాంచ్లీ’ సినిమాల్లో అప్పటికే ఆమెను చూసి గుర్తుపట్టినవాళ్లు. అప్పుడప్పుడే ఇండస్ట్రీలోకి వస్తున్న పాతికేళ్ల అమ్మాయి.. అకస్మాత్తుగా ఇటువైపు రావడం ఏమిటని వారి విస్మయం.

‘‘21 రోజుల లాక్‌డౌన్ ప్రకటన చేస్తూ మోదీజీ ఇచ్చిన ప్రసంగాన్ని విన్నాను. క్షణంసేపు కూడా ఇంట్లో ఉండలేకపోయాను. కరోనా వచ్చిన వాళ్లకు నేను కూడా ఏదైనా చేయాలనుకున్నాను’’ అన్నారు శిఖ. ఆ మాటతో వెంటనే అక్కడి మెడికల్ సూపరింటెండెంట్, ఇతర సీనియర్ వైద్యులు అభినందనగా కరతాళ ధ్వనులు చేశారు. నర్సింగ్‌లో బియస్సీ డిగ్రీ చేశారు శిఖ. ఆ డిగ్రీనే ఆమెకిప్పుడు సేవలు చేసే భాగ్యాన్ని కల్పించింది. రోజుకు 11 నుంచి 12 గంటల పాటు ఆసుపత్రిలోనే ఉంటున్నారు శిఖ. మరికొన్ని గంటలు అదనంగా పని చేయాలని ఆమె తపన. రోగులు ఎక్కువగా ఉండే కోవిద్–19 ఐసోలేషన్ వార్డులో రోజంతా కేస్ షీట్ పట్టుకుని తిరుగుతుండే శిఖ.. ప్రసన్నవదనంతో దేవదూతలా కనిపిస్తున్నారు అక్కడ చికిత్స పొందుతున్న వారికి.

• • •

ఏప్రిల్ 5 ఆదివారం రాత్రి దేశ ప్రజలంతా తొమ్మిది నిముషాల పాటు లైట్‌లు ఆర్పేసి, కొవ్వొత్తులు వెలిగించి... కరోనా అనే చీకటిని సంకేతాత్మకంగా అంతమొందించాలని ప్రధాని మోదీ పిలుపును ఇచ్చారు. మనం వెలిగించడానికి ముందే నీతూ, శిఖా వంటి నర్సులు తమ సేవల చిరునవ్వుల వెలుగులతో కోవిద్ 19 పై అంతిమ విజయానికి పోరాటం చేస్తున్నారు. తమ జీవితాలను ఆసుపత్రులకే అంకితం చేస్తున్నారు. అదనపు పని గంటలకు అంగీకరించని పురుష ఉద్యోగుల పని భారాన్ని కూడా మీద వేసుకుంటున్నారు. కాస్త చదువుకుని, కనీస చికిత్సా విధానాల గురించి తెలిసిన యువతులు కూడా.. వాళ్లు ఏ రంగంలో ఉన్నా ఆ రంగానికి తాత్కాలికంగా విరామం ఇచ్చి.. కరోనా ‘కేర్ టేకింగ్’కి తమకూ అవకాశం కల్పించమని, ఉచితంగా పని చేస్తామని ఆసుపత్రుల యాజమాన్యాలను కోరుతున్నారు! కరోనా పేషెంట్‌లకు దగ్గరగా ఉండే నర్సులు ఆ వైరస్ వ్యాపించి ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అయినా వారు లెక్క చేయడం లేదు.

కరోనాపై విజయానికి ఇప్పుడిప్పుడే మనం చేరువవుతున్నాం. ముందు వరుసలో ఉండి ఈ మహావిపత్తుతో యుద్ధం చేస్తున్న ‘సిస్టర్స్’ త్యాగశీల పోరాట పటిమ వల్లనే ఇంతవరకైనా వచ్చాం. మందు లేదు. మాకు లేదు. టీకా లేదు. కనీసం ఆ మహమ్మారి టైమ్ కూడా ఇవ్వడం లేదు. అయినా నర్సులు ఫైట్ చేస్తున్నారు. రేపు ఒక రోజెప్పుడో కరోనాపై భారత ప్రధాని గెలిచారని, భారత దేశ ప్రజలు గెలిచారని ప్రపంచ దేశాలు మనల్ని శ్లాఘించవచ్చు. అప్పుడు మనం ప్రపంచానికి ఎత్తి చూపించవలసింది మన సిస్టర్ చేతినే. ఒలింపిక్ దీపం లాంటి ప్రాణ దీపం ఆమె చెయ్యి.



నర్స్‌గా బాలీవుడ్ నటి శిఖా మల్హోత్రా



## లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

### ఆవు తిన్నంతే ఆదాయం



అనిల్ సాలుంకే : స్ట్రాబెర్రీల రైతు

పంట చేతికొచ్చింది. కొనేవాళ్లే లేరు. ఏదో సామెతలా.. ‘వచ్చిందే కట్నం’ అనుకుని అమ్మేద్దామన్నా ట్రాన్స్‌పోర్ట్ లేదు. ఎలా మరి! మహారాష్ట్ర సతారా జిల్లాలోని ఓ రైతు ఏం చేశాడో చూడండి. రెండున్నర లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి, రెండెకరాల్లో విరగ పండించిన స్ట్రాబెర్రీలకు విలువ లేక, వాటిని నిలువ ఉంచే తావూ లేక.. ఆవులకు దాణాగా పెడుతున్నాడు. టూరిస్టులు వచ్చిపోతుంటే స్ట్రాబెర్రీలకు గిరాకీ ఉండేది. ఐస్‌క్రీమ్ పార్లర్లు తెరిచి ఉన్నా ఆ పార్లర్ల వాళ్లు స్ట్రాబెర్రీలను కొనడానికి వచ్చేవాళ్లు. లాక్‌డౌన్‌తో అన్నీ డౌన్ అయిపోయాయి. మూగజీవులు తిన్నంత వరకైనా తన పెట్టుబడి వృథా కాలేదన్న సంతోషమొక్కటే ఈ స్ట్రాబెర్రీల రైతుకు మిగిలింది .

### ఉండలేకపోయారు



ట్రాన్స్‌జెండర్‌లు : ఫుడ్ కిట్‌ల పంపిణీ

లాక్‌డౌన్ ఉన్నప్పుడే కాదు, లాక్‌డౌన్ లేనప్పుడూ వేరుగానే ఉన్నారు ట్రాన్స్‌జెండర్‌లు. వాళ్లు వేరుగా ఉండటం కాదు. మనమే వాళ్లను కలుపుకోలేదు. ఇప్పుడీ కరోనా కష్టం కాలంలో వాళ్లకూ మనుషుల్లోకి రావడం తప్పలేదు. అయితే.. వస్తున్నది తమ కోసం కాదు. మురికివాడల్లో ఉంటున్న నిరుపేదల కోసం. గుజరాత్‌లోని సూరత్‌లో 150 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఒక చోట నివసిస్తున్నారు. వాళ్లంతా ఇప్పుడు ‘ఫుట్ కిట్’లను తయారు చేసి ఆకలితో ఆలమటిస్తున్న పేదలకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఆ కిట్‌లలో బియ్యం, గోధుమపిండి, వంటనూనె, టీ పొడి, పంచదార ఉంటాయి. ఏదో ఒక రోజు కాదు. ప్రతిరోజూ పంపిణీ చేస్తున్నారు. మనిషికి మనిషి అవసరం ఉన్నంతకాలమే మనం మనుషులు ఉంటామేమో. లేదంటే.. మగ గానో, ఆడగానో ఉండిపోతాం.

### రివర్స్ సెల్యూట్



దిగ్విజయ్ శర్మ : హీరో పోలీస్‌కు పూలగుత్తి

ఇరవై రెండేళ్ల వయసులోనే ప్రభుత్వ ఉద్యోగం రావడం అంటే జీవితాన్ని పెద్ద మలుపు. అయితే ఆ ఉద్యోగంలో చేరడానికి దిగ్విజయ్ శర్మ చాలా మలుపులే తిరగవలసి వచ్చింది. అదీ.. కాలి నడకన. శర్మది ఉత్తర ప్రదేశ్‌లోని చిన్న గ్రామం. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్‌లో కానిస్టేబుల్‌గా ఉద్యోగం వచ్చింది. వెళ్లి జాయిన్ అవాల్సిన డేటూ వచ్చింది. ఇక్కడి నుంచి అక్కడికి 450 కి.మీ. దూరం. పైగా దేశమంతటా లాక్‌డౌన్. ఎలా వెళ్లడం? ఉద్యోగం మన దగ్గరకు వచ్చినప్పుడు ఉద్యోగం దగ్గరికి మనం వెళ్లకపోతే ఎలా అనుకున్నాడు. నడవడం మొదలు పెట్టాడు. మధ్య మధ్య ఎక్కడైనా మోటర్ బైక్ కనిపించినప్పుడు లిఫ్ట్ అడిగాడు. అలా 20 గంటలు ప్రయాణించి.. పోలీస్ స్టేషన్‌కి చేరుకుని.. ‘డ్యూటీకి వచ్చాను సర్’ అని సెల్యూట్ కొట్టాడు. ఆ తర్వాత అందరూ అతడికి సెల్యూట్ కొట్టారు.

### వలస కూలీల కెప్టెన్



భైచుంగ్ భుటియా: వలసకూలీలకు ఆశ్రయం

లాక్‌డౌన్‌లో అందరికన్నా పెద్ద కష్టం వలస కూలీలది. ‘కూటికోసం కూలి కోసం పట్టణంలో బతుకుదామని’ (శ్రీశ్రీ కవిత) వలస వచ్చి ఉంటారు. ఇలాంటప్పుడు పోదామంటే దారి ఉండదు. ఉందామంటే పని దొరకదు. వీళ్ల కష్టం చూసి చలిపోయారు భైచుంగ్ భుటియా. ఇండియా ఫుట్‌బాల్ జట్టుకు ఒకప్పుడు కెప్టెన్ ఆయన. సిక్కింలోని టడాంగ్‌లో లమ్సే ప్రాంతంలో ఉంటున్నారు. అక్కడ తను ఉంటున్న నివాసాన్ని.. గూడులేని వలస కూలీలకు ఆశ్రయంగా మార్చేశాడు. ఐదు అంతస్థుల సొంత భవనం అది. వంద మంది వరకూ వలసలు ఇప్పుడా భవంతిలో తలదాచుకున్నారు. వారికి రోజూ భోజనాలను కూడా భుటియానే సమకూరుస్తున్నారు. తన ఖర్చు కొంత, తనలా ముందుకొచ్చిన వాళ్ల ఖర్చు కొంత. ఉండటానికింత చోటు చూపించి, తినడానికింత ముద్ద పెట్టడాన్ని మించిన సహాయం ఏముంటుంది మానవ జన్మకు?!

### సహాయం అడిగితే స్వీట్‌బాక్స్‌తో వచ్చారు!



ఆర్.సి.కేశ్వరికి స్వీట్ తినిపిస్తున్న పోలీస్

లక్నో జనాభా 36 లక్షలు. వారిలో ఒకరైన 83 ఏళ్ల ఆర్.సి.కేశ్వరి అనే పెద్దాయనకు అన్ని లక్షల మందిలో ఒక్కరూ ‘నా’ అనేవారు లేరు! కొడుకు, కోడలు యు.ఎస్.లో ఉంటున్నారు. భార్య లేరు. షుగర్ ప్రాబ్లమ్ ఒక్కటే ఆయనతో ఉంటోంది! ఉంటోంది కానీ, తరచు పడిపోతూ ఉంటుంది. సోమవారం కూడా అలాగే హటాత్తుగా పడిపోయింది. ఎవరి ఇళ్లలో వాళ్లు ఉండిపోయిన ఈ ‘క్రిమికాలం’లో.. చాక్లెట్ కోసమో, ఇంత చక్కెర కోసమో ఆయన వెళ్లి ఎవరి తలుపు తట్టగలరు? వెంటనే పోలీసులకు ఫోన్ చేసి తన పరిస్థితిని చెప్పారు. వెనువెంటనే పోలీసులు వచ్చి ఆయన చేతిలో స్వీట్‌బాక్స్ పెట్టారు! చిన్న ముక్క తినిపించారు కూడా.

### ఇద్దరు అదృష్టవంతులు ఒక దురదృష్టం



థామస్, మరియమ్మ

ఆయనకు 93 ఏళ్లు. పేరు థామస్. ఆయన భార్యకు 88 ఏళ్లు. పేరు మరియమ్మ. ఇద్దరికీ కరోనా పాజిటివ్. ఇటలీ నుంచి వచ్చిన పిల్లల్నుంచి, మనవళ్ల నుంచి వారికి కరోనా సోకింది. ఇద్దర్నీ కేరళ ప్రభుత్వం ‘కొట్టాయం మెడికల్ కాలేజ్ ఆసుపత్రి’లో చేర్పించింది. ఐసీయూలో ఉంచి చికిత్స అందించింది. అప్పటికే ఆయనకు మధుమేహం, హైబీపీ, గుండెజబ్బు, యూరినరీ ఇన్ఫెక్షన్ ఉన్నాయి. ఆమెకూ ఇతర వృద్ధాప్యపు అనారోగ్యాలేవో ఉన్నాయి. అయినప్పటికీ వైద్యులు వారిని కరోనా నుంచి కాపాడారు. మంగళవారం అభినందనగా చప్పట్లు కొడుతూ డిశార్చ్ చేశారు. ఎంత మంచి విషయం! అంతే కాదు, ఇటలీ నుంచి వచ్చిన వారి సంతానం కూడా తిరిగి ఆరోగ్యవంతులయ్యారు. అయితే ఇందులో చిన్న బాధాకరమైన సంగతి కూడా ఉంది. ఆసుపత్రిలో ఈ వృద్ధ దంపతులను కంటికి రెప్పలా చూసుకున్న నర్సుకు ఇప్పుడు కరోనా పాజిటివ్!

# అమ్మకు పని పెంచుతున్నామా?

**మనకు సహాయం చేసే పని మనిషి రావడం లేదు. ఇస్త్రీ మనిషి రాడు.**

**వంట విసుగుపుడితే బయటి నుంచి తెచ్చుకోవడానికి లేదు. వెళ్లడానికి లేదు.**

**స్కూలుకెళ్లే పిల్లలు ఇంట్లోనే. భర్త ఇంట్లోనే.**

**అమ్మ గృహిణి అయినా ఉద్యోగిని అయినా ఇప్పుడు ఆమె ఇంట్లోచేస్తున్న పని ఎంత?**

**దానిని మనం పెంచుతున్నామా? సాయం చేసి తగ్గిస్తున్నామా?**

**అసలు ఆమె పనిని మన పని అనుకోగలుగుతున్నామా?**

**ఈ కరోనా సమయంలో అమ్మ పని ఎలా ఉంది?**



ప్రతీకాత్మక చిత్రం

ఇంటి పని అమ్మ పని. అనాదిగా అది అమ్మ పని అని ఈ సమాజం ఆమెకు దానిని విధిగా చేసింది. ఇంటి బయట పడి నాన్నకు అప్పజెప్పింది. అంతటితో ఆగక ఇంటి బయటపని గొప్పదిగా ఇంటి లోపలి పని తక్కువదిగా తూకం వేసి నిర్ధారించింది. ఇంటి బయటి పని ‘డబ్బు’ వస్తుంది గనుక, నాన్న దానిని తెస్తాడు గనుక అది గొప్పదిగా, ఇంటిలో లోపలి పనిలో ఏ డబ్బు రాదు గనుక అమ్మ ఆ పనితో డబ్బు సంపాదించదు కనుక అది తక్కువది అయ్యింది. అమ్మ గృహిణి అయినా, ఉద్యోగి అయినా ఇంటి పనిలో పెద్దగా మార్పు ఉండదు. ఇంటి సభ్యులు పని చేయించుకునేవారిగా, అమ్మ వారికి పని చేసి పెట్టేదానిగా మారిపోతుంది. ఇందులో కొద్దిపాటి సర్దుబాట్లు చేసి ‘ఆమెకు అవసరమైనవి చేసి పెడుతున్నాం కదా’ అని మనసును సమాధానపరుచుకుంటూ ఉంటారు. పని మనిషి ఉందని, పిల్లలు స్కూల్‌కు వెళ్లాక, భర్త ఆఫీసుకు వెళ్లాక ఆమెకు పెద్దగా పని ఉండదని ఏమిటేమిటో చెప్పుకుంటారు. కొందరు జోకులు వేసుకుంటారు. కాని అది నిజంగా నిజం కాదని అందరికీ తెలుసు. ‘అమ్మకు ఆదివారం కూడా సెలవు ఉండదని’ కథలు, వ్యాసాలు, ఉద్యమాలు కూడా వచ్చాయి. అమ్మ శ్రమను అర్థం చేసుకున్నవారు కొందరు. చేసుకోవాల్సినవారు ఎందరో.

**మొన్నటి దాకా రొటీన్**

నిన్న మొన్నటి దాకా అమ్మ రొటీన్ అందరికీ తెలుసు. ఉదయాన్నే లేవాలి. పిల్లలను లేపాలి. బ్రేక్‌ఫాస్ట్, క్యారేజీ రెడీ చేయాలి. భర్తకు క్యారేజీ రెడీ చేయాలి. తను ఉద్యోగానికి వెళుతుంటే గనుక తనూ రెడీ కావాలి. ఉదయం ఆరు నుంచి 9 లోపు ఆమె ఒక యుద్ధంలో పాల్గొంటున్న సైనికురాలిగా ఉంటుంది. ఆమెను గౌరవించే పిల్లలు, భర్త ఉంటే ఈ పనిలో ఎంతో కొంత సాయం చేస్తారు. లేదా అందరిలాంటి వారే అయితే ఆమె శ్రమను చూసీ చూడనట్టుగా వదిలేస్తారు. సరే.. అది అలవాటైపోయింది కనుక దాని మీద కంప్లయింట్ చేయాలి అని కూడా మర్చిపోయి అమ్మ తన పని తాను చేసుకుంటూ ఉంటుంది. మరి ఇప్పుడు?

**ఈ కరోనా సమయంలో?**

బయట కరోనా మహమ్మారి అగ్గిలా రాజుకుంటోంది. అది ఎందరిని దహిస్తుందో తెలియదు. ప్రపంచంతో పాటు దేశం కూడా లాక్‌డౌన్ అయ్యింది. ముందు తలుపుకు ఎప్పుడూ గొళ్లెం వేసి పెట్టాల్సి వస్తోంది. పిల్లలకు స్కూళ్లు లేవు. నాన్న ఇంట్లోనే. పనిమనిషి బంద్. పని మనిషి ఉంటే బట్టలు, అంట్ల శ్రమ తగ్గేది. కాని లేదు. ఇస్త్రీ చేసే కుర్రాడు వచ్చి బట్టలు తీసుకెళ్లడు. ఈ సమయంలో అమ్మ శ్రమ ఎంత ఉందో మనం చూస్తున్నామా? మూడు పూటలా ఆమె వండాలి. వాటికి అంట్లు పడతాయి. పిల్లలు ఇంట్లో ఉంటే వారు గడియకోమారు ఏదో ఒకటి అడుగుతూ ఉంటారు. అవి సమకూర్చాలి. భర్త తిండి ప్రియుడు అయితే వాటినీ చేసి పెట్టాలి. వర్క్ ఫ్రమ్ హోమ్ అయితే ఇంకా అన్యాయం. ఇవన్నీ చేస్తూ ఆఫీస్ పని కూడా చేయాలి. అమ్మకు ఎంత కష్టం. అమ్మ నోరు తెరిచి అన్నీ చెప్పుకోదు. అరవదు. విసుక్కోదు. లోలోపల బాధ పడుతుంది. ఆ బాధను పట్టించుకుంటున్నామా?



**ఏం చేద్దాం?**

టైం టేబుల్ వేసుకోవాలి. పనిని కాగితం మీద రాసుకోవాలి. అమ్మ చేయాల్సిన పనులు, నాన్న చేయాల్సిన పనులు, పిల్లలు చేయాల్సిన పనులు అని విభజన చేసుకోవాలి. ఆ పనులు తప్పక చేయాలి. చేసింది తినడం, పెట్టినదానితో సరి పుచ్చుకోవడం నేర్చుకోవాలి. ఎప్పుడు ఏం జరుగుతుందనే ఈ భయాందోళన సమయంలో రుచి ప్రతిసారీ కుదరకపోవచ్చు. వంకలు పెట్టకుండా తినాలి. అసలు వంటే చేయనవసరం లేకుండా ఒక్కో పూట పండ్లు, బ్రెడ్‌లాంటి వాటిని తీసుకోవచ్చేమో చూడాలి. ఇల్లు శుభ్రం చేయడం, సర్దుకోవడం, బట్టలు ఉతకడం ఇవి ఎవరెవరు పంచుకోవచ్చో చూసి తప్పనిసరిగా పంచుకోవాలి. అన్నింటికి మించి అమ్మతో మాట్లాడాలి. ఆమెను వంట గదిలో వదిలిపెట్టి మిగిలిన కుటుంబ సభ్యులంతా ఒక పార్టీలాగా మారి కబుర్లు చెప్పుకుంటోనో ఆడుకుంటూ ఎంజాయ్ చేస్తుంటేనో అది చాలా తప్పుగా గ్రహించాలి. మనం నవ్వాలి. అమ్మను నవ్వించాలి. పరస్పరం ప్రశంసించుకుంటూ ప్రోత్సహించుకోవాలి. ఇది ఇప్పుడు చేయాల్సింది.

**నాన్నలు మారాలి**

‘నాకు టీ పెట్టడం కూడా రాదు’, ‘నాకు కిచెన్ ఎక్కడుందో తెలియదు’... ఇలా మాట్లాడటం కొందరు మగవాళ్లకు గొప్ప. ఇలా మాట్లాడే వాళ్లందరూ బేచిలర్ లైఫ్‌లో తిండి కోసం నానా ప్రయోగాలు చేసినవారే అయి ఉంటారు. ఇప్పుడు మళ్లీ ఆ రోజులను తలుచుకుని పనిలోకి దిగాలి. చేయగలిగిన వంట పని చేయాలి. ఆమెకు ఆఫీస్ పని ఎంత ఉందో తెలుసుకొని ఆ పని వొత్తిడి తీరేవరకు ఇల్లు చూసుకోవాలి. బాత్‌రూమ్‌లు కడగాలి. నా ఇంటి కోసం నేను పని చేస్తాను అని తీర్మానించుకోవాలి. ఏ పనీ తప్పించుకునే వీలు లేని రోజులివి. వీటిని పంచుకునే వారే ఇప్పుడు కావలసినది. అలాంటి ఇల్లే ఇప్పుడు అవసరమైనది. అలాంటి ఇంట్లో అమ్మకు ఆయుష్షు ఎక్కువ.

– సాక్షి ఫ్యామిలీ

## కరోనా కథ

### ఆకలి చేప

మెడికల్ షాప్ ముందు జనం నలుగురైదుగురు ఉన్నారు. అందరి మధ్యలో పన్నెండేళ్ళ కుర్రాడు దోషిలా నిలబడ్డాడు. వాడి చేతిలో ఓ కవరుంది. అక్కడ జనం అప్పటికే వాడ్ని కొట్టినట్లున్నారు. వాడు ఏడుస్తూ చొక్కా చివరతో కళ్ళూ, ముక్కు తుడుచుకుంటున్నాడు.

‘‘వీడు చూడండి. వేలెడంతలేడు. అప్పుడే దొంగతనాలు చేస్తున్నాడు. రేపు పెద్ద క్రిమినల్ అయిపోతాడు’’ షాపు ఓనర్ ఆ కుర్రాడి జబ్బ పట్టుకుని చెపుతున్నాడు.

‘‘నేను దొంగోణ్ణి కాదు బాబు. మా అమ్మ సందుల్లో తిరిగి కూరలు అమ్ముతాది. ఆమెకు ఒక మాస్కు ఇద్దామని.. ఈ రెండు అట్టుకుని లగెత్తుదామనుకున్నా. అంతే! సార్ పట్టేశారు’’ వెక్కుతున్నాడు కుర్రాడు.

‘‘ఇలాటోణ్ణి వదిలేయకూడదు. పోలీసులకు పట్టించాలి’’ అన్నాడింకో మనిషి.

ఇంతలో పోలీస్ వాన్ వచ్చింది. పోలీస్ దిగాడు. వెక్కుతున్న కుర్రాడ్ని కాలర్ పట్టుకుని తీసుకెళ్లి వాన్ ఎక్కించాడు. షాప్ ఓనర్ గజదొంగని చట్టానికి అప్పచెప్పినట్లు ఫోజ్ ఇస్తూ షాప్ లోపలికెళ్ళాడు.

‘‘బ్రేకింగ్ న్యూస్! ముంబైలో నాలుగు కోట్లు విలువైన మాస్కులు బ్లాక్ మార్కెట్ చేసిన వ్యాపారి... ’’అని టీవీలో ఓ ఛానల్‌లో స్క్రోలింగ్ పదే పదే మొత్తుకుంటోంది.

ప్రపంచం తెలియని చిన్నచేప వలలో చిక్కింది. తిమింగలం బయటపడింది. ఈ విషయాలేమి పట్టనట్లు తన వ్యాపారం తాను చేసుకుంటున్నాడు షాప్ ఓనర్.

–పెమ్మరాజు విజయ రామచంద్ర

## పెద్ద మనసు

# సామాన్యుల సహాయాలు

**కోవిడ్ 19 దేశం మొత్తాన్ని లాక్‌డౌన్ చేసేసింది. ఉపాధి పోతోంది. తిండి గింజలు కరవవుతున్నాయి. ఈ గడ్డుకాలంలో నిరుపేదలను, వలస కూలీలను, మూగ జీవాలను ఆదుకునేందుకు ఎందరో సామాన్యులు శక్తికి మించిన సహాయంతో ముందుకు వస్తున్నారు. అలాంటి యోధుల్ని మనం అభినందించి తీరవలసిన సమయం కూడా ఇది.**

### పంచడానికే పంటంతా!

యదు ఎస్. బాబు (25) కేరళ రైతు. తన ఎకరన్నర పొలంలో పండుతున్న కూరగాయలను ఈ విపత్కాలంలో రోజువారీ కూలీలకు ఉచితంగా పంచిపెడుతున్నారు. ‘‘కష్టం వచ్చినప్పుడు మనిషిని మనిషే కదా అదుకోవాలి’’ అంటారు యదు బాబు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న ఈ యువకుడి దగ్గరికి రెట్టింపు ధరకు పంటను కొనేందుకు చాలామందే వస్తుంటారు. అయితే ఈసారి మాత్రం తన సాగునంతా అవసరంలో ఉన్నవారికి ఉచితంగా పంపిణీ చేయాలని బాబు నిర్ణయించుకున్నారు. ఇందుకు ఒక ఎన్జీవో సహకారం తీసుకున్నారు. బీన్స్, బీట్‌రూట్, ఆనప, వంకాయ వంటి కూరల్ని వారానికి వంద కిలోల దాకా పండిస్తున్నారు బాబు.



### అంబులెన్స్‌గా సొంత కారు



ఉత్తరాఖండ్ దేవప్రయాగకు చెందిన 32 సంవత్సరాల గణేశ్ భట్ తన కారును అంబులెన్స్‌గా మార్చారు. ‘‘ప్రస్తుత పరిస్థితుల్లో 108 సర్వీసుపై ఒత్తిడి పెరగడంతో సమయానికి వారు స్పందించలేక గర్భిణులు, వయోవృద్ధులు, ఇతర ప్రాణాంతక అవసరాలలో ఉన్నవారు అవస్థలు పడుతున్నారు. అందువల్ల నా కారును అటువంటి వారి కోసం ఉపయోగిస్తున్నాను’’ అంటున్న గణేశ్ ఈ లాక్‌డౌన్‌లో ఇప్పటివరకు ఇరవై మందికి పైగా అత్యవసర స్థితిలో సాయం చేశారు. తొలిసారి ఈ ఏడాది మార్చి 21న నొప్పులు పడుతున్న ఒక గర్భిణిని ఆసుపత్రికి చేర్చడంతో ఆయన సేవలు మొదలయ్యాయి.



### మూగ ప్రాణుల కోసం



లాక్‌డౌన్ కారణంగా రెస్టారెంట్లు, ఆఫీసు క్యాంటీన్‌లు పూర్తిగా మూతబడటంతో మిగులు పదార్థాలు ఉండట్లేదు. ఆ కారణంగా జంతువులకు తిండి దొరకట్లేదు. వీధుల్లో కుక్కలు, ఆవులు, గేదెలు.. అన్నీ డొక్కలెండి ఉంటున్నాయి. వాటిని సంరక్షించటం కోసం నవీ ముంబైలో ఉంటున్న కరిష్మా ఛటర్జీ అనే గృహిణి ముందుకు వచ్చారు. ‘‘మనమంతా ముందుజాగ్రత్తగా సరుకులు తెచ్చుకుని ఇంట్లో పెట్టుకున్నాం. కాని జంతువులకు అది తెలియదు కదా..’ అంటున్న కరిష్మా ప్రతిరోజూ సుమారు పదిహేను కుక్కలు, పిల్లులకు ఆహారం అందిస్తున్నారు. ఆమె మాత్రమే కాదు. 21 సంవత్సరాల సగుణ్ భతీజ్‌వాలే (వెటర్నరీ డాక్టరుగా ఆఖరి సంవత్సరం చదువుతున్నారు) పక్షులకు, జంతువులకు, చెట్లకు సేవ చేస్తున్నారు. తన సన్నిహితులు, స్నేహితులు కూడా ఇందులో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.

– వైజయంతి పురాణపండ

సాక్షి స్పోర్ట్స్
శనివారం
4-4-2020

## తెలంగాణ సీఎం సహాయనిధికి శ్రీకృష్ణప్రియ విరాళం రూ. 5 లక్షలు




సాక్షి, హైదరాబాద్: కోవిడ్–19పై పోరాటానికి మద్దతుగా తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ప్లేయర్ కుదరవల్లి శ్రీకృష్ణప్రియ ముందుకొచ్చింది. తనవంతుగా తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 5 లక్షలు విరాళం అందించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)లో విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణప్రియ మాట్లాడుతూ క్లిష్ట సమయంలో క్రీడాకారులందరూ కరోనా మహమ్మారిపై పోరాటానికి తమవంతుగా చేయూత ఇవ్వాలని కోరింది. మరోవైపు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ప్రధాన మంత్రి సహాయ నిధికి (పీఎం–కేర్స్ ఫండ్) రూ. 71,14,002 విరాళాన్ని అందించినట్లు పేర్కొంది. కరోనా కట్టడికి జాతీయ క్రీడా సమాఖ్యలతో పాటు, రాష్ట్ర ఒలింపిక్ సంఘాలు అందించిన చేయూతను ఐఓఏ కొనియాడింది.

## ఐపీఎల్ కన్నా ప్రాణం మిన్న

**భారత క్రికెటర్ సురేశ్ రైనా వ్యాఖ్య**

**న్యూఢిల్లీ:** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలకు మించిన ప్రాధాన్యత గల అంశమేదీ లేదని భారత వెటరన్ క్రికెటర్ సురేశ్ రైనా అన్నాడు. ఐపీఎల్ కచ్చితంగా మరింత కాలం వాయిదా వేయాల్సిందేనని సూచించాడు. ఇప్పుడప్పుడే ఈ లీగ్‌ను నిర్వహించే అవకాశం లేదని అభిప్రాయపడ్డాడు. 'ఐపీఎల్ కన్నా అందరూ ప్రాణాలతో మిగిలుండటమే ఇప్పుడు ముఖ్యం. లాక్‌డౌన్ కాలంలో ప్రతీ ఒక్కరూ ప్రభుత్వం మాట వినాల్సిందే. లేదంటే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతా చక్కబడ్డాక మళ్లీ ఐపీఎల్ ఆడుకోవచ్చు. కరోనాతో ఎందరో ప్రాణాలు వదులుతున్నారు. వారిని కాపాడుకునేందుకు మనవంతు ప్రయత్నం చేయాలి' అని రైనా పేర్కొన్నాడు. వైరస్ వ్యాప్తి నియంత్రణకు రైనా ఇప్పటికే రూ. 52 లక్షల విరాళాన్ని ప్రకటించాడు. నిర్బంధ కాలంలో పూర్తిగా కుటుంబంతో గడుపుతోన్న రైనా... ఒక క్రికెటర్‌కు ఎంతో ముఖ్యమైన క్రికెట్‌ను దాటి మరో జీవితం ఉంటుందని చెప్పాడు. 'గతవారమే నా భార్య బాబుకి జన్మనిచ్చింది. ఈ సమయంలో ఇంటి పనులు, వంట పనులతోపాటు వారి అవసరాల్ని దగ్గర ఉండి చూసుకోవడం చాలా సంతృప్తినిస్తోంది. క్రికెట్‌కు మించిన మరో అందమైన జీవితం ఉందని ఇలాంటి పరిస్థితుల్లోనే అవగత మవుతుంది' అని శుక్రవారం తన ఐదో వివాహ వార్షికోత్సవం సందర్భంగా రైనా అన్నాడు.



## ఆ క్షణం ఇంకా రాలేదు

- ప్రపంచ కప్ సాధించిన రోజే చిరస్మరణీయం అవుతుంది
- భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన మనోగతం
- అభిమానులతో భారత బ్యాటర్ సరదా ముచ్చట్లు





తల్లిదండ్రులతో...

**ముంబై:** స్మృతి మంధాన... క్రీజ్‌లో ఉన్నప్పుడు దూకుడుగా బ్యాటింగ్ చేయడమే కాదు, మైదానం బయట కూడా అంతే చురుగ్గా కనిపించే ఈతరం అమ్మాయి. భారత ఓపెనర్‌గా ఎన్నో చూడచక్కటి ఇన్నింగ్స్‌లు ఆడిన స్మృతి క్రికెట్ ముగిశాక తన సొంత ప్రపంచంలో చేసే అల్లరికి అంతే ఉండదు. సహచరురాలు జెమీమా రోడ్రిగ్స్ కూడా జత కలిసిందంటే అంతు లేని ఆటపాటలతో ఇక ఫుల్ బిజీ. భారత డ్రెస్సింగ్ రూమ్‌లో వీరిద్దరూ అందించే వినోదం ప్రత్యేకం. ఇప్పుడు లాక్‌డౌన్ కారణంగా ఆటగాళ్లంతా తమ ఇళ్లలోనే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో సరదాగా మాట్లాడుకుందామని అభిమానులకు స్మృతి పిలుపునిచ్చింది. ట్విట్టర్ వేదికగా ఆస్క్ స్మృతి అంటూ సాగిన సంభాషణలో మహారాష్ట్రకు చెందిన 23 ఏళ్ల ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ తన మనసు విప్పి పలు ఆసక్తికర విషయాలు చెప్పింది. విశేషాలు స్మృతి మంధాన మాటల్లోనే....

- మైదానంలో దిగాక అతిగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తా. బ్యాటింగ్ సమయంలో కూడా ఒకేసారి ప్రణాళిక రూపొందించుకోకుండా ఒక్కో బంతికి అనుగుణంగా నా ఆటతీరును మార్చుకుంటా.
- అంతర్జాతీయ క్రికెట్‌లో నేను ఎంతో మంది బౌలర్లను ఎదుర్కొన్నా... వారిలో మరిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా పేసర్) బౌలింగ్‌లో పరుగులు తీయడానికి చాలా కష్టపడ్డాను.
- కెరీర్‌కు సంబంధించి భారత్ తరఫున తొలి మ్యాచ్ ఆడిన రోజు నా కెరీర్‌లో మరచిపోలేనిది. అయితే చిరస్మరణీయ క్షణం మాత్రం ఇంకా రాలేదు. బహుశా భవిష్యత్తులో మేం ప్రపంచ కప్ సాధించిన రోజు అది కావచ్చు.
- సరదాగా చెప్పాలంటే నా మొహం ఇన్ని రోజులు చూస్తూ మా ఇంట్లో వాళ్లే అలసిపోయారు. ఎప్పుడెప్పుడు తర్వాతి టోర్నీ ఉంటుందా అంటున్నారు. అయితే ఈ సమయాన్ని చాలా బాగా గడుపుతున్నామనేది మాత్రం వాస్తవం.
- చిన్నప్పుడు నాకిష్టమైన కార్టూన్ల జాబితాలో నాడీ, బాబ్ ద బిల్డర్, నింజా హటోరి ఉన్నాయి. ఇప్పుడు కూడా సమయం దొరికితే వాటిని చూస్తుంటా.
- అరిజిత్ సింగ్ కాకుండా నాకు ప్రస్తుతం ఇష్టమైన బాలీవుడ్ గాయకుడు ప్రతీక్ బచ్చన్ (సరిలేరు నీకెవ్వరులో సూర్యుడివో, చంద్రుడివో పాట పాడాడు) నా హోటల్ (ఎస్ఎం 18 పేరుతో సాంగ్లీలో ఉంది)లో ఏం బాగుంటాయని అడిగారు. మా మెనూలో అన్ని ఐటమ్స్ మీకు నచ్చుతాయి. ఒకసారి తెరిచాక వచ్చి రుచి చూడవచ్చు.
- అందంగా ఉంటావు కాబట్టి సినిమాల్లో చేయవచ్చు కదా అని ఒక అభిమాని అడిగాడు. అయితే నన్ను చూడటానికి ఎవరైనా థియేటర్‌కు వస్తారని నేను అనుకోవడం లేదు. కాబట్టి మీరు కూడా అలాంటివి అస్సలు ఆశించవద్దు.
- ప్రస్తుతం నేను ఒంటరిగా ఉన్నానా అని అడుగుతున్నారు.... ఏమో చెప్పలేను. నాకైతే తెలీదు.
- నా జీవిత భాగస్వామి కావాలనుకునే వ్యక్తి నన్ను ప్రేమించేవాడై ఉండాలనేది మొదటి షరతు. ఈ మొదటి షరతుకు కావాల్సిన నిబంధనలను పాటించాలనేది నా రెండో షరతు.
- ప్రేమ పెళ్లా, పెద్దలు కుదిర్చిన పెళ్లా (లవ్ ఆర్ అరేంజ్‌డ్) అని అడిగితే లవ్–రేంజ్‌డ్ అని చెబుతా. నాకు దగ్గరలో జెమీమా లేకపోవడం వల్ల లోటేమీ తెలియడం లేదు. ఇంకా కాస్త ప్రశాంతంగా ఉంటున్నా (దీనిపై స్పందించిన జెమీమా... నువ్వు మోసగత్తెవంటూ ట్విట్టర్ లోనే సరదాగా బదులిచ్చింది).



గతంలో కళ్లద్దాలు పెట్టుకొని నేను బ్యాటింగ్ చేసేదాన్ని. అయితే మూడేళ్ల క్రితం అది మారింది. 2017లో గాయం కారణంగా విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కాంటాక్ట్ లెన్స్‌లను వాడటం అలవాటు చేసుకున్నాను. ఇప్పుడు నేను చాలా సౌకర్యవంతంగా ఉన్నా.

## మీ మద్దతు కావాలి

- క్రీడాకారులతో ప్రధాని మోదీ
- 'సై' అన్న క్రీడాలోకం



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ కరోనా మహమ్మారిపై మోగిస్తున్న యుద్ధభేరిలో భారత క్రీడాకారుల మద్దతు కోరారు. శుక్రవారం ఆయన క్రీడల మంత్రి కిరణ్ రిజిజుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో క్రీడాకారులతో మాట్లాడారు. కోవిడ్–19పై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి, దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ పీవీ సింధు, సాయిప్రణీత్, అథ్లెటిక్స్ దిగ్గజం పీటీ ఉష, భారత మహిళల హాకీ కెప్టెన్ రాణి రాంపాల్ , టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్రీడా ప్రముఖుల్లో కొందరు. కరోనా వైరస్‌పై విజయం సాధించాలంటే లాక్‌డౌన్‌లో అందరూ కచ్చితంగా వ్యక్తిగత శుభ్రత, సామాజిక దూరం పాటించేలా విస్తృత అవగాహన కల్పించాలని మోదీ సూచించారు. తమ అభిమాన ఆటగాళ్ల సంకేతాలు భారతీయులు చెవికెక్కించుకుంటే అనుకున్న ఫలితాలు సాధించవచ్చని ప్రధాని భావిస్తున్నారు. 'ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో మీ మీ సూచనలు, సలహాలు అవశ్యం. మైదానాల్లో మీలాగే ఇప్పుడు ఇండియా మొత్తం మహమ్మారిపై పోరాడుతోంది. దేశ ప్రతిష్టను పెంచే మీలాంటివారు ముందుకొచ్చి జనాన్ని జాగృతం చేస్తే ఆ స్ఫూర్తితో దేశం వైరస్‌పై పైచేయి సాధిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం' అని వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ ఆటగాళ్లతో అన్నారు. వీడియో కాల్‌పై సచిన్ మాట్లాడుతూ... కరోనాపై పోరు ముగిశాక కూడా ఇకపై మనమంతా కరచాలనానికి బదులు మన సంప్రదాయం ప్రకారం నమస్కారంతోనే పలకరించుకోవాలని సూచించినట్లు చెప్పారు.


## సఫారీ ఆటగాళ్లంతా సేఫ్



**జొహన్నెస్‌బర్గ్:** భారత పర్యటనకు వచ్చి... మహమ్మారి దెబ్బకు ఒక్క మ్యాచ్ అయినా ఆడకుండానే దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు గత నెల తిరుగుముఖం పట్టింది. అయితే భారత్ నుంచి స్వదేశం చేరిన సఫారీ ఆటగాళ్లలో ఎవరికీ కరోనా లక్షణాలు లేవని ఇక్కడ నిర్వహించిన పరీక్షల్లో తేలింది. ప్రొటీస్ ఆటగాళ్లు మార్చి 18న దక్షిణాఫ్రికా చేరారు. వీళ్లందరిని 14 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచగా... గురువారంతో ఈ స్వీయ నిర్బంధం ముగిసింది. అనంతరం కరోనా పరీక్షలు చేయగా రిపోర్టులన్నీ నెగెటివ్‌గానే వచ్చాయని శుక్రవారం జట్టు చీఫ్ మెడికల్ ఆఫీసర్ షుయబ్ మంజ్రా తెలిపారు. వీళ్ల నిర్బంధం ముగిసినా మరో రెండు వారాలు ఎక్కడికీ వెళ్లే అవకాశాల్లేవు. ఎందుకంటే దక్షిణాఫ్రికాలోనూ 21 రోజుల లాక్‌డౌన్ కొనసాగుతుంది. ఇప్పటివరకు దక్షిణాఫ్రికాలో 1400 మందికిపైగా కరోనా బారిన పడగా... ఐదుగురు మృతి చెందారు.


## పెళ్లిళ్లు ఆగిపోతున్నాయి!

**ఆస్ట్రేలియా క్రికెటర్ల ఆవేదన**



జంపా

**మెల్‌బోర్న్:** సాధారణంగా ఆస్ట్రేలియా క్రికెటర్లకు ఏప్రిల్ అంటే పెళ్లిళ్ల మాసం. కొద్ది రోజుల క్రితమే క్రికెట్ సీజన్ ముగియడంతో పాటు వాతావరణం మారిపోయి చలిగాలులు పెరగక ముందే పెళ్లి చేసుకునేందుకు వారు ఆసక్తి చూపిస్తారు. అయితే ఇప్పుడు కోవిడ్–19 కారణంగా ఆ ప్రణాళికలన్నీ తలకిందులవుతున్నాయి. జాతీయ జట్టుకు ఆడుతున్న వారు, బోర్డు కాంట్రాక్ట్ ఉన్నవారిని చూస్తే ఎనిమిది మంది క్రికెటర్లు ఏప్రిల్‌లో పెళ్లికి సిద్ధపడ్డారు. ఆడమ్ జంపా, ఆండ్రూ టై, డార్సీ షార్ట్, స్వెప్సన్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. కరోనా కారణంగా ఆస్ట్రేలియా ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించింది. పెళ్లికి కూడా ఐదుగురుకు మించి హాజరు కారాదు. వధూవరులతో పాటు ఇద్దరు సాక్షులు, పెళ్లి జరిపించే పాస్టర్ మాత్రమే ఉండాలి. దాంతో భారీగా వివాహం తలపెట్టినవారంతా వాయిదాలు వేసుకుంటున్నారు. మరో ఇద్దరు అగ్రశ్రేణి క్రికెటర్లు కమిన్స్, మ్యాక్స్‌వెల్‌ల పరిస్థితి ఇందుకు భిన్నం. వీరిద్దరూ ఇటీవలే నిశ్చితార్థాలు జరుపుకోగా, ఇంకా పెళ్లి తేదీలు నిర్ణయించుకోలేదు. కమిన్స్ పరిస్థితి కొంత ఇబ్బందికరంగానే కనిపిస్తోంది. అతను పెళ్లి చేసుకోబోయే బెకీ బోస్టన్ ఇంగ్లండ్‌కు చెందిన అమ్మాయి. ఇప్పుడు కరోనా వల్ల ఇంగ్లండ్‌లో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి. ఏ రోజుకారోజు వారి క్షేమ సమాచారం తెలుసుకోవడమే సరిపోతుందని, ఈ సమయంలో ఇంకా పెళ్లెలా జరుగుతుందని కమిన్స్ వాపోయాడు. మరోవైపు కరోనా కారణంగా ఈ ఏడాది ఐపీఎల్ జరిగే అవకాశాలు సన్నగిల్లుతుండటంతో కమిన్స్ బాధ రెట్టింపయ్యేలా ఉంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక విలువకు (రూ. 15.5 కోట్లు) అమ్ముడుపోయిన విదేశీ ఆటగాడిగా కమిన్స్ కొత్త రికార్డు సృష్టించాడు. ఇప్పుడు లీగ్ జరగకపోతే ఇంత భారీ మొత్తం అతను కోల్పోయినట్లే.



కమిన్స్



మహేష్‌బాబు



సారా అలీఖాన్

## జోడీ కుదిరిందా?


**ప**రశురాం దర్శకత్వంలో మహేష్ బాబు ఓ సినిమా చేయడానికి కమిట్ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కథకు తుది మెరుగులు దిద్దుతున్నారు పరశురాం. అయితే ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటిస్తారు? అనే విషయంపై పలు వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇందులో మహేష్‌కి జోడీగా బాలీవుడ్ హీరోయిన్ సారా అలీఖాన్ నటిస్తారని టాక్. ఒకవేళ ఈ కాంబినేషన్ సెట్ అయితే సారాకు ఇదే తొలి తెలుగు సినిమా అవుతుంది. సారా బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ కుమార్తె అనే సంగతి తెలిసిందే. జూన్ తర్వాత ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని సమాచారం.



శ్రియ

## గురి మారింది

**త**న కొత్త సినిమా కోసం జూన్ నెలను టార్గెట్ చేసుకున్నారు హాలీవుడ్ యాక్షన్ స్టార్ టామ్ క్రూజ్. అయితే అయన గురి మారింది. కరోనా వైరసే అందుకు కారణం. టామ్ క్రూజ్‌ని యాక్షన్ స్టార్‌ని చేసిన చిత్రం 'టాప్ గన్'. 1986లో ఈ సినిమా విడుదలయింది. 30 ఏళ్ల తర్వాత ఈ సినిమాకు సీక్వెల్‌గా 'టాప్ గన్ మావెరిక్' తెరకెక్కుతోంది. ఈ సినిమాను జూన్ 24న విడుదల చేయాలనుకున్నారు. కరోనా వైరస్ ప్రభావంతో డిసెంబర్ 23కి వాయిదా వేశారు.



టామ్ క్రూజ్

## ఎంతో నేర్చుకున్నా



జాన్వీ కపూర్

''**లా**క్ డౌన్‌లో ఉండి వారం అవుతోంది. ఈ సమయంలో చాలా విషయాలు నేర్చుకున్నాను, తెలుసుకున్నాను. రోజూ తింటున్న ఆహారం విలువ తెలిసింది. తినడానికి కావాల్సినంత ఉండటం అదృష్టం అనే విషయం అర్థం చేసుకున్నాను. కానీ ఇంట్లో తినడానికి సరిగ్గా ఆహారంలేక ఎప్పటికప్పుడు కొనుగోలు చేయడానికి సాహసం చేసి బయటకు వెళ్తున్న వాళ్లను చూస్తుంటే ఏదో తెలియని బాధ. ఇలాంటివాళ్ల గురించి ఇన్ని రోజులూ ఆలోచించకుండా నేనెంత స్వార్థంతో, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించానో తెలుసుకున్నాను. ప్రతిరోజూ మా నాన్నగారు మమ్మల్ని ఎంతగా మిస్ అవుతున్నారో తెలుసుకున్నాను. మా పనుల్లో మేము ఉండి ఇంటికి తిరిగొచ్చే సమయం వరకు మా కోసం ఆయన ఎంతలా ఎదురు చూస్తున్నారో అర్థమయింది. నా రోజువారీ జీవితం సాఫీగా సాగిపోవడానికి ఎంతమంది మీద ఆధారపడ్డానో అర్థమయింది. మా ఇంటికి నేను చాలా అవసరం అనే సంగతి గ్రహించాను. వాళ్లందరినీ బాధ్యతగా చూసుకోవాలని తెలుసుకున్నాను. వాళ్ల ఆరోగ్యమే నా ఆరోగ్యం అని తెలుసుకున్నాను'' అని సోషల్ మీడియాలో రాసుకొచ్చారు జాన్వీ కపూర్.



బాలకృష్ణ



సంపత్ నంది

## కరోనా విరాళం

**బాలకృష్ణ** – 1 కోటీ 25 లక్షలు.
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 50 లక్షలు, తెలంగాణ ప్రభుత్వానికి 50 లక్షలు, 'కరోనా క్రైసిస్ చారిటి మనకోసం'కు 25 లక్షలు)

**సంపత్ నంది** – 5 లక్షలు
('కరోనా క్రైసిస్ చారిటి మనకోసం'కు)



భర్త ఆండ్రూ కొచీవ్‌తో...

## పని పంచుకోండి

''**లా**క్ డౌన్ సమయంలో అందరూ ఇళ్లలోనే ఉంటున్నారు. భర్తలందరూ తమ భార్య చేస్తున్న పనిని పంచుకోండి'' అంటున్నారు శ్రియ. లాక్ డౌన్‌లో చాలామంది సెలబ్రిటీలు రకరకాల చాలెంజ్‌లు విసురుతున్నారు. వర్కౌట్స్ చేయమని, పుస్తకాలు చదవమని ఇలా రకరకాల చాలెంజ్‌లు అన్నమాట. తాజాగా హీరోయిన్ శ్రియ కొత్త చాలెంజ్ విసిరారు. ఇది కేవలం భర్తలకు మాత్రమే. ''నేను మా ఆయన్ని ఎందుకు పెళ్లి చేసుకున్నానో మీకు తెలుసా? ఎందుకంటే ఆయన గిన్నెలు బాగా శుభ్రం చేస్తారు కనుక (నవ్వుతూ). మీరు (భర్తలను ఉద్దేశించి) కూడా ఈ సమయంలో మీ భార్యకు ఏదో విధంగా సహాయపడండి. దాన్ని వీడియోగా షేర్ చేయండి'' అంటూ ఓ వీడియోను షేర్ చేసి, తన ఫ్రెండ్స్ కొందరికి ఈ చాలెంజ్ విసిరారు శ్రియ. 2018లో ఆండ్రూ కొచీవ్, శ్రియ వివాహం చేసుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ స్పెయిన్‌లో ఉంటున్నారు.

## నవ్వులతో రెచ్చిపోదాం



రవికిరణ్

**ర**వికిరణ్.వి, అతుల్ కులకర్ణి ప్రధాన పాత్రల్లో ఏ.కె. జంపన్న దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'రెచ్చిపోదాం బ్రదర్'. ప్రహోదయ ఫిలిమ్స్ పతాకంపై వి.వి లక్ష్మీ, హనీష్ బాబు ఉయ్యూరు నిర్మిస్తున్నారు. జంపన్న మాట్లాడుతూ – ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రమిది. మంచి భావోద్వేగాలతో కూడుకున్న వైవిధ్యభరితమైన కథతో తెరకెక్కిస్తున్నాం. సంగీతానికి మంచి ప్రాధాన్యం ఉంది. సాయి కార్తీక్ సంగీతం, శ్యామ్ కె. నాయుడు సినిమాటోగ్రఫీ మా చిత్రానికి ప్రధాన ఆకర్షణ'' అన్నారు. ''నేటి వాస్తవిక పరిస్థితులకు అద్దం పట్టే చిత్రమిది. ఈ చిత్రంలో పాటలు చాలా ట్రెండీగా, కొత్తగా ఉంటాయి'' అన్నారు రవికిరణ్. ''ఒక్క పాట మినహా షూటింగ్ మొత్తం పూర్తయింది. యువతను ఆలోచింపజేస్తూనే, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదంతో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు హనీష్ బాబు. దీపాలి శర్మ, శివాజీరాజా, పోసాని, శశాంక్, భానుచందర్, ఇంద్రజ తదితరులు ఈ చిత్రంలో నటించారు.

## నాలుగు వేడుకల పెళ్లి



రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్

**బా**లీవుడ్‌లో వన్నాఫ్ ఆఫ్ ది క్రేజీ లవ్‌బర్డ్స్ రణ్‌బీర్ కపూర్ – ఆలియా భట్ వివాహం గురించిన వార్తలు తరచూ తెరపైకి వస్తూనే ఉంటాయి. తాజాగా వీరి వివాహం గురించిన ఓ కొత్త వార్త బాలీవుడ్ టౌన్‌లో వినిపిస్తోంది. ఈ ఏడాది డిసెంబరులో రణ్‌బీర్ – ఆలియా ప్రేమికుల నుంచి భార్యాభర్తలు అవుతారని టాక్. వీరి పెళ్లిని డిసెంబరు 7న లేదా 21న జరిపేలా రెండు కుటుంబాల సభ్యులు ఆలోచనలు చేస్తున్నారని సమాచారం. పెళ్లి వేడుకలను నాలుగు రోజులు జరపాలనుకుంటున్నారని టాక్.

## ఫిల్మ్ జర్నలిస్టుల కోసం అండగా...

**క**రోనా వైరస్ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న ఫిల్మ్ జర్నలిస్టులకు 'తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్'(టీఎఫ్‌జేఏ) అండగా ఉంటుందని అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న 35 మంది ఫిల్మ్ జర్నలిస్టులకు టీఎఫ్‌జేఏ ఆధ్వర్యంలో 30 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ– ''సినిమా ప్రెస్‌మీట్స్‌కి హాజరయ్యే విలేకరులకు, ఫొటో, వీడియో జర్నలిస్టులకు టీఎఫ్‌జేఏ అండగా ఉంటుంది. ఏ ఒక్కరూ కూడా ఆకలితో ఉండకూడదనేది సంస్థ ముఖ్యోద్దేశం. ఇబ్బందుల్లో ఉన్న జర్నలిస్టులు టీఎఫ్‌జేఏని సంప్రదించవచ్చు'' అన్నారు.

epaper.sakshi.com



మంత్రి హరీశ్‌రావు పంపిణీ చేసిన శానిటైజర్ బాటిళ్లు

## సిద్దిపేటలో శానిటైజర్ల పంపిణీ

**సిద్దిపేటజోన్:** రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట, గజ్వేల్ నియోజక వర్గాల్లో ఇంటింటికీ ఉచితంగా శానిటైజర్లను అందజేస్తున్నారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు మంత్రి వివిధ చర్యలను చేపట్టారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో సిద్దిపేట పట్టణంలోని 34 వార్డులతో పాటు గజ్వేల్ పట్టణంలో ఇప్పటికే సుమారు 35 వేలకు పైగా శానిటైజర్లను ఉచితంగా అందజేశారు. రెండో విడత పంపిణీకోసం శుక్రవారం మరో 25 వేల శానిటైజర్లను సిద్దిపేటకు తీసుకువచ్చారు. మంత్రి హరీశ్‌రావు సూచనలకు అనుగుణంగా సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు ఆయా వార్డులో ప్రజలకు ఉచితంగా అందజేశారు. మరో పక్క గజ్వేల్ మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో కూడా సుమారు 20 వేల శానిటైజర్లను రెండు విడతల్లో అందజేసేలా ప్రణాళికను రూపొందించారు.

## నిట్‌కు సెలవులు పొడిగింపు

**కాజీపేట అర్బన్ :** వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేటలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)కి సెలవులను ఈనెల 14వ తేదీ వరకు పొడిగించారు. నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో ఈనెల 4వ తేదీ వరకే సెలవులు ప్రకటించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అత్యవసర సేవలు మినహాయించి ఈనెల 14 వరకు సెలవులను పొడిగించామని తెలిపారు.

## కువైట్‌లో అత్యవసర క్షమాభిక్ష

**సాక్షి, హైదరాబాద్/ మోర్తాడ్ (బాల్కొండ):** కరోనా విజృంభిస్తోన్న ప్రస్తుత తరుణంలో కువైట్ దేశం సంచలన నిర్ణయం తీసుకుంది. తమ దేశంలో అక్రమంగా నివసిస్తోన్న, చిల్లర నేరాలకు పాల్పడిన విదేశీయులకు క్షమాభిక్ష పెడుతున్నట్లు ప్రకటించింది. స్వచ్ఛందంగా ముందుకు వస్తే వారందరినీ వారి మాతృదేశాలకు పంపేందుకు ఉచితంగా విమాన టికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుంచి దరఖాస్తులకు అవకాశం కల్పించినట్లు కువైట్ ప్రభుత్వ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. దీనికోసం వివిధ దేశాలవారికి వేర్వేరు తేదీలను కేటాయించగా, భారతీయులకు 11 నుంచి 14వ తేదీలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. భారత్‌లో 14వ తేదీ వరకు అంతర్జాతీయ విమాన సర్వీసులు నిలిపివేసిన క్రమంలో ప్రత్యేక అనుమతి కోసం భారత ప్రభుత్వంతో కువైట్ వర్గాలు సంప్రదింపులు జరుపుతున్నాయి.




### కరోనాపై అవగాహన

కరోనా వ్యాప్తిని దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇళ్లు వదిలి బయటకు రావొద్దంటూ ఖమ్మం పోలీసులు స్థానిక మయూరి సెంటర్‌లో రోడ్డుపై కరోనా వైరస్ బొమ్మ వేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. బొమ్మలో.. 'అడుగు బయట పెట్టకు.. ఆపదలో పడకు.. స్టే హోం'అని రాసి బయట తిరుగుతున్న వారికి అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.

– సాక్షి సీనియర్ ఫొటో జర్నలిస్ట్, ఖమ్మం

## 'ఢిల్లీ' లెక్కలు ఇచ్చేందుకు భయమెందుకు?

**కరోనాపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు ఇవ్వాలి**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్**



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం కరోనా పాజిటివ్ కేసులపై స్పష్టమైన హెల్త్ బులెటిన్ విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఢిల్లీ నుంచి రాష్ట్రానికి వచ్చిన వారి లెక్కలు బయటికి ఇవ్వాలని, ఎంత మంది వచ్చారో స్పష్టమైన సంఖ్య ఇవ్వడానికి ప్రభుత్వం ఎందుకు భయపడుతుందని, ఎవరి మెప్పుకోసం ప్రయత్నిస్తోందని ప్రశ్నించారు. ఇప్పటివరకు కరోనా పాజిటివ్ కేసులు ఏయే జిల్లాల్లో ఎన్ని వచ్చాయో తెలియజేస్తే అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉంటారన్నారు. ఆరోగ్య శాఖ ఇచ్చే హెల్త్ బులెటిన్‌కు, సీఎంవో ఇచ్చే కరోనా లెక్కలకు సంబంధం ఉండటం లేదన్నారు. ప్రజలు ఆరోగ్య శాఖను నమ్మాలో లేదోనన్న సందిగ్ధంలో ఉన్నారన్నారు. గంట వ్యవధిలోనే సీఎంవో అధికారిక ప్రకటనకు, ఆరోగ్య శాఖ హెల్త్ బులెటిన్‌కు పొంతన ఉండటం లేదన్నారు. ఇప్పటికైనా ప్రతిరోజు కరోనాపై స్పష్టమైన హెల్త్ బులెటిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మాకు పూర్తి వేతనమివ్వండి

**రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం**

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నియంత్రణలో రాత్రీపగలు తేడా లేకుండా పనిచేస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగులకు పూర్తి వేతనమివ్వాలని రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. పోలీసు, వైద్య, ఆరోగ్య శాఖకు మొత్తం వేతనమిస్తూ పంచాయతీరాజ్ శాఖను విస్మరించడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, విదేశీయులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చినవారి క్వారంటైన్, కరోనా పాజిటివ్ కేసుల గుర్తింపు, ఆస్పత్రులకు తరలింపు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న 60 ఏళ్లకు పైబడినవారి గుర్తింపులో తలమునకలైన పీఆర్ ఉద్యోగులను పట్టించుకోకపోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజల సేవల్లో నిమగ్నమైన తమ వేతనాల్లో కోత పెట్టడమేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మున్సిపల్ ఉద్యోగులకు పూర్తి జీతమివ్వాలి: సీపీఐ

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి ఆరోగ్య, పోలీసు శాఖల సిబ్బందితోపాటు మున్సిపల్ ఉద్యోగులు కూడా అహర్నిశలు శ్రమిస్తున్నందున వారికి పూర్తి వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ విజ్ఞప్తి చేసింది. కరోనా వ్యతిరేక యుద్ధంలో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నందున సీఎం కేసీఆర్ వెంటనే స్పందించి వారికి పూర్తి జీతం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

### భద్రాద్రిలో శ్రీరాముడికి

# మహా పట్టాభిషేకం

**సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలంలో శుక్రవారం శ్రీరాముడికి మహా పట్టాభిషేకం నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీసీతారాముల వారికి కల్యాణం నిర్వహించిన మరుసటి రోజు అదే వేదికపై పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దివ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రామయ్యకు అర్చకులు, వేద పండితులు మహా పట్టాభిషేకం జరిపించారు. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో ఈసారి కల్యాణాన్ని మిథిలా స్టేడియానికి బదులు ఆలయంలోని బేడా మండపంలో నిర్వహించారు. పట్టాభిషేకం కూడా ఇక్కడే నిర్వహించారు. మొదటిసారి భక్తులు లేకుండానే క్రతువు జరిగింది. ముఖ్యమంత్రి తరపున దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, గవర్నర్ తరపున ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి స్వామివారికి పట్టువస్త్రాలు, పుష్ప మాలికలు సమర్పించారు. ఉదయం యాగశాలలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద పండితుల వేద ఘోషల మధ్య బేడా మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారిని, మరో ఆసనంపై ఆంజనేయస్వామి వారిని ఆసీనులను చేసి మహా పట్టాభిషేక క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త రామదాసు రామయ్యకు చేయించిన ఆభరణాలను అలంకరించారు. బంగారు పాదుకలు, స్వర్ణ ఛత్ర, చామరాలు, రాజదండం, రాజ ముద్రిక, కత్తిని ధరింపజేశారు. చివరగా కిరీట ధారణ చేశారు.


సీతారామచంద్రస్వామి వారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

### జటిలంగా ఓసీపీ కార్మికుల

# మెరుపు సమ్మె

- సింగరేణిలో అన్ని ఏరియాలకు విస్తరణ
- ఇప్పటికే భూగర్భ గనులకు లేఆఫ్ ప్రకటన
- ఓసీపీల్లో సమ్మెతో బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం


ఓసీపీ–3లో విధులు బహిష్కరించిన ఉద్యోగులు

**గోదావరిఖని:** సింగరేణి ఓపెన్‌కాస్టు గని కార్మికుల మెరుపు సమ్మె జటిలంగా మారుతోంది. ఎలాంటి సమాచారం లేకుండా కార్మికుల జీతాల్లో 50 శాతం కోత విధించడాన్ని నిరసిస్తూ అలాగే కరోనా వైరస్ నుంచి రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆర్జీ–2 ఏరియాలో ఓసీపీ–3 (ఓపెన్‌కాస్ట్‌మైన్) గనిలో గురువారం ప్రారంభమైన మెరుపు సమ్మె శుక్రవారం సంస్థ మొత్తం విస్తరించింది. ఓసీపీల్లో సుమారు 10 వేల మంది కార్మికులు పనిచేస్తుండగా సగానికి పైగా ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన బాట పట్టారు. బొగ్గు ఉత్పత్తిలో ప్రధాన భూమిక పోషించే ఈపీ ఆపరేటర్లు ఆందోళనలో పాలుపంచుకుంటున్నారు. దీంతో ఉత్పత్తికి ఆటంకం కలుగుతోంది. శుక్రవారం ఉదయం విధులకు వచ్చిన ఈపీ ఆపరేటర్లు జీతాల విషయమై అధికారులను ప్రశ్నించగా, ఉన్నతస్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయంపై తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేయడంతో ఈపీ ఆపరేటర్లు విధులకు హాజరుకాకుండానే వెళ్లిపోయారు. మరో పక్క ఓసీపీ–1లో సింగరేణి కార్మికులు, అధికారుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర కమిటీ నాయకుడు వైవీ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆపరేటర్లందరూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఆందోళనకు దిగారు. పరిస్థితిని గమనించిన పోలీసులు వైవీ రావును వదిలిపెట్టారు. దీనిపై అన్ని ఓసీపీల కార్మికులు మండిపడుతున్నారు. రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో కొన్ని ఓసీపీల్లో పాక్షికంగా పనులు కొనసాగుతుండగా, మరి కొన్ని ఓసీపీల్లో పూర్తిగా పనులు నిలిచిపోయాయి. లేఆఫ్‌తో ఇప్పటికే భూగర్భ గనులు నిలిచిపోగా, జీతాల కోత నేపథ్యంలో ఓసీపీల్లో ఉత్పత్తి తగ్గింది. దీనివల్ల మొత్తం సంస్థపై ప్రభావం పడుతోంది. కాగా, మార్చి నెల వేతనాలను ఇవ్వడం లేదని, అలాగే కరోనా వైరస్ నుంచి రక్షణకు చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు చెబుతున్నారు. యాజమాన్యం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని అంటున్నారు.

**రూ. 15 వేలకు తగ్గకుండా వేతనాల చెల్లింపు**

కరోనా వైరస్ కారణంగా తలెత్తిన పరిస్థితుల దృష్ట్యా సింగరేణిలో ఉద్యోగులకు మార్చి నెలకు సంబంధించి సగం వేతనాన్ని మాత్రమే చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించిందని సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే దీని వల్ల ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో నిర్ణయాన్ని పునఃసమీక్షించి ఒక్కో ఉద్యోగికి కనీసం రూ.15 వేలకు తగ్గకుండా వేతనాలను చెల్లించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మార్చి నెల జీతం చెల్లింపుపై 50 శాతం కోత ఆదేశాలను యథాతథంగా అమలు చేస్తే 13,650 మంది ఉద్యోగులకు రూ.15 వేల కన్నా తక్కువ జీతం వచ్చే అవకాశం ఉన్నట్లుగా గుర్తించామని పేర్కొన్నారు. దీంతో కొన్ని సవరణలతో రూ.15 వేలకన్నా తక్కువ కాకుండా చెల్లింపులు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కాగా మార్చి నెలలో ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు పూర్తి వేతనం చెల్లిస్తామని వివరించారు. కార్మిక సంఘాలు, కార్మికుల విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వేతనాలను శనివారం ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని ఆయన వెల్లడించారు. ఆపిన జీతాన్ని పరిస్థితులు కుదుటపడిన వెంటనే చెల్లిస్తామని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి విరాళంగా ప్రకటించిన ఒక్కరోజు వేతనాన్ని మార్చి జీతం నుంచి కోత పెట్టడం లేదని వెల్లడించారు.

## ఉచితంగా సాధ్యమేనా?

- కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలపై హైకోర్టు
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 6కి వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలు ఏమిటో తెలియచేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒకవేళ పరీక్షలను ఉచితంగా చేయడం సాధ్యం కాదంటే, ఎందుకు సాధ్యం కాదో వివరించాలని పేర్కొంది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌లు ఉత్తర్వులు జారీ చేశారు. కరోనా నిర్ధారణ పరీక్ష కోసం ప్రైవేటు ల్యాబొరేటరీలు రూ.4,500 వసూలు చేస్తున్నాయని తెలుపుతూ న్యాయవాది పి.తిరుమలరావు హైకోర్టుకు లేఖ రాశారు. ఈ లేఖను హైకోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా పరిగణించింది. ఈ వ్యాజ్యంపై శుక్రవారం జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు నేతృత్వంలోని ధర్మాసనం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరిపింది. ఈ సందర్భంగా తిరుమలరావు వాదనలు వినిపిస్తూ.. ప్రైవేటు ఆసుపత్రుల్లో కరోనా పరీక్షలకు కేంద్రం అనుమతి ఇచ్చిందని తెలిపారు. అయితే ప్రైవేటు ల్యాబొరేటరీలు ఈ పరీక్ష కోసం రూ.4,500 వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ఇది సబబు కాదని తెలిపారు. ఐసీఎంఆర్ రూ.1,200లకు చేస్తున్న పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లు రూ.4,500 వసూలు చేస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. సీసీఎంబీ, గాంధీ, నిమ్స్ ఆసుపత్రుల్లో ఉచితంగా కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే కరోనా అనుమానితులను అక్కడే ఉంచి చికిత్స అందిస్తున్నామే కానీ ప్రైవేటు ఆసుపత్రులకు పంపడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ ఎన్.రాజేశ్వరరావు వాదనలు వినిపిస్తూ.. ప్రైవేటు ఆసుపత్రులు ఎంతెంత వసూలు చేస్తున్నాయన్న విషయం తెలియదని, గడువునిస్తే పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచుతానని వివరించారు. అందరి వాదనలు విన్న ధర్మాసనం.. కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేసేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ఆ వివరాలను అఫిడవిట్ రూపంలో తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇదిలా ఉంటే క్వారంటైన్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మరో ధర్మాసనానికి పంపాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది.

## గ్రామమంతా కరెంట్‌షాక్

**వర్గల్(గజ్వేల్):** సిద్దిపేట జిల్లాలో 11 కేవీ లైన్ తీగలు ఎల్‌టీ లైన్‌పై పడడంతో ఓ ఊరంతా కరెంట్ షాక్‌కు గురైంది. గురువారం అర్ధరాత్రి వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. 10 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇన్సులేటర్ పేలిపోవడంతో 11 కేవీ లైన్ తీగలు తెగి ఎల్‌టీ లైన్ మీద పడ్డాయి. దీంతో 15 విద్యుత్ స్తంభాల పొడవునా కరెంటు తీగలకు మంటలు చెలరేగి ఊరంతా విద్యుత్ షాక్‌కు గురైంది. ఈ ప్రమాదంలో ఓ బాలుడు కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోగా, పలు ఇళ్లలో విద్యుత్ మీటర్లు, గృహోపకరణాలు, ఫ్యాన్లు, టీవీలు కాలిపోయాయి. శుక్రవారం ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాసాచారి, ఏడీ ఈ శ్రీనివాస్‌రావు, ఏఈ వేణుగోపాలాచార్యులు గ్రామాన్ని సందర్శించారు.



# సేకరిస్తే కొత్త చరితే!

**రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అడుగులు..**

**ఏడు వేల కొనుగోలు కేంద్రాలు**

**గతంతో పోలిస్తే రెట్టింపు కానున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర చరిత్రలోనే గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఈ యాసంగి సీజన్‌లో ధాన్యం రాశులు మార్కెట్లకు పోటెత్తనున్నాయి. సీఎం కె.చంద్రశేఖర్‌రావు చెబుతున్న దాని ప్రకారమే కోటి మెట్రిక్ టన్నుల మేర ధాన్యం సీజన్‌లో మార్కెట్లకు రానుంది. ప్రతి గింజనూ కొనుగోలు చేసేలా ఏడు వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. ఏప్రిల్ రెండో వారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సేకరణ ఆరంభించేలా ఏర్పాట్లు చేస్తోంది.

**ఎన్నడూ లేనంత..**

రాష్ట్రంలో ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటి విడుదల గణనీయంగా పెరగడంతో యాసంగిలో అన్ని ప్రధాన ప్రాజెక్టుల కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించారు. నాగార్జునసాగర్ కిందే 6.40 లక్షల ఎకరాలు, ఎస్సారెస్పీ రెండు స్టేజీల కింద కలిపి 10 లక్షల ఎకరాలు, పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల కింద 4 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరివ్వడంతో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతేడాది యాసంగిలో 18.57 లక్షల ఎకరాలలో వరి సాగు జరగ్గా, అది ఈ ఏడాది ఏకంగా 40 లక్షల ఎకరాలకు పెరిగింది. దీంతో ధాన్యం దిగుబడులు భారీగా ఉండనున్నాయి. ఎకరాకు 27 నుంచి 28 క్వింటాళ్ల ధాన్యం వచ్చినా కనీసంగా కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉంటుందని పౌర సరఫరాల శాఖ, వ్యవసాయ శాఖలు అంచనా వేశాయి. గతేడాది యాసంగిలో మొత్తంగా ధాన్యం సేకరణ 37లక్షల మెట్రిక్ టన్నులు కాగా, మొన్నటి ఖరీఫ్‌లో 3,670 కేంద్రాల ద్వారా 47.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేశారు. ఈ సేకరణకు రూ.8,626 కోట్లు వెచ్చించారు. ఈ స్థాయి సేకరణే ఇప్పటి దాకా రికార్డు కాగా ఈ సీజన్‌లో ఏకంగా కోటి టన్నులు సేకరించాల్సి ఉంది. వీటికి ఏకంగా ఏడు వేలకు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

**ధాన్యం సేకరణకు రూ.25 వేల కోట్లు**

గ్రేడ్–1 రకానికి రూ.1,835, కామన్ రకానికి రూ.1,815 చెల్లించనున్నారు. ఈ ధాన్యం సేకరణకు రూ.25వేల కోట్లను ప్రభుత్వం సమకూర్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు రాకుండా తేమ కొలిచే, తూనికల యంత్రాలు, టార్పాలిన్లు, గోనె సంచులు సమకూర్చే పనిలో పడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో 35 నుంచి 40లక్షల మెట్రిక్ టన్నులకు సరిపడ మాత్రమే గోనె సంచులు ఉండగా, మిగిలివాటిని పశ్చిమ బెంగాల్ నుంచి తెప్పించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అది కుదరని పక్షంలో పాలిమర్ సంచుల ద్వారా సేకరణ చేయనున్నారు. ఇక సేకరించిన ధాన్యానికి నిల్వల సమస్య రాకుండా ఎప్పటికప్పుడు మిల్లింగ్ కేంద్రాలకు తరలించనున్నారు. ఒకవేళ ఎక్కువ వచ్చిన సందర్భాల్లో పాఠశాలలు, కమ్యూనిటీ కేంద్రాల్లో నిల్వ చేసేందుకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు.

# ఉమ్మడి వరంగల్‌లో హై అలర్ట్

- 27 మందికి 'పాజిటివ్'!
- ఇప్పటి వరకు ఏడుగురిపై ప్రకటన
- మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారి ద్వారానే కరోనా వ్యాప్తి

**సాక్షి ప్రతినిధి, వరంగల్ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు రోజుల వ్యవధిలో 27 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో నాలుగు కేసుల వివరాలను గురువారం అధికారులు వెల్లడించగా, శుక్రవారం మరో మూడు పాజిటివ్ కేసులపై స్పష్టత ఇచ్చారు. కరోనా పాజిటివ్‌గా ధ్రువీకరించిన కేసులే కాకుండా మిగతా కేసుల్లోనూ ఢిల్లీ తబ్లిగీ జమాత్ సమావేశాల్లో పాల్గొని వచ్చినవారే ఎక్కువగా ఉన్నారు. కాగా, వీరితో సంబంధం ఉన్న సుమారు 321 మందికి వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయా వ్యక్తుల శాంపిల్స్‌ను పుణేకు పంపించిన అధికారులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 27 మందికి కరోనా పాజిటివ్ రావడంతో ఢిల్లీలో తబ్లిగీ జమాత్ సమావేశాలకు హాజరైన వాళ్లతోపాటు వారితో కలసి తిరిగిన 321 మందిని అధికారులు క్వారంటైన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా ఉమ్మడి జిల్లాలో నమోదైన పాజిటివ్ కేసుల్లో మొత్తం 'మర్కజ్'తో సంబంధం ఉందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు వారి కుటుంబ సభ్యులు, బంధువులకు సైతం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా కరోనా వైరస్ వేగంగా విజృంభిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగాం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే ఉన్న బలగాలకు తోడు అదనంగా సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. సుమారు రెండు వేల మందిని బందోబస్తుకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ 14 వరకూ వీరంతా వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలో బందోబస్తు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. కరోనా వ్యాప్తి కట్టడికి వరంగల్ అర్బన్ జిల్లాలో విస్తృత చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ నగరంలోని రంగంపేట, చార్ బౌళిలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ రవీందర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ పమేలా సత్పతి పర్యటించారు. కేసులు లేవని అనుకుంటున్న తరుణంలో మర్కజ్ ఘటన ఒక్కసారిగా ఉలికిపాటుకు గురి చేసింది.

## ఆసుపత్రుల్లో ప్రజలకు ఓపీ సేవలందించాలి: సీపీఎం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలను పునరుద్ధరించి, అత్యవసర కేసుల్లో ఆపరేషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కరోనాకు వైద్యం అందించేందుకు మొదట ముఖ్యమైన ఆసుపత్రుల్లో ఓపీ సేవలను నిలిపివేసి, ఆ తర్వాత మొదలెడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా.. ఓపీ సేవలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నట్టు ఓ ప్రకటనలో పేర్కొంది.

**సింగరేణిలో సమ్మెను నివారించాలి**

సింగరేణి కాలరీస్ యాజమాన్యం చేస్తున్న అప్రజాస్వామిక చర్యలను సరిదిద్ది కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని, వారు సమ్మెలోకి వెళ్లకుండా చూడాలని సీఎం కేసీఆర్‌కు సీపీఎం విజ్ఞప్తి చేసింది. సింగరేణి మేనేజ్‌మెంట్ తీసుకుంటున్న చర్యలు వివాదాస్పదం అవుతున్నందున వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని సీఎంకు రాసిన లేఖలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు.

## పేదల బియ్యానికి.. 'సర్వర్' కష్టాలు

- బయోమెట్రిక్‌లు పనిచేయక సరఫరాకు ఆటంకం..
- మధ్యాహ్నానికి పరిష్కారం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని పేద కుటుంబాలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యానికి సర్వర్‌ల మొరాయింపు ఆటంకంగా మారింది. పన్నెండు కిలోల ఉచిత బియ్యం తీసుకునేందుకు పెద్ద ఎత్తున లబ్ధిదారులు పోటెత్తడంతో సర్వర్ డౌన్ అయ్యింది. దీంతో బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయక శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ఉదయం ఆరు గంటల నుంచే క్యూ లైన్లలో నిలబడ్డ లబ్ధిదారులు నానా అవస్థలు పడ్డారు.

**పెరిగిన రద్దీ వల్లే..**

సాధారణ రోజుల్లో ప్రతి రోజూ రెండు నుంచి మూడు లక్షల మంది రేషన్ తీసుకుంటూ ఉండగా, ఏప్రిల్ ఒకటి, రెండు తేదీల్లో ఏకంగా రోజుకు 7లక్షల వంతున 14లక్షల మంది 55,561 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకున్నారు. శుక్రవారం సైతం మధ్యాహ్నానికే 4లక్షల మందికి పైగా బియ్యం తీసుకునేందుకు రావడంతో సర్వర్‌లో సమస్య ఎదురైంది. దీంతో స్టేట్ డేటా సెంటర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తి సర్వర్ డౌన్ అయింది. దీంతో ఎక్కడికక్కడ బియ్యం పంపిణీ నిలిచిపోయింది.అప్పటికే రాష్ట్రం నలుమూలల నుంచి ఫిర్యాదులు రావడంతో అప్రమత్తమైన పౌర సరఫరాల శాఖ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్‌తో మాట్లాడారు. హుటాహుటిన సర్వర్ సమస్యను పరిష్కరించారు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత రేషన్ పంపిణీ మొదలవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, రాష్ట్రంలోని 2.80 కోట్ల లబ్ధిదారులందరికీ బియ్యం పంపిణీ చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి లబ్ధిదారునికి బియ్యం అందించే బాధ్యత ప్రభుత్వానిదని తెలిపారు. అంతా ఒకేసారి రావడంతో సమస్య తలెత్తిందని, దాన్ని పరిష్కరించామన్నారు.

# 9 గంటలకు 9 నిమిషాలపాటు



## దీపాలు వెలిగించండి • కరోనా చీకట్లను తరిమికొడదామని ప్రధాని పిలుపు

**సాక్షి, న్యూఢిల్లీ :** కరోనా చీకట్లను తరిమికొట్టడానికి దేశమంతా ఒక్కటై సంకల్ప బలాన్ని ప్రదర్శించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 5 ఆదివారం రాత్రి 9 గంటలకు ఇళ్లలో లైట్లు అన్ని ఆర్పేసి దీపాలు, కొవ్వొత్తులు, టార్చిలైట్లు, మొబైల్‌లలో ఫ్లాష్ లైట్లు తొమ్మిది నిమిషాల సేపు వెలిగించాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఒక వీడియో సందేశంలో ప్రధాని దాదాపుగా 11 నిమిషాల సేపు మాట్లాడారు. ప్రధాని ప్రసంగం ఆయన మాటల్లోనే....

కరోనా మహమ్మారిపై పోరాటంలో భాగంగా దేశవ్యాప్త దిగ్బంధం ప్రకటించి ఇవాళ్టికి 9 రోజులు గడిచాయి. ఈ తొమ్మిది రోజులలో మీరు ప్రదర్శించిన క్రమశిక్షణ, సేవాస్ఫూర్తి అపూర్వమైనవి. కరోనా వైరస్‌పై యుద్ధంలో అహర్నిశలు శక్తియుక్తులు ధారపోస్తున్నవారికి మార్చి 22న చప్పట్లు, గంటలు కొట్టడం ద్వారా చూపించిన కృతజ్ఞత విధానం ఇప్పుడు అన్ని దేశాలకు ఆదర్శప్రాయమైంది. ఈ పరీక్షా సమయంలో జాతి సమష్టి శక్తిని అందరికీ చాటాము. దేశంలో కోట్లాది ప్రజలు ఇళ్లకే పరిమితమైన ఈ సమయంలో తాము ఒక్కరమే ఏం చేయగలం అన్న ప్రశ్న వస్తుంది. ఆ ఒంటరి భావాన్ని పోగొట్టడం ఎంతో అవసరం. దేశంలో 130 కోట్ల మంది మనకి తోడుగా ఉన్నారని సంఘీభావాన్ని చాటి చెబుదాం. మన దేశంలో 'అహం బ్రహ్మోస్మి'అనే భావన అనాదిగా ఉన్నదే. అందువల్ల దేశం ఇంత భారీ యుద్ధం చేస్తున్నవేళ, ఎప్పటికప్పుడు ఈ అద్భుత సమైక్య శక్తి ప్రజల రూపంలో ప్రస్ఫుటం అవుతున్నదిగా అనుభూతి చెందాలి. ఈ భావనే మనలో ఆత్మస్థైరాన్ని నింపి సామూహిక లక్ష్యం వైపు అడుగులు పడేలా చేస్తుంది. కరోనా కారు చీకట్ల నుంచి కాంతి రేఖ కనపడుతుందన్న ఆశాభావంతో మనమంతా నిరంతరం ముందుకు సాగాలి. నిరాశా నిస్పృహలతో ఉన్న కరోనా వ్యాధిగ్రస్తుల్ని బయటకు తీసుకురావాలి. ఈ ఆదివారం అంటే– ఏప్రిల్ 5వ తేదీన రాత్రి 9 గంటలకు.. మీ ఇళ్లలో ప్రవేశద్వారాల వద్ద, బాల్కనీలలో– వెలిగించిన కొవ్వొత్తులు లేదా దీపపు ప్రమిదలతో టార్చ్‌లు లేదా మొబైల్ ఫ్లాష్ లైట్లను పట్టుకొని 9 నిమిషాలపాటు నిలబడండి. ఆ సమయంలో మీ ఇళ్లలోని అన్ని విద్యుద్దీపాలనూ ఆర్పివేయండి. అలా మనం అన్నివైపుల నుంచీ ఒక్కొక్క దీపంతో నిలబడినపుడు ఏ సామూహిక లక్ష్యం కోసమైతే మనం పోరాడుతున్నామో, ఆ పోరాటంలో మనం ఒంటరి కామని చెప్పుకుంటూ సామూహిక లక్ష్య సాధనకు సంకల్పం చెప్పుకుందాం. ఈ సంక్షోభ సమయంలో ఒకరికొకరం ఉన్నామనే భావన వెయ్యి ఏనుగుల బలం కలిగిస్తుంది. మనలో ఉండే ఉత్సాహానికి మించిన శక్తి ఏదీ ఈ విశ్వంలో లేదు. ఈ సందర్భంగా అందరికీ ఒక మనవి చేస్తున్నాను. వెలుగును ప్రసరింపజేసే ఈ కార్యక్రమంలో అందరూ తప్పనిసరిగా భౌతిక దూరం పాటించండి. లక్ష్మణరేఖని దాటవద్దు. కరోనా వైరస్ గొలుసుకట్టు వ్యాప్తిని విచ్ఛిన్నం చేయగల పాశుపతాస్త్రం ఇదే . వైరస్‌ను పారద్రోలి భరతమాతను విజయపథంలో నిలబెడదాం' అని ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

కాగా, దీపాలు వెలిగించాలన్న ప్రధాని సందేశంపై కాంగ్రెస్ విరుచుకుపడింది. కరోనా బాధితులకు వైద్యం, ఉపాధి లేని వారికి ఆహారం అందించడం, ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కే చర్యలు వంటివాటిపై మాట్లాడతారని ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలిందని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా అన్నారు.

# విదేశీ 'తబ్లిగీ'లపై చర్యలు

## భారత్‌లో ఉన్న వారిని ఇప్పుడే వెనక్కు పంపించం • కేంద్ర హోం శాఖ స్పష్టీకరణ

### వైద్య సిబ్బందిపై దాడులు చేస్తున్నవారిపై ఎన్‌ఎస్‌ఏ కింద కేసులు

**న్యూఢిల్లీ/ఘజియాబాద్:** బ్లాక్ లిస్ట్‌లో చేర్చి, టూరిస్ట్ వీసాలను రద్దు చేసిన 960 మంది తబ్లిగీ జమాత్‌కు చెందిన విదేశీ కార్యకర్తల్లో నలుగురు అమెరికన్లు, తొమ్మిది మంది బ్రిటిషర్లు, ఆరుగురు చైనీయులు ఉన్నారని కేంద్ర హోం శాఖ శుక్రవారం వెల్లడించింది. వారితో పాటు, ప్రస్తుతం భారత్‌లోని పలు రాష్ట్రాల్లో ఉన్న తబ్లిగీ విదేశీ కార్యకర్తల్లో 379 మంది ఇండోనేసియన్లు, 110 మంది బంగ్లాదేశీయులు, 63 మంది మయన్మార్ వారు, 33 మంది శ్రీలంక వారు ఉన్నారని పేర్కొంది. కిర్గిస్తాన్(77), మలేసియా(75), థాయిలాండ్(65), ఇరాన్(24), వియత్నాం(12), సౌదీ అరేబియా(9), ఫ్రాన్స్(3)లకు చెందిన విదేశీ తబ్లిగీ కార్యకర్తల వీసాలను కూడా రద్దు చేశామంది. ఆ 960 మందిలో కజకిస్తాన్, కెన్యా, మడగాస్కర్, మాలి, ఫిలిప్పైన్స్, ఖతార్, రష్యా తదితర దేశాల వారు కూడా ఉన్నారని తెలిపింది. టూరిస్ట్ వీసాపై వచ్చిన వీరిని ఇప్పుడు ఆయా దేశాలకు తిరిగి పంపే ఆలోచన లేదని, వారిపై ఫారినర్స్ యాక్ట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్‌ల కింద వీసా నిబంధనలను ఉల్లంఘించిన నేరాల కింద చర్యలు తీసుకోనున్నామని హోంశాఖ జాయింట్ సెక్రటరీ పుణ్య సలిల శ్రీవాస్తవ స్పష్టం చేశారు. 'వారిపై చర్యలు ప్రారంభమైన ప్రస్తుత సమయంలో వారిని వెనక్కు పంపే ప్రశ్నే లేదు. ఎప్పుడు పంపిస్తామన్నది నిబంధనలకు లోబడి నిర్ణయిస్తాం' అన్నారు. తబ్లిగీ జమాత్ కార్యక్రమాల్లో పాల్గొని తమ దేశాలకు వెళ్లిన 360 మంది విదేశీయులను బ్లాక్ లిస్ట్ చేసే కార్యక్రమం ప్రారంభించామని వెల్లడించింది. వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించామని శ్రీవాస్తవ తెలిపారు. కరోనా వైరస్‌కు సంబంధించి కొత్తగా 1930 అనే టోల్‌ఫ్రీ నెంబర్‌ను కూడా ప్రారంభించామన్నారు. కేంద్ర హోంశాఖ వెబ్‌సైట్లో రాష్ట్రాల హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా ఉన్నాయన్నారు.



నిజాముద్దీన్ మసీదులోని ప్రచారకులను క్వారంటైన్‌కు తరలిస్తున్న దృశ్యం

- కరోనా, లాక్‌డౌన్‌కు సంబంధించి ఢిల్లీ ప్రజలు తమ సమస్యలు తెలిపేందుకు వాట్సాప్ హెల్ప్‌లైన్ నెంబర్ 8800007722ని ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు శుక్రవారం రాజస్తాన్‌లోని టోంక్ జిల్లాలో పర్యటించారు. కరోనా వ్యాప్తిపై సర్వే నిర్వహించారు.

### యూపీలో నర్సులపై వెకిలి వేషాలు

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఒక ఆసుపత్రిలో నర్సులపై తప్పుగా ప్రవర్తించిన ఆరుగురు తబ్లిగీ జమాత్ సభ్యులపై రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎస్ఏ కింద కేసు నమోదు చేసింది. వారిపై ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కూడా కేసు పెట్టారు. నర్సులపై అభ్యంతర కర వ్యాఖ్యలు చేసినట్లు వారిపై అభియోగాలు నమోదయ్యాయి. ప్యాంటు వేసుకోకుండా ఆసుపత్రుల్లో తిరిగారని, వెకిలి వ్యాఖ్యలు చేస్తూ, బూతు పాటలు పాడుతూ, వెకిలి చర్యలకు పాల్పడ్డారని, భౌతిక దూరం పాటించలేదని, తామిచ్చే ఔషధాలను తీసుకునేందుకు నిరాకరించారని ఆ ఆరుగురిపై నర్సులు ఫిర్యాదు చేశారు. దేశ భద్రతకు, శాంతి భద్రతలకు ప్రమాదమని భావిస్తే ఎన్ఎస్ఏ కింద ఎవరినైనా ఎలాంటి అభియోగాలు లేకుండానే, సంవత్సరం పాటు నిర్బంధంలోకి తీసుకోవచ్చు. కనౌజ్‌లోని జామామసీదులో శుక్రవారం ప్రార్థనలు చేసేందుకు గుమికూడటాన్ని నిరోధించేందుకు ప్రయత్నించిన పోలీసులపై పలువురు దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి.

- మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో కోవిడ్–19 బాధితుల కుటుంబసభ్యులు, ఇరుగుపొరుగును క్వారంటైన్ చేసేందుకు వెళ్లిన వైద్య సిబ్బందిపై దాడి చేసిన నలుగురిపై జాతీయ భద్రత చట్టం(ఎన్ఎస్ఏ) కింద కేసు నమోదు చేశారు.

### కోవిడ్‌పై పోరుకు ఆ ఘటనలతో విఘాతం

ఆనంద్ విహార్ వద్ద భారీ సంఖ్యలో వలస కార్మికులు గుమికూడటం, నిజాముద్దీన్‌లో జరిగిన తబ్లిగీ జమాత్ యావత్ దేశం కరోనా కట్టడికి చేస్తోన్న ప్రయత్నాలకు విఘాతం కలిగించాయని రాష్ట్రపతి కోవింద్ పేర్కొన్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లతో రాష్ట్రపతి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.




## ఇంటి నుంచే జీఆర్‌ఈ, టోఫెల్

**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా విదేశీ విద్య కోసం నిర్వహించే జీఆర్‌ఈ, టోఫెల్ అర్హతా పరీక్షలను చైనా, ఇరాన్‌లో మినహా విద్యార్థులు ఇంటి నుంచే రాయవచ్చని ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్(ఈటీఎస్) వెల్లడించింది. పరీక్షా కేంద్రాల్లో నిర్వహించాల్సిన జీఆర్‌ఈ, టోఫెల్‌లను కోవిడ్ కారణంగా రద్దు చేశారు. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే పరిస్థితులు ఏర్పడే వరకూ ఇంటివద్దనుంచే పరీక్షలు రాసేందుకు అవకాశం ఇస్తున్నట్లు టోఫెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీకాంత్ గోపాల్ వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి, ప్రోక్టర్ యూ అనే రిమోట్ పద్ధతుల ద్వారా పరీక్షలను పర్యవేక్షిస్తామని తెలిపారు. జీఆర్‌ఈలో జవాబు పత్రాన్ని తిరిగి సరిచేసుకునే అవకాశమూ, టోఫెల్‌లో రీడింగ్, లిజనింగ్ స్కోర్ తెలుసుకునే అవకాశం ఉంటుంది. జూన్‌లో రాసే పరీక్షలకు రిజస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది.

### జన్‌ధన్ అకౌంట్లకు రూ.500 చొప్పన బదిలీ

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన పేద మహిళలకు కోవిడ్ రిలీఫ్ ప్యాకేజ్‌లో భాగంగా శుక్రవారం 4.07 కోట్ల మంది మహిళల జన్ ధన్ ఖాతాలకు తొలివిడతగా రూ.500 చొప్పున బదిలీ చేసినట్టు గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఏప్రిల్ మొదటివారాంతానికి 20.39 కోట్ల మంది మహిళల జన్‌ధన్ ఖాతాలకు చేరుతుంది.

### లాక్‌డౌన్ పాటించని తండ్రిపై కొడుకు ఫిర్యాదు

**సాక్షి, న్యూఢిల్లీ:** తన తండ్రి లాక్‌డౌన్ ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నాడంటూ ఓ కొడుకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లాక్‌డౌన్ అమలులో ఉన్నప్పటికీ అలవాటు ప్రకారం రోజూ ఉదయాన్నే తన తండ్రి(59) ఇంటి నుంచి బయటకు వెళ్తున్నారంటూ ఢిల్లీలోని వసంత్‌కుంజ్ పోలీసులకు వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు తండ్రిపై కేసు నమోదు చేశారు.

### విధులకు గైర్హాజరైన వైద్యసిబ్బందిపై వేటు

**పాండిచ్చేరి:** పాండిచ్చేరి ప్రభుత్వ ఇందిరాగాంధీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని కోవిడ్ విభాగానికి కేటాయించిన 54 మంది వైద్య సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. ఈ నెల 2వ తేదీన విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినందుకు ఈ చర్యలు చేపట్టినట్టు జిల్లా కలెక్టర్ టి.అరుణ్ వెల్లడించారు.

### భారత్‌కు ప్రపంచ బ్యాంక్ సాయం

**వాషింగ్టన్:** కరోనా మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రపంచ బ్యాంక్ భారత్‌కు 1 బిలియన్ డాలర్లు అత్యవసర సాయంగా ఇవ్వనుంది. దాదాపు 25 దేశాలకు 1.9 బిలియన్ డాలర్లను ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంక్ ముందుకు వచ్చింది. అందులో సింహభాగం భారత్ కే ఇవ్వడం గమనార్హం.

### వ్యవసాయ కార్యకలాపాలు సజావుగా సాగాలి

**న్యూఢిల్లీ:** వ్యవసాయ కార్యకలాపాలు కోవిడ్ లాక్‌డౌన్‌లో భాగం కాదనీ, దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్యకలాపాలకు భంగం వాటిల్లకుండా జాగ్రత్తలు చేపట్టాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. రైతుల వ్యవసాయ కార్యకలాపాలనూ, వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్ళను లాక్‌డౌన్ నుంచి మినహాయించినట్లు రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాలకు తెలిపింది.

### దివ్యాంగ బాలుడి విరాళం

**జైపూర్/బారైచ్:** రాజస్తాన్కు చెందిన దివ్యాంగ బాలుడు హృదయేశ్వర్ సింగ్ భాటి (17) ప్రధానమంత్రి కేర్ (పీఎం కేర్)కు రూ.2 లక్షలు విరాళం ఇచ్చాడు. వీల్ చైర్ లో ఉంటూనే 7 ఆవిష్కరణలకు మూలకర్తగా నిలిచిన ఈ బాలుడు రెండు జాతీయ అవార్డులు అందుకున్నాడు. జాతీయ అవార్డుల ద్వారా వచ్చిన డబ్బును పీఎం కేర్‌కు అందిస్తున్నట్లు తెలిపాడు.

### పిగ్గీ బాంక్ సేవింగ్స్ ఇచ్చిన చిన్నారులు

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గౌరవ్ అరోరా కుమార్తెలు మైశా అరోరా (6), అలియా అరోరా (10)లు తాము దాచుకున్న పిగ్గీ సేవింగ్స్ నుంచి చెరో రూ. 5 వేలు ప్రధాన మంత్రి కేర్‌కు విరాళం ఇచ్చారు.

### మందు తాగడం జీవన విధానం: బీజేపీ నేత

**షిల్లాంగ్:** మందు తాగడం రాష్ట్ర జీవన విధానంలో భాగమని, అందుకు వైన్ షాపులను తెరిచేందుకు అనుమతి ఇవ్వాలంటూ మేఘాలయ బీజేపీ చీఫ్ ఎర్నెస్ట్ మారీ రాష్ట్ర సీఎం కొన్రాడ్ కె. సంగ్మాకు శుక్రవారం లేఖ రాశారు. ఎర్నెస్ట్ ప్రస్తుతం ఖాసీ హిల్స్ వైన్ డీలర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ కు సెక్రటరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజినీరు & ప్రాజెక్టు పాలనాధికారి, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్-2, ఖమ్మం
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
సంఖ్య మరియు తేదీ: ఎన్.ఐ.టి.నం. 01 నుండి 04/2020-21, తేదీ: 01.04.2020, పని పేరు: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని సత్తుపల్లి ట్రంక్ ప్యాకేజ్ నెం.9, 10, 11 మరియు 12, అంచనా విలువ (రూ.కోట్లలో) ప్యాకేజ్ నెం.9- 357.72, ప్యాకేజ్ నెం.10- 346.97, ప్యాకేజ్ నెం.11- 245.06, ప్యాకేజ్ నెం.12- 288.31, టెండర్లు స్వీకరించు చివరి తేదీ మరియు సమయం: 22.04.2020, సాయంత్రం 5.00 గంటల వరకు. ఎన్.ఐ.టి. నం.05/2020-21, తేదీ: 01.04.2020, పని పేరు: సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్ట్ నిర్మించుట- అమ్మగారిపల్లి (గ్రా), అశ్వాపురం (మం), భద్రాద్రి కొత్తగూడెం (జి). అంచనా విలువ (రూ.కోట్లలో): 2632.76, టెండర్లు స్వీకరించు చివరి తేదీ మరియు సమయం: 22.04.2020 సాయంత్రం 5.00 గంటల వరకు. మిగతా వివరముల కొరకు https://tender.telangana.gov.in/ "ఇ"-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ చూడగలరు.
సం/-(పి.ఎ. వెంకటకృష్ణ) పర్యవేక్షక ఇంజినీరు & ప్రాజెక్టు పాలనాధికారి, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్-2, ఖమ్మం
DIPR RO.No.2731-DP/CL/Advt/1/2020-21, Dt: 03.04.2020

# కేసులు 3,041.. మరణాలు 90

## దేశవ్యాప్తంగా పెరుగుతున్న కరోనా బాధితులు • మహారాష్ట్రలో అత్యధికంగా కేసులు, మరణాలు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య శుక్రవారానికి 3041కి, మరణాల సంఖ్య 90కి చేరింది. రాష్ట్రాలవారీగా ప్రకటించిన గణాంకాల మేరకు శుక్రవారం ఒక్కరోజే 534 కొత్త కేసులు, 14 మరణాలు నమోదయ్యాయి. ఇప్పటివరకు మహారాష్ట్రలో అత్యధిక సంఖ్యలో మరణాలు చోటు చేసుకున్నాయి. ఇక్కడ కోవిడ్–19తో 26 మంది మరణించగా, గుజరాత్(8), మధ్యప్రదేశ్(6), పంజాబ్(5), ఢిల్లీ(6), కర్నాటక(3), పశ్చిమబెంగాల్(3), జమ్మూకశ్మీర్(2), ఉత్తరప్రదేశ్(2), కేరళ(2) తదితర రాష్ట్రాల్లోనూ మరణాలు చోటు చేసుకున్నాయి. అయితే, కేంద్రం పేర్కొంటున్న గణాంకాలకు, రాష్ట్రాలు ప్రకటిస్తున్న వివరాలకు మధ్య అంతరం ఉంటోంది. మహారాష్ట్రలో కేసుల సంఖ్య కూడా భారీగానే ఉంది. అక్కడ మొత్తం 490 కేసులు నమోదయ్యాయి. ఆ తరువాత స్థానంలో తమిళనాడు(411) ఉంది. ఢిల్లీలో శుక్రవారానికి కేసుల సంఖ్య 386కి చేరింది. వీటిలో శుక్రవారం ఒక్కరోజులోనే 93 కొత్త కేసులు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా 211 మంది కరోనా నుంచి కోలుకున్నారని శుక్రవారం సాయంత్రం కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. కరోనా బాధితుల్లో 55 మంది విదేశీయులున్నారని తెలిపింది. శుక్రవారం నాటికి ఉత్తరప్రదేశ్‌లో 172, తమిళనాడులో 309, రాజస్తాన్‌లో 167, కర్నాటకలో 124, మధ్యప్రదేశ్‌లో 104, గుజరాత్‌లో 95, జమ్మూకశ్మీర్లో 75, పశ్చిమబెంగాల్‌లో 63, బిహార్‌లో 29 కేసులు నమోదయ్యాయి. కాగా, కరోనా హాట్‌స్పాట్స్‌గా గుర్తించిన ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, అక్కడి అనుమానితులపై కరోనా నిర్ధారణ పరీక్షలు జరపడాన్ని వేగవంతం చేశారు. గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా నమోదైన కేసుల్లో 647 కేసులు ఢిల్లీలో జరిగిన తబ్లిగి జమాత్ మత కార్యక్రమంలో పాల్గొన్నవారికి సంబంధించినవేనని ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీ లవ్ అగర్వాల్ వెల్లడించారు.

### రాష్ట్రాలకు కేంద్రం 11 వేల కోట్ల నిధులు

**న్యూఢిల్లీ:** కరోనాను ఎదుర్కొనేందుకు కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యవసర నిధులను విడుదల చేసింది. రాష్ట్ర విపత్తు ప్రమాద నిర్వహణ నిధి (ఎస్డీఆర్ఎంఎఫ్) కింద రాష్ట్రాలకు 11,092 కోట్లు విడుదల చేసేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆమోదం తెలిపారు. ఎస్‌డీఆర్‌ఎంఎఫ్‌కు తొలి విడత కింద ఈ నిధులు విడుదల చేయనున్నట్టు పేర్కొంది. ఈ నిధులను క్వారంటైన్ కేంద్రాల ఏర్పాటు సహా ఇతర వ్యవహారాల కోసం ఉపయోగించుకోవచ్చని తెలిపింది. రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు అనంతరం ఈ నిధులు విడుదల చేయడం గమనార్హం.

## మాస్కులు, శానిటైజర్ల ధరలపై హెల్ప్‌లైన్

### సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం



**న్యూఢిల్లీ:** మాస్కులు, శానిటైజర్ల ధరల నియంత్రణకు జారీ చేసిన నోటిఫికేషన్ తు.చ. తప్పకుండా అమలయ్యేలా హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చి, వాటిపై ప్రచారం కల్పిస్తామని కేంద్రం తెలిపింది. కరోనా వ్యాప్తి నేపథ్యంలో దేశంలో మాస్కులు, శానిటైజర్ల ధరలను దుకాణదారులు భారీగా పెంచడంపై 'జస్టిస్ ఫర్ రైట్స్ ఫౌండేషన్'అనే ఎన్జీవో వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు, జస్టిస్ దీపక్ గుప్తాల ధర్మాసనం శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టింది. శానిటైజర్లు, లిక్విడ్ సోప్, మాస్కుల ధరల నియంత్రణకు జారీ చేసిన ఆదేశాలు అమలుకాని సందర్భాల్లో ప్రజలు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసేందుకు హెల్ప్‌లైన్ నంబర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా కేంద్రం తెలిపింది. అదేవిధంగా, పౌరులందరికీ కోవిడ్ పరీక్షలు ఉచితంగా జరిపించాలంటూ దాఖలైన పిల్, వలస కార్మికులకు కేంద్రమే వేతనం చెల్లించాలంటూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం కేంద్రం వివరణ కోరింది. రిసార్టులు, హోటళ్లను షెల్టర్లుగా మార్చి, వలస కార్మికులు సొంతూళ్లకు వెళ్లకుండా ఆశ్రయం కల్పించాలంటూ దాఖలైన మరో పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. కాగా, కోవిడ్ మహమ్మారిని కట్టడి చేసే వరకు 'పిల్‌లు వేయడమే పనిగా పెట్టుకున్న వారి'పై లాక్‌డౌన్ విధించాలని కేంద్రం వ్యాఖ్యానించింది. యావత్ అధికార యంత్రాంగం తమ శక్తియుక్తులను కరోనాపై పోరుకు ధారపోస్తున్న ఈ కష్ట సమయంలో, ఏసీ గదుల్లో కూర్చున్న కొందరు వేసే పిల్‌ల కారణంగా అధికారులు విలువైన సమయాన్ని వృథా చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది.

### ఆ వివరాలను బయట పెట్టనున్న గూగుల్

**పారిస్:** కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు టెక్ దిగ్గజం గూగుల్ ఆయా దేశాల ప్రభుత్వాలకు సహాయపడేందుకు సిద్ధమవుతోంది. గూగుల్ సాఫ్ట్‌వేర్ వాడుతున్న ఫోన్ల ద్వారా వినియోగదారులు ఎక్కువగా తిరుగుతున్న ప్రాంతాల సమాచారం సేకరించి, దాన్ని ఒక వెబ్‌సైట్ ద్వారా బయట పెట్టనున్నట్లు గూగుల్ మ్యాప్స్ అధినేత జెన్ ఫిడ్జ్ పాట్రిక్ తెలిపారు. దాదాపు 131 దేశాల్లోని వినియోగదారుల కదలికలకు సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్ లో ఉంచనున్నట్లు వెల్లడించారు. అయితే ఇదంతా కేవలం ఒక నిర్ణీత ప్రాంతానికి వచ్చిన వారి సంఖ్య కేవలం పర్సంటేజ్ రూపంలో మాత్రమే ఉంటుందని తెలిపారు. కచ్చితంగా ఎంత మంది వచ్చారనే సంఖ్య ఉండదని స్పష్టం చేశారు.


### రాజ్యసభ ఎన్నికలు మరిన్ని రోజులు వాయిదా

**సాక్షి, న్యూఢిల్లీ:** ఏప్రిల్ 9తో పదవీ కాలం పూర్తయిన రాజ్యసభ సభ్యుల స్థానాలకు నిర్వహించాల్సిన ద్వైవార్షిక ఎన్నికలను కరోనా వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 24న వాయిదావేస్తూ ప్రకటన జారీచేసిన సంగతి తెలిసిందే. దీనిపై మరోసారి సమీక్ష జరిపి ఇంకా కొన్ని రోజులు వాయిదా వేస్తున్నట్టు శుక్రవారం మరో ప్రకటన చేసింది. ఎన్నికల నిర్వహణ తేదీని తరువాత ప్రకటిస్తామని స్పష్టం చేసింది. మొత్తం 55 స్థానాలకు గాను 37 స్థానాల్లో పోటీ లేకుండా ఎన్నిక పూర్తయింది. కాగా మరో 18 స్థానాల్లో ఎన్నిక జరగాల్సి ఉంది.

# కరోనాపై కలసికట్టుగా పోరాడుదాం

- ఐక్యరాజ్య సమితి తీర్మానం
- దేశాలు పరస్పరం సహకరించుకోవాలని పిలుపు

**వాషింగ్టన్/మాడ్రిడ్/రోమ్/బ్రిటన్/జెనీవా:** ప్రపంచ జనాభాలో సగం మందికి పైగా ఇల్లు కదలడం లేదు. స్పెయిన్, అమెరికా, బ్రిటన్‌లో మృతుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. 188 దేశాల్లో కరోనా విస్తరించడంతో ప్రపంచమే చిగురుటాకులా వణికిపోతోంది. కేసుల సంఖ్య 10 లక్షల 50 వేలకి చేరువలో ఉంటే, మృతుల సంఖ్య 55 వేలు దాటేసింది. ఇలాంటి సంక్షోభ సమయంలో ప్రపంచదేశాలన్నీ ఏకతాటి పైకి వచ్చి కరోనాను తరిమికొట్టాలని ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ ఒక తీర్మానాన్ని రూపొందించింది. తీవ్రంగా ప్రాణనష్టం, ఆర్థిక నష్టం కలిగిస్తున్న కోవిడ్–19పై యూఎన్ తీర్మానాన్ని ఆమోదించడం ఇదే తొలిసారి. ''కోవిడ్–19 వ్యాధిపై పోరాటానికి ప్రపంచ దేశాల సంఘీభావం''అన్న పేరుతో రూపొందించిన ఈ తీర్మానంపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఇంకా చర్చించాల్సి ఉంది. ప్రపంచ ప్రజల ఆరోగ్యం, భద్రతపై ఐక్యరాజ్య సమితిలో 193 సభ్య దేశాలు తీవ్ర ఆందోళనతో ఉన్నాయని తీర్మానం పేర్కొంది. ఎక్కడివారక్కడే ఉండడంతో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలపై అసాధారణంగా చూపిస్తున్న ప్రభావం, చాలా మంది జీవనోపాధిని కోల్పోవడంతో వీటిపై అందరూ సమష్టిగా పోరాటం చేయాలని ఆ తీర్మానం పేర్కొంది. ఈ సంక్షోభ పరిస్థితుల్లో మానవ హక్కులు, ప్రజలు ఎదుర్కొనే ఒత్తిళ్లను గౌరవించాలని, ఎలాంటి వివక్షతావులేకుండా అన్ని దేశాలు పని చేయాలని పేర్కొంది.




వైద్యుల సేవలను ప్రస్తుతిస్తూ డెట్రాయిట్‌లోని సెయింట్ జాన్ హాస్పిటల్ వద్ద 'హీరోలు పనిచేస్తున్నారిక్కడ' అంటూ సైన్‌బోర్డు ఏర్పాటు చేశారు

### ట్రంప్‌కు కరోనా నెగెటివ్.. 15 నిమిషాల్లోనే ఫలితం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు రెండోసారి నిర్వహించిన కరోనా పరీక్షల్లో నెగెటివ్ రావడంతో వైట్ హౌస్ ఊపిరిపీల్చుకుంది. అత్యంత ఆధునిక కరోనా ర్యాపిడ్ పాయింట్ కిట్‌తో నిర్వహించిన ఈ వైద్య పరీక్షలో ఫలితం కేవలం 15 నిమిషాల్లోనే వచ్చిందని అధ్యక్షుడి వ్యక్తిగత వైద్యుడు సీన్ కోన్లీ చెప్పారు. శాంపిల్ కలెక్షన్‌కి ఒక్క నిమిషం పడితే మరో పావుగంటలోనే ఫలితం తేలిందన్నారు.

### నెలరోజులు ఇల్లు కదలొద్దు

అమెరికాలో కరోనా కేసులు పెరిగిపోతూ ఉండడంతో అధ్యక్షుడు ట్రంప్ అమెరికన్లందరూ మరో నాలుగు వారాలు ఇళ్లలోనే ఉండాలని పిలుపునిచ్చారు. భౌతిక దూరానికి మించిన పరిష్కార మార్గం లేదని అన్నారు. ''దేశ పౌరుల ప్రాణాలు కాపాడాలి. స్వీయ నియంత్రణ మీదే మన భవిష్యత్ ఆధారపడి ఉంది. భౌతిక దూరాన్ని పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఇల్లు కదలకుండా ఉండండి. మరో నెల రోజులు ఇలా చేస్తే మనం కరోనాపై యుద్ధంలో గెలుస్తాం. ప్రభుత్వ మార్గదర్శకాలన్నీ పాటించండి''అని ప్రజలకు ఆయన హితవు పలికారు అమెరికాలో కేసుల సంఖ్య 2 లక్షల 35వేలు దాటిపోగా, ఇప్పటివరకు 5,800 మంది ప్రాణాలు కోల్పోయారు.

### గాలి ద్వారా వ్యాపించదు

కరోనా వైరస్ గాలి ద్వారా వ్యాపించే అవకాశం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. కరోనా వ్యాధిగ్రస్తుడు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు బయటకు వచ్చే తుంపర్ల ద్వారా మాత్రమే ఈ వైరస్ సోకుతుందని తన తాజా మ్యాగజైన్లలో స్పష్టం చేసింది. ఈ తుంపర్లు ఏదైనా వస్తువులపై పడితే వాటినుంచి కూడా మనుషులకు సోకుతుందని తెలిపింది. ఇటీవల కాలంలో కరోనా వైరస్ గాలి ద్వారా కూడా వ్యాప్తి చెందుతుందని కొన్ని పరిశోధనలు తేటతెల్లం చేసిన నేపథ్యంలో డబ్ల్యూహెచ్‌ఓ ఈ విషయంపై వివరణ ఇచ్చింది. చైనాలో 75 వేల మంది కరోనా వ్యాధిగ్రస్తుల్ని పరిశీలించిన తర్వాత ఈ విషయంపై ఒక నిర్ధారణకు వచ్చినట్టు డబ్ల్యూహెచ్‌ఓ స్పష్టం చేసింది.

- బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ కరోనాతో ఇంకా బాధపడుతున్నారు. తనకు ఇంకా జ్వరం తగ్గలేదని అందుకే నిర్బంధంలోనే ఉన్నానని సోషల్ మీడియా వేదికగా జాన్సన్ వెల్లడించారు.
- కరోనా కోరల్లో చిక్కుకొని జర్మనీ విలవిల్లాడుతోంది. చైనాను మించిపోయేలా కేసులు నమోదయ్యాయి. ఒక్కరోజుల్లో 6 వేలకు పైగా కేసులు నమోదు కావడంతో మొత్తంగా కేసుల సంఖ్య 84 వేలు దాటేసింది. ఇక గురువారం ఒక్క రోజే 140 మంది మరణించారు.
- స్పెయిన్‌లో కరోనా మరణమృదంగం మోగిస్తోంది. గత 24 గంటల్లో 900 మందికిపైగా మరణించారు. అయితే కొత్త కేసుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టడం ఊరట కలిగించే అంశం
- కరోనా మృతుల్లో మొదటి స్థానంలో ఉన్న ఇటలీలో వైద్య రంగంపై తీవ్రమైన పని ఒత్తిడి పడింది. దీంతో 10 వేల మందికి పైగా వైద్య సిబ్బంది కరోనా బారిన పడ్డారు. దేశవ్యాప్తంగా 69 మంది డాక్టర్లు మరణించారు.
- కరోనా మృతులకు నివాళులర్పించడానికి దేశవ్యాప్తంగా శనివారం సంతాపదినంగా చైనా పాటించనుంది. వైరస్‌ను తొలిసారిగా గుర్తించి ప్రాణ త్యాగం చేసిన డాక్టర్ లీ సహా 3,300 మందికి పైగా మరణించారు. వీరి మృతికి నివాళులర్పించడానికి జాతీయ సంతాపం దినంగా పాటించనున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

# సాక్షి హాయ్... మీరేం చేస్తున్నారు?

సాక్షితో పంచుకోండి...

పిల్లల ఇండోర్ గేమ్స్, పెద్దవాళ్ల కబుర్లు, హోమ్ మేడ్ ఫుడ్, హౌస్ ఫుల్ టైమ్.. మన కోసం.. మన చేత.. మన వల్ల అన్నట్లుగా మారేందుకు వచ్చిన అరుదైన అవకాశం లాక్‌డౌన్. ఈ సమయంలో యాక్టివిటీస్ డౌన్ కావడంతో అనుబంధాలు ఆన్ అవుతున్నాయి. వంటలు చేసే మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలతో కలిసి ఆటలాడుతున్న పెద్దవాళ్లు, ఇలాంటి అరుదైన, అపురూపమైన దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. మరి మీరేం చేస్తున్నారు? మీ ఇంట్లో ఎంత ఫన్ సృష్టిస్తున్నారు? నేడు ఎలా సందడి చేస్తున్నారు? రేపటికి ఎలా ప్రిపేర్ అవుతున్నారు? తదితర ఆసక్తికర విషయాలు 'సాక్షి'తో పంచుకోండి... గృహమే కదా స్వర్గసీమ అనే స్ఫూర్తిని అందరితోనూ పంచుకోండి. ఆయా అంశాలను మేము ప్రచురిస్తాం.




మీ విశేషాలు పంపాల్సిన వాట్సప్ నంబర్ : 9963823329

మెయిల్ ఐడీ: nalgondasakshidesk@gmail.com


బొమ్మలరామారంలో విద్యార్థులకు బోధిస్తూ...


సూర్యాపేటలో చెస్ ఆడుతూ ..


సూర్యాపేటలో అష్టాచెమ్మా ఆడుతూ...


జాజిరెడ్డిగూడెంలో క్యారమ్స్ ఆడుతూ...


భువనగిరిలో టాబ్‌లతో కాలక్షేపం చేస్తున్న చిన్నారులు


కొడుకుతో సరదాగా....

## ఇంట్లోనే కాలక్షేపం చేస్తూ..

కరోనా వైరస్ కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో ప్రజలంతా ఇంటి వద్దే ఉంటూ కాలక్షేపం చేస్తున్నారు. చిన్నారులు చెస్, క్యారమ్స్, అష్టాచెమ్మా లాంటి ఆటలతో సందడి చేస్తున్నారు. కాగా... పెద్దలు ఇంట్లో మహిళలకు వంట పనిలో, ఇళ్లు శుభ్రంచేయడంలో సహకరిస్తున్నారు. ఇలాంటి ఎన్నో అపురూప దృశ్యాలు లాక్‌డౌన్ కారణంగా ఆవిష్కృతమవుతుండగా వాటిని పలువురు 'సాక్షి హాయ్ మీరేం చేస్తున్నారు'తో పంచుకున్నారు.


అన్సారీ కాలనీలో...


తుంగతుర్తిలో అష్టాచెమ్మా ఆడుతున్న కుటుంబసభ్యులు


భూదాన్‌పోచంపల్లిలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న చిన్నారులు


నాగారంలో గిటార్ వాయిస్తూ...

## కరోనా కట్టడికి ప్రతిఒక్కరూ సహకరించాలి


మునుగోడులో సోడియం హైపోక్లోరైడ్‌ను స్ప్రే చేయిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

**మునుగోడు :** కరోనా వైరస్ వ్యాప్తిని నివారించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కరోనా వైరస్‌ను అంతమొందించేందుకు శుక్రవారం మునుగోడులో తన సొంత ఖర్చులతో సోడియం హైపోక్లోరైడ్‌ను వీధుల వెంట స్ప్రే చేయించారు. అదేవిధంగా పలువురికి ఉచితంగా మాస్కులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ చైర్మన్, జెడ్పీటీసీ నారబోయిన స్వరూపారాణిరవి, ఎంపీపీ కర్నాటి స్వామి, సర్పంచ్ మిర్యాల వెంకన్న, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీక్, ఎంపీటీసీలు బొడ్డు శ్రావణినాగరాజుగౌడ్ పాల్గొన్నారు.

**కరోనాను తరిమి కొడదాం**

**చండూరు :** మనమంతా స్వీయ రక్షణలో ఉండి కరోనా మహమ్మారిని తరిమి కొడదామని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం చండూరు మున్సిపల్ కేంద్రంలో హైపోక్లోరైడ్‌ను వీధుల్లో స్ప్రే చేయించారు.

**చండూరులో..**

చండూరు మున్సిపల్ పరిధిలోని 10 వార్డుల్లో మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ తోకల చంద్రకళ శుక్రవారం సోడియం హైపోక్లోరైడ్‌ను స్ప్రే చేయించారు.

**గల్లీ, గల్లీలో సోడియం హైపోక్లోరైడ్ స్ప్రే**

**నల్లగొండ టూటౌన్ :** కరోనా వైరస్‌ను నాశనం చేయడానికి మున్సిపల్ సిబ్బంది ప్రతి రోజు నీలగిరి మున్సిపాలిటీ పరిధిలో గల్లీ, గల్లీలో సోడియం హైపోక్లోరైడ్‌ను స్ప్రే చేస్తున్నారు. నీలగిరి పట్టణంలో కరోనా ప్రభావం ఉండడంతో ద్రావణం పిచికారీతో పాటు అన్ని వార్డుల్లోని కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. పట్టణమంతా పరిశుభ్రంగా ఉండే విధంగా మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది.

## ఉచిత బియ్యం క్యూలో లబ్ధిదారుల అవస్థలు


మిర్యాలగూడలోని గాంధీనగర్‌లో భౌతికదూరం పాటిస్తూ క్యూలో కూర్చున్న లబ్ధిదారులు

**మిర్యాలగూడ :** కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం పంపిణీ మిర్యాలగూడలో శుక్రవారం ప్రారంభమైంది. కాగా రేషన్ దుకాణాల వద్ద భౌతిక దూరం పాటించే విధంగా బాక్స్‌లు వేశారు. కాగా పట్టణంలోని షాబ్‌నగర్ రేషన్ దుకాణం వద్ద క్యూలైన్‌లో బస్తాలను ఉంచారు. గాంధీనగర్‌లోని రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారులకు కుర్చీలు ఏర్పాటు చేశారు. కాగా మొదటి రోజు సర్వర్ డౌన్ కావడంతో కొన్ని రేషన్ షాపులలో మాత్రమే బియ్యం ఇచ్చారు.

**ఉదయం ఐదు గంటలకే క్యూలైన్‌లో..**

**చిట్యాల :** లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత రేషన్ బియ్యం తీసుకునేందుకు ప్రజలు తీవ్రఅవస్థలు పడుతున్నారు. చిట్యాలలో శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి రేషన్ దుకాణాల ఎదుట బారులుదీరారు. భౌతిక దూరం పాటించేందుకు ఏర్పాటు చేసిన బాక్స్‌లలో సంచులను ఉంచుతున్నారు. కాగా బియ్యం తీసుకునేందుకు గంటల తరబడి నిలబడాల్సి వస్తుందని, రేషన్ దుకాణాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాగా శుక్రవారం బయోమెట్రిక్ మిషన్‌లో సర్వర్ డౌన్ కావడంతో బియ్యం పంపిణీ మందకొడిగా సాగింది.

**చండూరు :** చండూరు మండలంలో రేషన్ కోసం లబ్ధిదారులు పరేషాన్ కాక తప్పడం లేదు. గురువారం మొదటి రోజు సర్వర్ ప్రాబ్లమ్‌తో కొంతమందికే రేషన్ అందింది. రెండో రోజు శుక్రవారం ఉదయాన్నే రేషన్ దుకాణాల ముందు భౌతిక దూరం పాటిస్తూ, సర్వర్ ప్రాబ్లమ్‌తో గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. చివరకు సర్వర్ రావడం లేదని డీలర్ చెప్పడంతో ఇంటిబాట పట్టాల్సి వస్తుంది.

## అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ బియ్యం

**డిండి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం తెల్లరేషన్‌కార్డు కల్గిన ప్రతిఒక్క లబ్ధిదారుడికి అందుతాయని ఎంపీపీ మాధవరం సునీత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కామేపల్లి, ఎర్రారం గ్రామంలోని ఆమె బియ్యం పంపిణీ చేసి మాట్లాడారు.

**పెద్దవూర :** లాక్‌డౌన్ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు ఉచితంగా అందిస్తున్న 12కిలోల బియ్యం పంపిణీ మండలంలో శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దార్ ఎస్.సైదులు మండల కేంద్రంలో ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ**

**కేతేపల్లి :** మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో పేద ప్రజలకు స్థానిక యువకులు శుక్రవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బయ్య నాగరాజు, లింగయ్య, భాను, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FOR SALE

■ దామరచర్ల మండలం గుంటూరు వెళ్ళే హైవే ప్రక్కన 16x70 చ॥గ॥ షాపు, ఇల్లు అమ్మబడును. ఆంధ్రాబ్యాంక్ ప్రక్కన మంచి రన్నింగ్‌లో ఉన్న షాపు అమ్మబడును. సంప్ర॥ 7989020471 [Y-708772]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయం, ప్రాపర్టీ, బిజినెస్, టేకోవర్, ప్రాజెక్ట్ మరియు సిబిల్ కేసులు వంటి అన్ని రకముల రుణములు ఇవ్వబడును. సంప్ర॥ 7838016584. [W-723337]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా 408 కొనుగోలు కేంద్రాలు
- కరోనా దృష్ట్యా గతంలో కంటే అధికంగా ఏర్పాటు
- నల్లగొండ ఆర్జాలబావిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే


నల్లగొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే

**ధాన్యాన్ని ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకురావాలి**

ప్రభుత్వం కరోనా వైరస్ వ్యాప్తి దృష్ట్యా కొనుగోలు కేంద్రాలను రైతుల సౌకర్యార్థం ఎక్కువగా ఏర్పాటు చేస్తుంది. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి, కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలి. – ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

**నల్లగొండ :** రబీ ధాన్యం కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రబీకి సంబంధించి ధాన్యం మార్కెట్లకు వస్తుండడంతో జిల్లా యంత్రాంగం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ప్రతి రెవెన్యూ గ్రామాలకు వెళ్లి ఏ ఊరి రైతుల ధాన్యం అక్కడే కొనే విధంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా జిల్లాలో 408 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించారు. మొదటి రోజు 50 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. అదనపు కలెక్టర్ వనమాల చంద్రశేఖర్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిలు నల్లగొండలోని ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, డీసీఓ శ్రీనివాసమూర్తి , పీఎసీహెచ్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు, కౌన్సిలర్లు ఆలకుంట్ల రాజేశ్వరి మోహన్‌బాబు, దేప వెంకట్‌రెడ్డి, కృష్ణ, వెంకన్న పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు గాను జిల్లావ్యాప్తంగా 408 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఐకేపీ 237 కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా పీఎసీఎస్ ద్వారా 171 కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది.

**మిర్యాలగూడ :** కరోనా వైరస్ (కోవిడ్ –19) వ్యాప్తి నివారణలో భాగంగా లాక్‌డౌన్ ప్రకటించి నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని గోపసముద్రంతండాలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వాటర్‌ట్యాంక్‌తండాలో ఉచిత రేషన్‌బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టి బాబునాయక్, తహసీల్దార్, ఏడీఏ పాల్గొన్నారు.

**వేములపల్లి (మాడ్గులపలి) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సల్కునూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ సబ్బు సురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం, భీమనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గడ్డమీది సైదులు, నూకల లింగయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు అనుములపురి జయసుధ, భిక్షం, నాయకులు రాజు, సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వేములపల్లి (మిర్యాలగూడ) :** ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తరలించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఎంపీపీ పుట్టల సునీత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాలను జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మతో కలిసి ప్రారంభించారు. అలాగే లక్ష్మీదేవిగూడెం, సల్కునూర్ గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌డీ మౌలానా, ఎంపీడీఓ నిరంజన్, ఏపీఎం అనూక్, వైస్‌ఎంపీపీ పాదూరి గోవర్ధని, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

**అడవిదేవులపల్లి :** మండలంలోని ఉల్సాయిపాలెం, కొత్తనందికొండలో శుక్రవారం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ ప్రారంభించి మాట్లాడారు.

**చిట్యాల :** ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చిట్యాల తహసీల్దార్ ఎం.కృష్ణారెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి తెలిపారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం, ముత్యాలమ్మగూడెంలలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల స్థలాలను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో చిట్యాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, డైరెక్టర్‌లు జగిని భిక్షంరెడ్డి, శ్రీశైలం, పీఏసీఎస్ సీఈఓ బ్రహ్మాచారి, సూపర్‌వైజర్, మున్సిపల్ వైస్ చైర్మన్ లింగస్వామి, కౌన్సిలర్ పాల్గొన్నారు.

**శాలిగౌరారం :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ ఎర్ర రణీల అన్నారు. మండలంలోని చిత్తలూరులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, స్థానిక సర్పంచ్ మామిడికాయల జయమ్మ, ఎంపీటీసీ దాసరి ప్రమీల, ఏపీఎం జానకి, రైతులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ : గోపసముద్రంతండాలో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

**కేతేపల్లి :** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్ సూచించారు. మండలంలోని ఇనుపాములలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం బి.యాదమ్మ, సీసీ ప్రసాద్, మార్కెటింగ్ సీఆర్పీ శాంత, సింగిల్‌విండో చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ మండల అధ్యక్షుడు కె.మహేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ బొజ్జ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

**నిడమనూరు :** ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని ఊట్కూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నర్సింగ్ విజయ్‌కుమార్, మమతా కోటిరెడ్డి, నర్మదవెంకటరమణ, శ్రీను, ఏపీఎం నర్సింహ, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## జయహో.. పట్టాభిరామయ్య

పట్టాభిషేక తంతు నిర్వహిస్తున్న అర్చకులు, స్వామివారికి బంగారు కిరీటాన్ని ధరింపజేస్తున్న అర్చకులు





వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ భద్రాద్రి రామయ్య పట్టాభిషిక్తుడయ్యారు. భద్రాచలం రామాలయంలో శుక్రవారం పట్టాభిషేకం వేడుకలను ఆలయ ప్రాంగణంలోని బేడా మండపంలో నిర్వహించారు. ప్రభుత్వం తరుపున ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. - సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం


పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న కేవీ రమణాచారి, బాలసాని

## ఫొటోస్టూడియో సీజ్

**నాంపల్లి (మునుగోడు) :** లాక్‌డౌన్ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించిన మండల కేంద్రంలోని అన్నపూర్ణ ఫొటో స్టూడియోను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంబాబు, ఆర్‌ఐ క్రాంతికుమార్ శుక్రవారం తెలిపారు.

## మద్యం అమ్మితే చర్యలు

**నాంపల్లి (మునుగోడు) :** లాక్‌డౌన్ నేపథ్యంలో గ్రామాల్లో మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మాదవయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని పగిడిపల్లిలో దాడులు నిర్వహించి బిక్కం శ్రీనయ్య ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న 12ఓసీ ఫుల్‌బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

## మద్యం స్వాధీనం

**పెద్దవూర :** మండలంలోని తుమ్మచెట్టు స్టేజీ గ్రామంలో బెల్టు దుకాణంపై శుక్రవారం దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎల్.మౌనిక తెలిపారు.

## బియ్యం అందించాలని వినతి

**నకిరేకల్ :** నూతన రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకుని కార్డు రాని పేద వారికి కూడా ప్రభుత్వం 12కేజీల బియ్యం, రూ.1500 అందజేయాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు దైద రవీందర్ శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.

## అనుముల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి

**మిర్యాలగూడ :** నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అనుముల మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తుమ్మలపల్లి శేఖర్‌రెడిని నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ శుక్రవారం మిర్యాలగూడలో ఉత్తర్వులు అందజేశారు.

## సిబ్బందికి అన్నదానం

**వేములపల్లి (మిర్యాలగూడ) :** కరోనా వైరస్ వ్యాప్తిని నివారించడంలో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి స్వేరోస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్లు శైలజ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పెద్దవూర (హాలియా) :** పెదఅడిశర్లపల్లి మండలం తిరుమలగిరి గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెం గ్రామానికి చెందిన ఓర్సు అబ్రహం(20) తన స్వంత పని నిమిత్తం వరుసకు సోదరుడు ఓర్సు మాధవరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై పెద్దవూర మండలం చలకుర్తి గ్రామానికి శుక్రవారం వచ్చి వెళ్తుండగా చలకుర్తి గ్రామం దాటగానే బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడడంతో అబ్రహం తలకు తీవ్రగాయాలు కాగా, వెనుక కూర్చున్న మాధవరావుకు స్వల్ప గాయాలయ్యాయి. అబ్రహం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బావ వరికుప్పల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎల్.మౌనిక తెలిపారు.

## లాఠీ తగిలి వ్యక్తికి గాయాలు

**నకిరేకల్ :** నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో నివాసం ఉంటున్న మౌలాలీ తన ద్విచక్రవాహనంపై కూరగాయలు కొనేందుకు ఉదయం నకిరేకల్‌లోని మెయిన్ సెంటర్ వైపు వచ్చాడు. లాక్‌డౌన్ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రోడ్డు మీదకు ఎందుకు వచ్చావని మౌలాలీపై లాఠీ విసరడంతో అతడి మొఖంపై తగిలి గాయాలయ్యాయి. సంఘటనపై నకిరేకల్ సీఐ బాలగోపాల్ స్పందిస్తూ రోడ్ల మీదకు వచ్చే వాహనాలను సీజ్ చేసే పనిలో ఉన్నారు తప్పా, మౌలాలీని పోలీసులు కొట్టలేదని తెలిపారు.

## వివాహిత ఆత్మహత్య

**కనగల్ (నల్లగొండ) :** వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కనగల్ మండలంలో జరిగింది. ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తేలకంటిగూడెం గ్రామానికి చెందిన గాదె పుష్ప(30) గురువారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ప్రభుత్వ ఆస్పత్రిలో భోజనం ఏర్పాటు

**నల్లగొండ టౌన్ :** కరోనా కట్టడి కోసం చేపట్టిన దేశవ్యాప్త లాక్‌డౌన్ సందర్భంగా ఆస్పత్రిలోని రోగుల సహాయకులకు భోజనం కోసం ఇబ్బందులు ఏర్పడకూడదన్న ఉద్దేశంతో శుక్రవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదగోని శ్రీనివాస్‌గౌడ్ వారికి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లెబోయిన శ్యాంసుందర్, బండారు ప్రసాద్, బొజ్జ నాగరాజు, మొరిశెట్టి నాగరేశ్వర్‌రావు, దాసరి సాయి, శివశంకర్, నన్నూరి రాంరెడ్డి, గాలి శ్రీనివాస్, ఏడుకొండల హరి, పొగాకు నాగరాజు, పున్న వెంకన్న, మంగలపల్లి క్రిష్ణమూర్తి, శ్రీనివాసరావు, సురేశ్ పాల్గొన్నారు.

## భౌతిక దూరం పాటించడం ఒక్కటే మార్గం

- సాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య

**హాలియా :** కరోనా వైరస్ నివారణకు ప్రతిఒక్కరూ భౌతిక దూరం పాటించడం ఒక్కటే మార్గమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ నేపథ్యంలో హాలియా మున్సిపాలిటీ పట్టణంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, పారిశుద్ధ్య కార్మికులతో పాటు బ్రాహ్మణులకు దాతల సహకారంతో నోముల నర్సన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం హాలియా పట్టణంలో బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నోముల ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, హాలియా సీఐ చంద్రశేఖర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, కమిషనర్ వేమనారెడ్డి, కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నోముల

సాక్షి బిజినెస్
శనివారం
4-4-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్‌ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్‌ | నిఫ్టీ |
|---|---|
| 674 ▼ | 170 ▼ |
| 27,591 | 8,084 |

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 7,343 | ▼ | 144 |
| డోజోన్స్‌ | 21,004 | ▼ | 409 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 5,415 | ▼ | 64 |
| డాక్స్‌ | 9,525 | ▼ | 45 |
| షాంఘై | 2,763 | ▼ | 16 |
| నికాయ్‌ | 17,820 | ▲ | 2 |


అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

## ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

(గురువారం రేట్లు)

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | 72.28 | 79.40 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | 91.78 | 96.52 |
| € | యూరో | 80.09 | 85.22 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | 60.00 | 78.00 |
| AUS $ | ఆస్ట్రేలియా డాలర్‌ | 44.07 | 48.27 |
| S$ | సింగపూర్‌ డాలర్‌ | 51.33 | 54.99 |
| SAR | సౌదీ రియాల్‌ | 19.10 | 20.97 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | 19.24 | 21.88 |
| ¥ | చైనా యువాన్‌ | 9.51 | 11.28 |

# జీడీపీకి షాక్‌!




## 30 ఏళ్ల కనిష్టానికి పడిపోనున్న భారత్‌ వృద్ధి రేటు

- ఈసారి 2 శాతమేనంటున్న ఫిచ్‌
- 4 శాతం అంచనా వేస్తున్న ఏడీబీ

**న్యూఢిల్లీ:** భారత ఆర్థిక వృద్ధికి కరోనా వైరస్‌ మహమ్మారి దెబ్బ గట్టిగానే తగలనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది ఏకంగా 30 ఏళ్ల కనిష్టానికి పడిపోవచ్చని రేటింగ్‌ ఏజెన్సీ ఫిచ్‌ అంచనా వేసింది. 2020–21లో వృద్ధి రేటు కేవలం 2 శాతానికి పరిమితం కావొచ్చని పేర్కొంది. గత అంచనాలైన 5.6 శాతాన్ని ఇటీవల మార్చిలో 5.1 శాతానికి కుదించిన ఫిచ్‌ .. తాజాగా సగం పైగా తగ్గించేయడం గమనార్హం. లాక్‌డౌన్‌లతో ప్రపంచ దేశాలను చుట్టుముట్టిన ఆర్థిక మాంద్యం ప్రభావాలు భారత్‌ పైనా గణనీయంగా ఉండబోతున్నాయని వివరించింది. చైనాలో తొలి దశలో తయారీ కార్యకలాపాల నిలిపివేతతో సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయని, ఈ ప్రభావాలు మరింతగా విస్తరించాయని పేర్కొంది. 'ఈ ఏడాది అంతర్జాతీయంగా మాంద్యం వస్తుందని అంచనాలున్నాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం భారత అంచనాలను 2 శాతానికి కుదిస్తున్నాం' అని ఫిచ్‌ తెలిపింది. మూడీస్‌ ఇన్వెస్టర్స్‌ సర్వీస్‌ సంస్థ గత వారమే 2020లో భారత వృద్ధి రేటు అంచనాలను 5.3 శాతం నుంచి 2.5 శాతానికి తగ్గించేసిన సంగతి తెలిసిందే. అటు ఎస్‌ అండ్‌పీ గ్లోబల్‌ రేటింగ్స్‌ సంస్థ 3.5 శాతానికి, ఇండియా రేటింగ్స్‌ అండ్‌ రీసెర్చ్‌ సంస్థ 3.6 శాతానికి కుదించాయి.

**చిన్న సంస్థలు, బ్యాంకులకు దెబ్బ...**

వినియోగదారులు ఖర్చులు తగ్గించుకోనుండటంతో లఘు, చిన్న, మధ్యతరహా సంస్థలు, సేవల రంగాలపై అత్యధికంగా ప్రతికూల ప్రభావం పడుతుందని ఫిచ్‌ పేర్కొంది. సాధారణంగా నాన్‌–బ్యాంకింగ్‌ ఫైనాన్స్‌ సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి రుణాలు తీసుకునే వారి ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగానే ఉంటుందని, వారి ఆదాయాలేమైనా తగ్గిన పక్షంలో రుణాలు చెల్లించలేని పరిస్థితి తలెత్తవచ్చని తెలిపింది. 'ఈ పరిస్థితుల్లో భారత్‌లోని ఎన్‌బీఎఫ్‌సీలు మరిన్ని సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుంది. లాక్‌డౌన్‌తో ప్రభుత్వం విధించిన ఆంక్షల కారణంగా కార్యకలాపాలు దెబ్బతినొచ్చు. కరోనా కేసులు స్థానికంగా పెరిగితే ఆర్థికంగా సెంటిమెంటుపై కూడా దెబ్బతింటుంది. దీనితో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఎన్‌బీఎఫ్‌సీలు మళ్లీ పట్టాలు తప్పే అవకాశముంది' అని ఫిచ్‌ తెలిపింది.

**వచ్చే ఏడాది రికవరీ: ఏడీబీ**

అంతర్జాతీయంగా హెల్త్‌ ఎమర్జెన్సీ అమలవుతున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత వృద్ధి రేటు 4 శాతానికి పరిమితం కావొచ్చని ఏషియన్‌ డెవలప్‌మెంట్‌ బ్యాంక్‌ (ఏడీబీ) అంచనా వేసింది. కరోనా వైరస్‌ ప్రతికూల ప్రభావాలు దీర్ఘకాలం కొనసాగిన పక్షంలో ప్రపంచ ఎకానమీ మరింత మాంద్యంలోకి జారిపోతుందని, భారత వృద్ధి ఇంకా మందగించవచ్చని పేర్కొంది. ఒక వేళ ఇది భారత్‌లోనే శరవేగంగా విస్తరిస్తే, ఆర్థిక కార్యకలాపాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు తప్పవని ఏడీబీ తెలిపింది. అయితే, స్థూల ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్నందువల్ల వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత రికవరీ మరింత పటిష్టంగా ఉండగలదని ఏషియన్‌ డెవలప్‌మెంట్‌ అవుట్‌లుక్‌ (ఏడీవో) నివేదికలో ఏడీబీ తెలిపింది. 'ప్రస్తుతం అసాధారణ గడ్డుకాలంగా నడుస్తోంది. కరోనా ప్రజల జీవితాలతో పాటు వ్యాపారాలను ప్రపంచ వ్యాప్తంగా ఇతరత్రా ఆర్థిక కార్యకలాపాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది' అని ఏడీబీ ప్రెసిడెంట్‌ మసాత్సుగు అసకావా తెలిపారు. 'ప్రపంచ వృద్ధికి, భారత రికవరీకి కరోనా పెను సవాలుగా మారింది. కానీ భారత ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉన్నందున వచ్చే ఆర్థిక సంవత్సరంలో గట్టిగా కోలుకోవచ్చు. సంస్కరణల ఊతంతో అప్పుడు 6.2% ఉండొచ్చు' అని ఏడీబీ చీఫ్‌ ఎకానమిస్ట్‌ యసుయుకి సవాడా చెప్పారు. మహమ్మారి బారిన పడిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు భారత్‌ వేగంగా స్పందించిందన్నారు. వ్యక్తిగత, కార్పొరేట్‌ ట్యాక్స్‌ రేట్లపరంగా కొనసాగుతున్న సంస్కరణలు, వ్యవసాయం.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పటిష్టం చేసేందుకు, ఆర్థిక రంగాన్ని గట్టెక్కించేందుకు తీసుకుంటున్న చర్యలు రికవరీకి తోడ్పడగలవని చెప్పారు.

### ప్రపంచానికి 4.1 ట్రిలియన్‌ డాలర్ల నష్టం..

కరోనా మహమ్మారి కారణంగా ప్రపంచ దేశాలు 2 నుంచి 4.1 లక్షల కోట్ల డాలర్ల (ట్రిలియన్‌) దాకా నష్టపోవచ్చని ఏడీబీ పేర్కొంది. గ్లోబల్‌ జీడీపీలో ఇది 2.3–4.8%కి సమానంగా ఉంటుందని వివరించింది. వర్ధమాన ఆసియా దేశాలు కరోనా వల్ల అత్యధికంగా నష్టపోనున్నాయని తెలిపింది. టూరిజం, వాణిజ్యం, రెమిటెన్సులు వంటి విషయాల్లో ప్రపంచ దేశాలతో ఎక్కువగా అనుసంధానమై ఉండటమే ఇందుకు కారణమని పేర్కొంది. కమోడిటీల ధరల పతనం కూడా కొన్ని దేశాలపై ఒత్తిడి పెంచుతోందని వివరించింది. 2020లో వృద్ధి 4.1 శాతానికి తగ్గి, 2021లో 6 శాతానికి రికవర్‌ కాగలదని తెలిపింది.

# బ్యాంకింగ్‌ బోర్లా!

- రేటింగ్‌ స్థిరం నుంచి ప్రతికూలానికి తగ్గింపు
- మొండిబాకీలు ఎగబాకొచ్చని మూడీస్‌ ఆందోళన
- పలు బ్యాంకుల రేటింగ్‌ డౌన్‌గ్రేడ్‌

**న్యూఢిల్లీ:** భారత బ్యాంకింగ్‌ రంగ దృక్పథాన్ని స్థిరం నుంచి ప్రతికూలానికి (నెగెటివ్‌) మూడీస్‌ ఇన్వెస్టర్‌ సర్వీసెస్‌ తగ్గించేసింది. కరోనా వైరస్‌ కారణంగా ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన అవరోధాలతో వృద్ధి మందగిస్తుందని.. దీంతో బ్యాంకుల ఆస్తుల నాణ్యత తగ్గిపోవచ్చని ఈ సంస్థ అంచనా వేసింది. కార్పొరేట్‌, సూక్ష్మ, మధ్య తరహా సంస్థలు, రిటైల్‌ విభాగంలోని మొండిబాకీలు పెరగవచ్చని.. ఫలితంగా బ్యాంకుల లాభాలు, నిధులపై ఒత్తిళ్లు పెరిగిపోతాయని మూడీస్‌ నివేదికలో పేర్కొంది. ''ఉన్నట్టుండి ఆర్థిక కార్యకలాపాలు ఒకేసారి ఆగిపోవడంతో నిరుద్యోగం పెరుగుతుంది. ఇది గృహాలు, కంపెనీల ఆదాయాలు తగ్గిపోయేందుకు దారితీస్తుంది. దీంతో చెల్లింపుల్లో జాప్యం పెరిగిపోయేందుకు కారణమవుతుంది. ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల్లో నిధుల ఒత్తిళ్లు బ్యాంకుల రిస్కును పెంచుతుంది. ఎందుకంటే ఎన్‌బీఎఫ్‌సీ రంగానికి బ్యాంకుల ఎక్స్‌పోజర్‌ (రుణ పోర్ట్‌ఫోలియో) ఎక్కువగా ఉంది'' అని మూడీస్‌ వెల్లడించింది. ఈ అంశాలు బ్యాంకుల లాభదాయకతను దెబ్బ తీయడంతోపాటు రుణ వృద్ధికి విఘాతం కలిగిస్తాయని అంచనా వేసింది. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో నిధుల లభ్యత స్థిరంగా ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. యస్‌ బ్యాంకు డిఫాల్ట్‌తో రిస్క్‌ తీసుకోవడానికి కస్టమర్లు వెనుకాడడం చిన్న ప్రైవేటు బ్యాంకులకు నిధుల ఒత్తిళ్లు పెరగవచ్చని అంచనా వేసింది.

**ఈ బ్యాంకుల పట్ల నెగెటివ్‌..**

ఇండస్‌ ఇండ్‌ బ్యాంకు రేటింగ్స్‌ను డౌన్‌గ్రేడ్‌ చేసేందుకు పరిశీలనలో పెడుతున్నట్టు మూడీస్‌ ప్రకటించింది. ఇండస్‌ ఇండ్‌ బ్యాంకు పోర్ట్‌ఫోలియో ఎక్కువగా వాహన రుణాలు, సూక్ష్మ రుణాలు కావడంతో ప్రస్తుత ఆర్థిక పరిస్థితులతో బ్యాంకుపై ఎక్కువ ప్రభావం ఉండొచ్చని మూడీస్‌ పేర్కొంది. అలాగే, ప్రస్తుత సవాళ్లతో కూడిన వాతావరణంలో ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్‌ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు రేటింగ్‌లను డౌన్‌గ్రేడ్‌ చేసింది. యాక్సిస్‌, ఐసీఐసీఐ బ్యాంకుల రేటింగ్‌ను స్థిరం (స్టేబుల్‌) నుంచి నెగెటివ్‌కు తగ్గించింది. ఐడీబీఐ బ్యాంకు రేటింగ్‌ను పాజిటివ్‌ నుంచి స్టేబుల్‌కు డౌన్‌గ్రేడ్‌ చేసింది. అయితే, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్‌ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకుల గ్లోబల్‌ రేటింగ్స్‌లో మార్పులు చేయలేదు. లాక్‌డౌన్‌ కారణంగా రుణ గ్రహీతల వేతనాలకు ఇబ్బందులు ఎదురైతే అది రిటైల్‌, క్రెడిట్‌కార్డు రుణాల చెల్లింపులపై ప్రభావం చూపిస్తుందని అంచనా వేసింది.

**ఈ రంగాలపై ఎక్కువ ప్రభావం..**

ఎయిర్‌లైన్స్‌, ఆటోమొబైల్‌ ఓఈఎం కంపెనీలు, ఆటో విడిభాగాల సరఫరా కంపెనీలు, ఆయిల్‌ అండ్‌ గ్యాస్‌ తయారీదారులు, గేమింగ్‌, గ్లోబల్‌ షిప్పింగ్‌, విచక్షణా రహిత రిటైల్‌ వినియోగం, ఆతిథ్య రంగాలు కరోనా వైరస్‌ కారణంగా ఎక్కువ ప్రతికూలతలను చవిచూసే రంగాలుగా మూడీస్‌ పేర్కొంది.

# వీడని వైరస్‌ భయాలు



- కొనసాగిన ఇన్వెస్టర్ల అమ్మకాలు
- రెండు శాతానికి పైగా నష్టపోయిన నిఫ్టీ, సెన్సెక్స్‌
- బ్యాంకు స్టాక్స్‌కు భారీ నష్టాలు

**ముంబై:** దేశంలో కరోనా వైరస్‌ కేసులు భారీగా పెరిగిపోతుండడం, ఫలితంగా ఆర్థిక వ్యవస్థపై దీని ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందోనన్న అనిశ్చితి ఇన్వెస్టర్లను అమ్మకాల వైపు నడిపించింది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు శుక్రవారం కూడా నష్టాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా భారత బ్యాంకింగ్‌ రంగం పట్ల మూడీస్‌ తన దృక్పథాన్ని నెగెటివ్‌కు తగ్గించడం పెద్ద ప్రభావాన్నే చూపించింది. బ్యాంకు స్టాక్స్‌లో అమ్మకాలకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపారు. ఈ ప్రభావంతో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 170 పాయింట్లు కోల్పోయి (2.06%) 8,084 వద్ద క్లోజయింది. బీఎస్‌ఈ సెన్సెక్స్‌ 674 పాయింట్లు నష్టపోయి (2.39%) 27,591 వద్ద ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తరలించుకుపోతుండడం, ఫలితంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో విడత 76 స్థాయికి జారిపోవడం.. ఇన్వెస్టర్లను కొనుగోళ్ల విషయమై వేచిచూసే ధోరణి అనుసరించేలా చేసినట్టు ట్రేడర్లు అభిప్రాయపడ్డారు. ఈ వారం మొత్తం మీద సెన్సెక్స్‌ 2,225 పాయింట్లు (7.46%), నిఫ్టీ 576 పాయింట్లు (6.65%) చొప్పున నష్టపోయాయి. ఈ వారంలో చివరి రెండు రోజుల్లో నష్టాల కారణంగా బీఎస్‌ఈ లిస్టెడ్‌ కంపెనీల మార్కెట్‌ విలువ రూ.4,82,033 కోట్ల మేర తరిగిపోయి రూ.1,08,66,723 కోట్లకు పడింది.

**అమ్మకాలకు దారితీసిన అంశాలు**

- కరోనా వైరస్‌ ప్రభావం కారణంగా భారత బ్యాంకింగ్‌ రంగంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) పెరిగిపోవచ్చన్న అంచనాతో ఈ రంగం అవుట్‌లుక్‌ను స్థిరం నుంచి ప్రతికూలానికి మారుస్తూ మూడీస్‌ నిర్ణయం తీసుకుంది.
- కరోనా పాజిటివ్‌ కేసుల్లో భారీ పెరుగుదలతో ఆర్థిక మాంద్యం వస్తుందన్న ఆందోళన నెలకొంది.
- కరోనా వైరస్‌ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై 4.1 ట్రిలియన్‌ డాలర్ల భారాన్ని మోపుతుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు పేర్కొంది.
- డాలరుతో రూపాయి విలువ శుక్రవారం 53 పైసలు నష్టపోయి 76.13 వద్ద క్లోజయింది.

**బ్యాంకు స్టాక్స్‌ బేర్‌...**

మూడీస్‌ ఇన్వెస్టర్‌ సర్వీసెస్‌ భారత బ్యాంకింగ్‌ రంగ రేటింగ్‌ను నెగెటివ్‌కు మార్చడం, అందులోనూ కొన్ని బ్యాంకుల రేటింగ్‌లను తగ్గించడం ఆయా స్టాక్స్‌కు ప్రతికూలంగా మారింది. అత్యధికంగా ఆర్‌బీఎల్‌ బ్యాంకు 15.5 శాతం, బంధన్‌ బ్యాంకు 13 శాతం చొప్పున నష్టపోయాయి. సూచీల్లోని బ్యాంకు స్టాక్స్‌ అయిన.. యాక్సిస్‌ బ్యాంకు 9 శాతం, ఇండస్‌ ఇండ్‌ బ్యాంకు 8.5 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 8 శాతం, ఎస్‌బీఐ 6 శాతం చొప్పున పడిపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కోటక్‌ మహీంద్రా బ్యాంకులు 2 శాతం చొప్పున నష్టపోయాయి.

### కరెన్సీ మార్కెట్ల పనివేళలు తగ్గింపు

**ముంబై:** లాక్‌డౌన్‌ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ డెట్‌ మార్కెట్‌, కరెన్సీ మార్కెట్ల ట్రేడింగ్‌ వేళలను వచ్చే మంగళవారం (ఈ నెల 7వ తేదీ) నుంచి కుదిస్తూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతానికి ఈ మార్కెట్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తున్నాయి. ఈ నెల 7 నుంచి ఉదయం 10 గంటలకు మార్కెట్లు ప్రారంభం అయి, మధ్యాహ్నం 2 గంటలకు ముగుస్తాయి.

## సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు


కె.రామ్మోహనరావు

**సాక్షి, విశాఖపట్నం:** సరుకు రవాణాలో విశాఖపట్నం పోర్టుట్రస్ట్‌ నూతన అధ్యాయం నెలకొల్పిందని పోర్టు చైర్మన్‌ కె.రామ్మోహనరావు, డిప్యూటీ చైర్మన్‌ పి.ఎల్‌.హరనాథ్‌ తెలిపారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో 72.72 మిలియన్‌ మెట్రిక్‌ టన్నుల సరుకు రవాణా చేసిందని, 86 ఏళ్లలో ఈ స్థాయిలో సరుకు రవాణా చేయడం ఇదే ప్రథమమన్నారు. గత ఏడాది కన్నా ఇది 7.42 మిలియన్‌ మెట్రిక్‌ టన్నులు అధికంగా రవాణా చేసి 11.50 శాతం వృద్ధి రేటును సాధించిందని పేర్కొన్నారు. ప్రైవేటు పోర్టుల నుంచి గట్టి పోటీ, ఆర్థిక మాంద్యం, కోవిడ్‌ 19 విపత్తు వల్ల కలిగిన ఎగుమతి, దిగుమతి ప్రతికూల పరిస్థితులను అధిగమించి రికార్డు స్థాయిలో సరుకు రవాణా జరగడం విశేషమన్నారు. విశాఖ పోర్టు అవలంబిస్తున్న వ్యూహాత్మక వ్యాపార విధానాల వల్ల నేపాల్‌ ప్రభుత్వం విశాఖ పోర్టును ప్రధాన పోర్టుగా ఎంపిక చేసుకుందని చెప్పారు. గత ఏడాది నేపాల్‌ 16,292 కంటెయినర్లు హ్యాండిల్‌ చేయగా, ఈ ఏడాది 161 శాతం వృద్ధి రేటుతో 42,250 కంటెయినర్లను రవాణా చేసిందని వెల్లడించారు. వినియోగదారులకు రాయితీ కల్పించడం, యాంత్రీకరణ, షిప్‌ టర్న్‌ఎరౌండ్‌ సమయాన్ని తగ్గించడం వంటి మౌలిక సదుపాయాల కల్పన వల్ల వినియోగదారుల నిర్వహణ వ్యయాన్ని చాలా వరకూ తగ్గించామన్నారు. ఇంతటి చరిత్రాత్మక విజయాన్ని సాధించడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ ఫలితాన్ని అంకితమిస్తున్నామని పేర్కొన్నారు.

### ఆదిత్య బిర్లా గ్రూపు విరాళం రూ.500 కోట్లు

**ముంబై:** ఆదిత్య బిర్లా గ్రూపు కరోనా వైరస్‌ మహమ్మారిని తరిమికొట్టేందుకు ముందుకు వచ్చింది. పీఎంకేర్స్‌ పేరిట కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక నిధికి రూ.400 కోట్లను ఆదిత్య బిర్లా గ్రూపు ప్రకటించింది. అలాగే, రూ.50 కోట్లను కరోనా వైరస్‌ నివారణ చర్యల కోసం ఏర్పాటైన ఫిక్కీ–ఆదిత్య బిర్లా సీఎస్‌ఆర్‌ సెంటర్‌ ఫర్‌ ఎక్స్‌లెన్స్‌కు, మరో రూ.50 కోట్లను వెంటిలేటర్లు, మాస్కులు, రక్షణ పరికరాల సరఫరాకు ఖర్చు చేయనున్నట్టు గ్రూపు పేర్కొంది.

### కోడిగుడ్లు

(హోల్‌సేల్‌ -నెక్‌/100కు రూ.లలో) 4-4-2020

| | |
|---|---|
| విశాఖ | 345–00 |
| చిత్తూరు | 373–00 |
| వరంగల్‌ | 338–00 |
| గోదావరి | 345–00 |
| విజయవాడ | 345–00 |
| 3-4-2020 ఫామ్‌ ధర... | |
| హైదరాబాద్‌ | 335–00 |

# స్మార్ట్‌ఫోన్‌కు 'కరోనా' ముప్పు

- 2 బిలియన్‌ డాలర్ల మేర నష్టం
- మార్చి, ఏప్రిల్‌లో విక్రయాల తగ్గుదల
- కౌంటర్‌ పాయింట్‌ రీసెర్చ్‌ అంచనా



**న్యూఢిల్లీ:** కరోనావైరస్‌ మహమ్మారి కట్టడి కోసం లాక్‌డౌన్‌ విధించిన నేపథ్యంలో దేశీ స్మార్ట్‌ఫోన్స్‌ పరిశ్రమ తీవ్రంగా నష్టపోనుంది. ఇది సుమారు 2 బిలియన్‌ డాలర్ల మేర ఉండొచ్చని కౌంటర్‌పాయింట్‌ రీసెర్చ్‌ సంస్థ అంచనా వేసింది. మార్చి, ఏప్రిల్‌లో విక్రయాలు గణనీయంగా మందగించడం ఇందుకు కారణంగా ఉంటుందని పేర్కొంది. మార్చి మధ్య దాకా కరోనా మహమ్మారి ప్రభావం ఒక మోస్తరుగానే ఉన్నప్పటికీ.. ఆ తర్వాత విజృంభిస్తుండటంతో లాక్‌డౌన్‌ అనివార్యమైందని వివరించింది. దీని ఫలితంగా 2020లో స్మార్ట్‌ఫోన్ల విక్రయం గతేడాది నమోదైన 15.8 కోట్లతో పోలిస్తే 3 శాతం తగ్గి 15.3 కోట్లకు పరిమితం కావొచ్చని అంచనా వేసింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే మార్చిలో 27 శాతం తగ్గనుండగా, ఏప్రిల్‌ 14 దాకా లాక్‌డౌన్‌ కొనసాగితే ఈ నెలలో దాదాపు 60 శాతం తగ్గుదల నమోదు కావొచ్చని కౌంటర్‌పాయింట్‌ రీసెర్చ్‌ అసోసియేట్‌ డైరెక్టర్‌ తరుణ్‌ పాఠక్‌ తెలిపారు. కరోనా వైరస్‌ మహమ్మారికి మూలకేంద్రమైన చైనా నుంచి విడిభాగాల సరఫరా దెబ్బతినడం వల్ల ఈ ఏడాది తొలి త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్‌ తయారీ సంస్థలు తీవ్రంగా ఇబ్బందిపడ్డాయి.

**లాక్‌డౌన్‌ పెంచితే మరింతగా నష్టాలు..**

ఒకవేళ లాక్‌డౌన్‌ను పొడిగించిన పక్షంలో నష్టాలు మరింత పెరగవచ్చని పాఠక్‌ చెప్పారు. మొత్తం సరఫరా వ్యవస్థ, ఆదాయాలు, చెల్లింపులు మొదలైనవన్నీ దెబ్బతినడమే ఇందుకు కారణమన్నారు. పైపెచ్చు వినియోగదారులు ఎక్కువగా పొదుపునకు ప్రాధాన్యమిచ్చి, కొనుగోళ్లను వాయిదా వేసుకోవడం వల్ల డిమాండ్‌ పడిపోవచ్చని పాఠక్‌ వివరించారు. భారత్‌ను ఎగుమతుల హబ్‌గా చేసుకున్న ఫ్యాక్టరీలపై ప్రతికూల ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అయితే, పరిస్థితి మెరుగైతే ఉత్పత్తిని వేగంగా పెంచుకోవాల్సిన అవసరం ఉండటంతో ఫ్యాక్టరీలు.. ఉద్యోగాల్లో కోతలు విధించడానికి మొగ్గు చూపకపోవచ్చన్నారు.

**పండుగల సీజన్‌ దాకా ఇంతే..**

ఈ ఏడాది ద్వితీయార్థానికి గానీ స్మార్ట్‌ఫోన్‌లకు డిమాండ్‌ ఉండకపోవచ్చని పాఠక్‌ చెప్పారు. 'ఈ ఏడాది మధ్య నాటికి పరిస్థితి మెరుగుపడినా కూడా.. పండుగల సీజన్‌ దాకా వినియోగదారులు కొనుగోళ్లను వాయిదా వేసుకోవచ్చు' అని ఆయన పేర్కొన్నారు. పరిస్థితి సాధారణ స్థాయికి తిరిగొస్తే .. ఆన్‌లైన్‌ విక్రయాలూ మెరుగుపడొచ్చన్నారు. ఆఫ్‌లైన్‌ విక్రేతలకు ఆకర్షణీయ ఆఫర్లివ్వడంతో పాటు ఆన్‌లైన్‌లోనూ స్టాక్స్‌ సత్వరం అందుబాటులో ఉంచేందుకు స్మార్ట్‌ఫోన్‌ తయారీ సంస్థలు ప్రయత్నిస్తాయని చెప్పారు.

# విమాన టికెట్లు క్రెడిట్‌ షెల్‌లోకి!

- ఈ నెల 15 నుంచి బుకింగ్స్‌ను ప్రారంభించిన ఎయిర్‌లైన్స్‌
- ఒకవేళ లాక్‌డౌన్‌ పొడిగిస్తే మాత్రం టికెట్లన్నీ రద్దు
- ఆయా టికెట్లను 2021 ఫిబ్రవరి 28 వరకు వినియోగించుకునే వీలు
- కస్టమర్లే క్యాన్సిల్‌ చేస్తే మాత్రం చార్జీలు భరించాల్సిందే..

**హైదరాబాద్‌, బిజినెస్‌ బ్యూరో:** ఈ నెల 15 నుంచి పరిస్థితులను బట్టి దశల వారీగా విమానయాన సేవలు అందుబాటులోకి వస్తాయని కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకటించిందే ఆలస్యం.. అన్ని దేశీయ విమానయాన కంపెనీలు టికెట్ల బుకింగ్స్‌ను ప్రారంభించేశాయి. కానీ, అనుకోని విపత్కర పరిస్థితులు ఎదురైతే మాత్రం లాక్‌డౌన్‌ను పొడిగిస్తామని కేంద్రం ప్రకటించింది. మరి, ఇలాంటి పరిస్థితుల్లో విమాన టికెట్లను బుకింగ్‌ చేసుకోవాలా? వద్దా?

దేశంలో కరోనా వైరస్‌ వ్యాప్తి నేపథ్యంలో మార్చి 22 నుంచి అంతర్జాతీయ విమానాలను, మార్చి 25 నుంచి దేశీయ విమాన సర్వీస్‌లను కేంద్రం నిలిపివేసిన సంగతి తెలిసిందే. 3 వారాల లాక్‌డౌన్‌ తర్వాత విమాన సేవల పునరుద్ధరణ నిర్ణయం ఎయిర్‌లైన్స్‌ కంపెనీలకు ఊరటనిచ్చే అంశమే. ఎవరైతే మార్చి 25 నుంచి ఏప్రిల్‌ 14 మధ్య టికెట్లను బుకింగ్‌ చేశారో ఆయా ప్యాసింజర్లకు ఉచిత రీషెడ్యూలింగ్‌ ఆప్షన్స్‌ను, కొన్ని కంపెనీలైతే ట్రావెల్‌ ఓచర్లను అందిస్తున్నాయి. ఆయా పీఎన్‌ఆర్‌ స్టేటస్‌ రద్దు కాకుండా కస్టమర్లు ఇతరత్రా తేదీల్లో వినియోగించుకునే వీలుంటుందని స్పైస్‌జెట్‌కు చెందిన ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు. ప్రస్తుతం స్పైస్‌జెట్‌లో రోజుకు 600 విమానాలు తిరుగుతుంటాయి. ఇందులో 10 శాతం వాటా అంతర్జాతీయ విమానాలుంటాయి. నెలకు 50 వేల టికెట్లు బుకింగ్స్‌ ఉంటాయని ఆయన తెలిపారు.

**15 నుంచి క్రెడిట్‌ షెల్‌లోకి..**

ఇండిగో, స్పైస్‌జెట్‌ వంటి అన్ని ఎయిర్‌లైన్స్‌ కంపెనీలు ఆయా వెబ్‌సైట్లలో టికెట్ల బుకింగ్‌ సమయంలో క్రెడిట్‌ షెల్‌ ఆప్షన్‌ను ఇస్తున్నాయి. ఇదేంటంటే.. ఒకవేళ దేశంలో కరోనా వైరస్‌ వ్యాప్తి నియంత్రణ కాని పక్షంలో కేంద్రం లాక్‌డౌన్‌ను కంటిన్యూ చేస్తే.. మీరు బుకింగ్‌ చేసిన టికెట్ల తాలుకు నగదు మీ ఖాతాలో జమ కాదు. అది క్రెడిట్‌ షెల్‌ రూపంలో నిల్వ ఉంటుంది. దీన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 లోపు అదే పాసింజర్‌ ఏ సమయంలోనైనా.. ఎప్పుడైనా వినియోగించుకునే వీలుంటుందన్నమాట. ఒకవేళ కస్టమరే టికెట్లను రద్దు చేసుకుంటే మాత్రం నిబంధనల ప్రకారం రద్దు చార్జీలను భరించాల్సిందే.



**ఫిబ్రవరిలో 1.23 కోట్ల దేశీయ ప్రయాణికులు..**

డైరెక్టరేట్‌ జనరల్‌ ఆఫ్‌ సివిల్‌ ఏవియేషన్‌ (డీజీసీఏ) గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరిలో దేశీయ విమానాల్లో 1.27 కోట్ల మంది, ఫిబ్రవరిలో 1.23 కోట్ల మంది ప్రయాణికుల ప్రయాణించారు. గతేడాది జనవరిలో 1.25 కోట్లు.. ఫిబ్రవరిలో 1.13 కోట్లుగా ఉంది. డొమెస్టిక్‌ ఎయిర్‌లైన్స్‌లో నెలవారీ ట్రాఫిక్‌ వృద్ధి రేటు 8.98 శాతంగా ఉంది.

### రద్దీ తాత్కాలికమే..

ఈ నెల 15 నుంచి ఒకవేళ దేశీయ విమానయాన సేవలు పునఃప్రారంభమైతే మాత్రం రద్దీ విపరీతంగా ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎందుకంటే వివిధ నగరాల్లో చిక్కుకున్న ప్రజలు ఇళ్లకు చేరేందుకు ప్రయత్నిస్తారు. ఇది విమానయాన సంస్థలకు మూలధనాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీంతో కంపెనీ ఉద్యోగుల సామూహిక లే ఆఫ్‌లు కొంత వరకు తగ్గుతాయని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ సంఖ్య పెరుగుదల తాత్కాలికంగానే ఉంటుందని.. వైరస్‌ భయాల కారణంగా ప్రయాణికుల సంఖ్య క్రమంగా తగ్గుతుందని చెబుతున్నారు. లాక్‌డౌన్‌ నేపథ్యంలో చాలా వరకు ఎయిర్‌లైన్స్‌ కంపెనీలు ఉద్యోగుల తొలగింపు, వేతనాలను తగ్గించిన విషయం తెలిసిందే.

# రెక్కలు రెస్ట్ తీసుకున్నాయి

ఎప్పుడూ రెక్కలు విప్పుకుని ఆకాశంలో విహరించే విమానాలు ఇప్పుడు రెస్ట్ తీసుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య ప్రయాణాలపై నిషేధం ఉండటంతో ఎయిర్‌పోర్టు పార్కింగుల్లో ఇవి సేద తీరుతున్నాయి. మరి ఓసారి మనం కూడా విహంగ వీక్షణం చేద్దామా..


పిట్స్‌బర్గ్‌-అమెరికా


కీవ్‌-ఉక్రెయిన్‌


బీజింగ్‌-చైనా


కాన్సాస్‌ సిటీ-అమెరికా


మియామి-అమెరికా


పారిస్‌-ఫ్రాన్స్‌


లండన్‌-బ్రిటన్‌


మ్యూనిక్‌-జర్మనీ


టోక్యో-జపాన్‌

మంచి మనసులు..

# మానవత్వపు పరిమళాలు

పోలీసులు ఏర్పాటుచేసిన 'గుడ్ సమారిటన్, పోలీస్'గ్రూపునకు నగరవాసుల భారీ స్పందన

- పేదలు, నిరాశ్రయులు, యాచకులకూ అందుతున్న సాయం
- సామాన్యుడి నుంచి కార్పొరేట్ కంపెనీల సీఈఓల వరకు స్వచ్ఛందంగా విరాళాలు

**4,500** మందికి ప్రతిరోజూ భోజనాలను సమకూరుస్తూ సేవలు

విరాళాలు పంపాల్సిన వాట్సాప్ నంబరు **94906 17523**

**సార్.. నేను ఆసిఫాబాద్ నుంచి మాట్లాడుతున్నా.. నేనో చిరువ్యాపారిని. ఈరోజు మా ప్రాంతంలో కనీసం ఐదుగురికి భోజనం పంపాలనుకుంటున్నా.**

**సార్..! నేనో బహుళజాతి కంపెనీకి సీఈఓను.. నిరాశ్రయులు, యాచకులకూ కడుపు నింపేందుకు రెండు క్వింటాళ్ల బియ్యం పంపాలనుకుంటున్నా.**

సాక్షి, హైదరాబాద్

ఇవీ.. డీజీపీ కార్యాలయంలో 'గుడ్ సమారిటన్, పోలీస్ గ్రూప్'నకు వస్తున్న వినతులు. రాష్ట్రంలోని నిత్యావసరాల సరఫరాకు ఎక్కడా ఆటంకం కాకూడదని డీజీపీ మహేందర్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు 'కమోడిటీస్ కంట్రోల్ రూము'ను అధికారులు ఏర్పాటు చేశారు అందులో 'గుడ్ సమారిటన్, పోలీస్'పేరిట వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు.

పౌరసరఫరాల శాఖ, మెప్మా, విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, పలు ఎన్జీవోలు, యువ వలంటీర్లు, వ్యాపారులు, అధికారులు ఈ విపత్కర సమయంలో చిక్కుకున్న పలువురి ఆకలి తీర్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఈ గ్రూపులో అనాథాశ్రమాలు, వృద్ధజనాశ్రమాల నిర్వాహకులను కూడా సభ్యులుగా చేర్చారు. ఫలితంగా ఎలాంటి వినతి వచ్చినా.. వెంటనే వారికి కావాల్సిన ఆహారం, ఇతర నిత్యావసరాలను అప్పటికప్పుడు దాతలతో మాట్లాడి వారికి చేరవేసేలా చూస్తున్నారు.

సాధారణ వ్యాపారుల నుంచి బహుళజాతీయ కంపెనీల సీఈఓల వరకు అన్నార్తులకు సాయం చేసేందుకు ముందుకు వస్తున్న తీరును చూసి పోలీసులే ఆశ్చర్య పోతున్నారు. విపత్కర పరిస్థితుల్లో తోటి మానవుడిని ఆదుకునేందుకు ముందుకు వస్తోన్న వారినిచూసి గర్వంగా ఉందని పోలీసు ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విరాళాలను చూసి తాము పడుతున్న శ్రమను మర్చిపోతున్నామన్నారు.


రామగుండం కమిషనరేట్ పరిధిలో వలస కూలీలకు నిత్యావసరాలు అందజేస్తున్న పోలీసులు

**విరాళాల వెల్లువ..**

**రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 230కి పైగా వృద్ధజనాశ్రమాలు, అనాథాశ్రమాలకు ఆహారం, బియ్యం, ఉప్పు, పప్పు, నూనె కావాలని 'గుడ్ సమారిటన్ , పోలీస్'గ్రూపును ఆశ్రయిస్తున్నారు. ఈ సమాచారాన్ని వెంటనే విమెన్ అండ్ చైల్డ్ విభాగం, సివిల్ సప్లై విభాగం, ఇతర దాతలు, ఎన్జీవోలకు చేరవేసి కావాల్సిన నిత్యావసరాలు సరఫరా చేయిస్తున్నారు. అలాగే ఇటుక బట్టీ కార్మికులు, యాచకులు, ఇతర రాష్ట్రాల కూలీలు, నిరాశ్రయులకు చాలామంది క్వింటాళ్ల కొద్దీ బియ్యాన్ని, ఇతర పప్పులు, నూనె, మాస్కులు, శానిటైజర్లు, సబ్బులు తదితర నిత్యావసరాలను విరాళంగా ఇస్తున్నారు. ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇచ్చిన నిత్యావసరాలను ఆయా పోలీసుల ద్వారా సజావుగా పంపిణీ చేయిస్తున్నారు. కొందరు స్వచ్ఛంద సంస్థలు దూరమైనా శ్రమకోర్చి అన్నార్తులకు నిత్యావసరాలను చేరవేస్తున్నాయి.**

# అనారోగ్యమా.. అయితే ఫోన్ చేయండి

- వైద్యం కోసం 'హెల్ప్‌లైన్'.. 'ఫోరం ఫర్ పీపుల్స్ హెల్త్ 'సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ఫోన్ నంబర్ : **040-48214595**
- రాష్ట్ర ప్రజలకు ఆన్‌లైన్‌లో ఉచిత వైద్య సేవలు
- 24 గంటలూ అందుబాటులో 140 మంది స్పెషలిస్టులు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ సేవలు నిలిచి పోవడంతో 'ఫోరం ఫర్ పీపుల్స్ హెల్త్ సంస్థ' ఆన్‌లైన్‌లో ఉచిత వైద్య సేవలకు శ్రీకారం చుట్టింది. అందుకోసం హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్న వారైనా హెల్ప్‌లైన్ నెంబర్ : 040–48214595కు ఫోన్ చేస్తే సంబంధిత వైద్యులకు కనెక్ట్ చేస్తారు. తమకున్న సమస్యను డాక్టర్లకు వివరిస్తే ఫోన్‌లోనే మందులను సూచిస్తారు. అవసరమైతే మందుల చీటీ రాసిచ్చి వాట్సాప్‌లో పెడతారు. ఈ సంస్థ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ద్వారా దాదాపు 140 మంది వివిధ స్పెషలిస్ట్ వైద్యులు సూచనలు అందిస్తారు. ఇది రేయింబవళ్లు అందుబాటులో ఉంటుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలంతా దీన్ని ఉపయోగించుకోవాలని సంస్థ తరపున ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సేవలన్నీ ఉచితంగానే ప్రజలకు చేస్తున్నట్లు ఆయన వివరించారు. లాక్‌డౌన్ వల్ల ఇళ్లలోనే ఉండిపోయిన ప్రజలకు ఇటువంటి సేవలు అందిస్తున్నట్లు ఫోరం తెలిపింది. కొందరు ఆసుపత్రులకు వెళ్లాలన్నా ఓపీ బంద్ కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. అందుకే ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

**ఒక్క రోజులో 275 ఫోన్ కాల్స్...**

బుధవారం నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ హెల్ప్‌లైన్‌కు ఒక్కరోజులోనే 275 ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఫోన్ చేసిన బాధితులు, రోగులతో దాదాపు 957 నిమిషాలు డాక్టర్లు మాట్లాడి వారికి సూచనలు ఇచ్చారు. మందులు సూచించారు. కొందరికి వాట్సాప్ ద్వారా మందుల చీటీని పంపించారు. సగటున ఒక్కో కాల్‌కు 4 నిమిషాలు వైద్యులు కేటాయించినట్లు రవీంద్రనాథ్ తెలిపారు. మారుమూల గ్రామం నుండి నగరాలు, పట్టణాల వరకు కూడా ప్రజలు ఫోన్లు చేస్తున్నారన్నారు. ప్రధానంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య అధికంగా కాల్స్ వస్తున్నాయని ఆయన తెలిపారు. కొందరు వైద్యులు, సాంకేతిక వృత్తినిపుణులు తదితరులతో కలిసి దీన్ని ఏర్పాటు చేశామని జనవిజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల ప్రసాద్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com